

అప్పట్లో జీవో జారీకే నగరంలో ర్యాలీ

ఒంగోలులో తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు కేటాయిస్తూ జీవో జారీకే వైసీపీ శ్రేణులు హడావుడి చేశాయి. అప్పట్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం కేటాయించిన రూ.339.93 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. అది జరిగి ఏడాది దాటింది. నేటికీ పనుల్లో పురోగతి కనిపించకపోవడంతో ప్రజలు పెదవివిరుస్తున్నారు.

వైసీపీ వింత పోకడ

జీవోలకే ర్యాలీలు



ఒంగోలు నగరంలో పైపులైన్ లీకులకు చేస్తున్న మరమ్మతులు(ఫైల్)

- ఒంగోలులో తాగునీటి సమస్య పరిష్కారానికి
- ఏడాది క్రితం రూ.339.93 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు
- కేంద్ర ప్రభుత్వ అమృత్ నిధులకు అధికార పార్టీ నేతల హడావుడి
- అప్పట్లో నగరంలో భారీ బైక్ ర్యాలీ.. నేటికీ ప్రారంభంకాని పనులు
- ఇప్పుడు ఇళ్ల స్థలాల కోసం నిధులు కేటాయిస్తూ జీవో
- మరోసారి ప్రదర్శనకు సిద్ధమైన వైసీపీ శ్రేణులు
- ప్రజల నుంచి విమర్శలు



ఒంగోలు నగరం శివారు కాలనీలో నీటిని మోసుకెళ్తున్న మహిళలు

వైసీపీ నేతల ప్రచార పిచ్చి పతాకస్థాయికి చేరింది. గతంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా జీవో జారీలకే జబ్బలుచరుచుకుంటూ ర్యాలీలు చేయడం ఒంగోలులో సర్వసాధారణమైంది. సరిగ్గా ఏడాది క్రితం కేంద్రం ఇచ్చిన అమృత్ నిధులు రూ.339.93 కోట్లు మొత్తం రాష్ట్రమే మంజూరు చేసినట్లు వైసీపీ నేతలు హడావుడి చేశారు. నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కానీ ఇప్పటి వరకూ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు పెదవివిరుస్తున్నారు. ఇప్పుడు ఒంగోలులో పేదలకు ఇళ్ల పట్టాల కోసం అవసరమైన భూసేకరణకు రూ.180 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో మరోసారి వైసీపీ నేతలు ర్యాలీకి సిద్ధమవడం చూసి జనం నవ్వుకుంటున్నారు. ఏడాది క్రితం జారీ అయిన జీవో ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదు... కొత్త వాటికి ర్యాలీలా? అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. జీవోలతో ప్రదర్శనలు చేస్తూ సంబరపడిపోతున్న అధికార పార్టీ నాయకులు పనుల పురోగతిపై దృష్టిపెట్టకపోవడాన్ని విమర్శిస్తున్నారు.

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 21 : ఒంగోలుకు రోజూ తాగునీటి సరఫరా కోసం గత టీడీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం-1 కింద రూ.123 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో గుండ్లకమ్మ నుంచి ఒంగోలులోని వేసవి చెరువులకు నీటి సరఫరా కోసం పైప్‌లైన్‌ల పనులు చేపట్టారు. అప్పట్లో 70 శాతం పనులు పూర్తి చేయగా, ఎన్నికలు రావడంతో మిగిలినవి నిలిచిపోయాయి. గత నాలుగున్నరేళ్లుగా పురోగతి కరువైంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలకు కేటాయించే నిధుల్లో భాగంగా ఒంగోలుకు అమృత్ 2.0 పథకం కింద తాగునీటి అవసరాల కోసం ఏడాది క్రితం నిధులు మంజూరు చేసింది. అయితే దీనిపై అప్పట్లో

అమృత్ నిధుల కేటాయింపు ఇలా..

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమృత్ పథకం 2.0 కింద మొత్తం 239 నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలను ఎంపిక చేసింది. అందులో కేంద్రం వాటా 1065.594 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా 1189.801 కోట్లు, కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీల వాటా రూ.695.748 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.200.331 కోట్లు ఉపయోగించాల్సి ఉంది. అందులో భాగంగానే ఒంగోలు నగరానికి రూ.339.93 కోట్లు తాగునీటికి కేటాయించింది. అయితే ఈ మొత్తం నిధులన్నీ వైసీపీ ప్రభుత్వమే భరిస్తున్నట్లు ప్రచారం చేసుకోవడంపై విమర్శలు వినిపించాయి.

రాష్ట్రం వాటా రూ.196.32 కోట్లు మాత్రమే

ఒంగోలు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం సరిగ్గా గత ఏడాది జనవరి 20న నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అందులో కేంద్రం వాటాగా రూ.110.87 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.196.32, ఒంగోలు కార్పొరేషన్ ఫండ్ రూ.1.91, మెయింటెనెన్స్ కింద కార్పొరేషన్ భాగస్వామ్యం రూ.7.29 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.23.54 కోట్లు వెరసి మొత్తం రూ.339.93 కోట్లు కేటాయించింది.

టెండర్లు పూర్తయినా ప్రారంభం కాని పనులు

నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం నిధులు కేటాయిస్తూ జీవో జారీ చేసిన కొద్దిరోజులకే టెండర్‌లు కూడా పూర్తయినట్లు సమాచారం. కేంద్రం తొలివిడతగా నిధులు విడుదల చేసినా టెండర్‌లో పాల్గొన్న వారికి పనులు కేటాయిస్తూ వర్క్ ఆర్డర్ ఇంత వరకూ ఇవ్వలేదు. ప్రస్తుతం నిధులు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీయూఎఫ్‌ఐడీసీ)లోనే ఉన్నట్లు తెలుస్తోంది. మరో రెండు నెలల్లో ఎన్నికలు వచ్చే అవకాశం కనిపిస్తుండగా, పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

వైసీపీ ప్రభుత్వం తాము నిధులు కేటాయించినట్లు నానా హడావుడి చేసింది. ఆపార్టీ శ్రేణులు జీవో జారీకే నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి గొప్పలుపోయారు. కానీ నేటికీ అతీగతీ కరువైంది. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టిడ్కో ఇళ్లను పాడుబెట్టి.. కొత్తగా ఇళ్ల పట్టాలా?

గతంలో అనేక ప్రభుత్వాలు పలు అభివృద్ధి పనులకు, సంక్షేమ పథకాలకు జీవోలు జారీ చేశాయి. కానీ వైసీపీ తరహాలో ఎవరూ ర్యాలీలు చేయలేదు. ఇలా జీవోలకు ర్యాలీలు, బహిరంగ సభలతో సరిపెట్టుకుని సంతోషపడటం తప్ప సమస్యల పరిష్కారం గురించి పట్టించుకునే నాథుడేలేడని ప్రజలు వాపోతున్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల కేటాయింపుపై నోరుమెదపని వైసీపీ నేతలు ఇప్పుడు కొత్తగా జగనన్న కాలనీల కోసం అవసరమైన స్థలం కొనుగోలుకు నిధులు కోరడం, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం హడావిడిగా రూ.180 కోట్లు విడుదల చేయడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంత వరకూ స్థలం కొనుగోలు కూడా చేయలేదు.. ఇక పట్టాలు ఎప్పుడు ఇస్తారు? ఇళ్ల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుంది? అని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల వేళ ఇదో కొత్త తరహా ఎత్తుగడ అని అభిప్రాయపడుతున్నారు. పేదలపై ప్రేమ ఉంటే ఆ రూ.180 కోట్లు టిడ్కో ఇళ్ల పనులకు కేటాయిస్తే వేల మందికి సొంత ఇంటి కల నెరవేరుతుంది కదా అన్న వాదనను వినిపిస్తున్నారు. గత ఏడాది జీవోకే దిక్కులేదు. తాజా జీవోతో హడావుడా అంటూ ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి.



లీకుల వద్ద హెచ్చరికలు ఇలా(ఫైల్)

జనం కోసం ఆర్పీలు, సెక్రటరీలు, వలంటీర్లపై ఒత్తిడి


ఒంగోలు నగరంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం రూ.180 కోట్లు విడుదల చేయడంతో ఆపార్టీ శ్రేణులు తెగ సంబరపడిపోతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు ఒంగోలు కర్నూలు రోడ్డు బైపాస్ నుంచి నగరంలో ర్యాలీతోపాటు, స్థానిక చర్చి సెంటర్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. దీంతో ఆపార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి పెంచారు. ప్రజలను పెద్ద సంఖ్యలో సమీకరించేందుకు ఆర్పీలను సమాయత్తం చేశారు. ఒక్కో ఆర్పీ కనీసం వంద మందికి తగ్గకుండా, అదనంగా మరో ఐదుగురు బైక్‌లపై హాజరయ్యేలా చూడాలని మెప్మా, కార్పొరేషన్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ సెక్రటరీలు, వార్డు వలంటీర్లపై కూడా ఒత్తిడి పెంచారు. ఇదిలా ఉండగా శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పుట్టిన రోజు సందర్భంగా నగరమంతా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా, వాటిని సోమవారం ఒంగోలులో జరిగే వైసీపీ సభ కోసం హడావిడిగా రాత్రికి రాత్రే తొలగించారు. అయితే గతంలో నెలల తరబడి వైసీపీ ఫ్లెక్సీలు నగరంలో ఉంచినప్పటికీ పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు సైతం 24 గంటలు గడవక ముందే టీడీపీ ఫ్లెక్సీలను తొలగించడం పాలకుల పెత్తనానికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఎస్‌ఈబీలో భారీగా బదిలీలు

- ఐదుగురు సీఐలకు స్థానచలనం
- ఇతర జిల్లాల నుంచి ఎనిమిది మంది రాక
- 11 మంది ఎస్సైలు కూడా..

ఒంగోలు (క్రైం), జనవరి 21 : ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ)లో భారీగా బదిలీలు జరిగాయి. జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు సీఐలకు స్థానచలనం కల్పించారు. ఈ స్థానాలతోపాటు ఇప్పటికే ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఇతర జిల్లాల నుంచి ఎనిమిది మందిని నియమించారు. మరో 11 మంది ఎస్సైలను కూడా బదిలీ చేశారు. ఈమేరకు ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఒంగోలులో సీఐగా పనిచేస్తున్న బి.లతను గుంటూరు-2కు పంపారు. ఆస్థానంలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో పనిచేస్తున్న బి.సూర్యనారాయణను నియమించారు. మార్కాపురంలో పనిచేస్తున్న ఎస్.రామయ్యని నెల్లూరు-2కు, కావలిలో పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును మార్కాపురంనకు బదిలీ చేశారు. కనిగిరిలో పనిచేస్తున్న జలీల్‌ను పల్నాడు జిల్లా వినుకొండకు స్థానచలనం కల్పించారు. ఆస్థానంలో రేపల్లెలో పనిచేస్తున్న లీనాను నియమించారు. ఎర్రగొండపాలెం ఎస్ఈబీ సీఐగా ఉన్న వెంకటరమణను పల్నాడు జిల్లా గురజాలకు పంపారు. ఆస్థానంలో ఎవ్వరినీ నియమించలేదు. గిద్దలూరులో పనిచేస్తున్న అరుణకుమారిని తిరుపతి జిల్లా నాయుడుపేటకు పంపారు. అక్కడ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సీఐగా ఉన్న ఎస్.కొండారెడ్డిని నియమించారు. ఖాళీగా ఉన్న పొదిలి సీఐగా పల్నాడు జిల్లా ఈపూరులో పనిచేస్తున్న బి.ఈశ్వరయ్యను బదిలీ చేశారు. సింగరాయకొండకు నెల్లూరు జిల్లా కోవూరులో పనిచేస్తున్న పి.నరహరిరావును, నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో పనిచేస్తున్న ఎం.బాలకృష్ణను కంభం, మంగళగిరిలో పనిచేస్తున్న మరియబాబును చీమకుర్తికి స్థానచలనం కల్పించారు.

ఎస్సైల బదిలీలు



జిల్లా నుంచి 11 మంది ఎస్సైలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. వారిస్థానాల్లో ఇతర జిల్లాలలో పనిచేస్తున్న వారిని నియమించారు. ఒంగోలులో పనిచేస్తున్న గోపాలకృష్ణను మార్కాపురం పంపారు. గుంటూరు-2లో పనిచేస్తున్న కల్యాణ చక్రవర్తిని దర్శి, పత్తిపాడులో పనిచేస్తున్న చుండూరి గీతను ఒంగోలు, తెనాలిలో పనిచేస్తున్న వినీతారెడ్డిని చీమకుర్తి, గుంటూరు ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న ఎస్‌కే రిహానాను ఒంగోలు ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేశారు. పెదకూరపాడులో పనిచేస్తున్న ఫణికుమార్‌ను గిద్దలూరు, గురజాలలో పనిచేస్తున్న వై.మోహన్‌ను ఎర్రగొండపాలెం, ఈపూరులో పనిచేస్తున్న సైమన్‌ను కనిగిరికి స్థానచలనం కల్పించారు.

అంతా రామమయం

- నేడు అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ
- జిల్లా అంతటా ముందస్తుగానే ఆధ్యాత్మిక శోభ



ఒంగోలులో శ్రీరామ కల్యాణం



ఒంగోలు శోభాయాత్రలో అశేషంగా పాల్గొన్న భక్తులు

అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా భారీ స్థాయిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. అందుకోసం హిందూ ధార్మిక సంస్థలు ఏర్పాట్లు చేశాయి. ఇప్పటికే అయోధ్య నుంచి వచ్చిన అక్షతలు, శ్రీరాముని చిత్రపటం మొదలైన వాటిని ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. అనేక దేవాలయాలలో ఆదివారమే శ్రీసీతారామ కల్యాణాలు, శోభాయాత్రలు ఘనంగా నిర్వహించారు. ఒంగోలులో ముందుగానే ఆధ్యాత్మికత సంతరించుకుంది.

- ఒంగోలు (కల్చరల్)

ఓటర్ల తుది జాబితా రెడీ

- నేడు పోలింగ్ కేంద్రాల్లో ప్రచురణ
- వీటితోనే ఎన్నికలు
- జిల్లాలో కొత్తగా 39,442 మంది యువ ఓటర్లు
- చనిపోయిన 23వేల మందివి తొలగింపు

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 21 : ఓటర్ల తుది జాబితాలు సిద్ధమయ్యాయి. సోమవారం వీటిని ప్రచురించనున్నారు. అందుకు అవసరమైన అన్ని చర్యలను ఎన్నికల అధికారులు తీసుకున్నారు. జిల్లాలోని 2,183 పోలింగ్ కేంద్రాల్లో జాబితాలను ప్రచురించడంతోపాటు గుర్తింపు పొందిన ఏడు రాజకీయ పార్టీలకు వాటిని ఇవ్వనున్నారు. గత ఏడాది అక్టోబరు 27న ముసాయిదా జాబితాను ప్రకటించారు. ఆ సమయంలో జిల్లాలో 17,80,145 మంది ఓటర్లు ఉన్నారు. అనంతరం చేపట్టిన చేర్పులు, మార్పుల సమయంలో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ప్రతిపక్షాలు ఆందోళనలు చేశాయి. ఈనేపథ్యంలో తుది ఓటర్ల జాబితాలో ఎంతమంది ఉన్నారన్నది చర్చనీయాంశమైంది.

39,442 మందికి కొత్తగా ఓటు

జిల్లావ్యాప్తంగా ఈ పర్యాయం కొత్తగా యువత ఓట్లు 39,442 నమోదయ్యాయి. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇవి కీలకం కానున్నాయి. ఎన్నికల కమిషన్ యువత ఓట్ల నమోదుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో అందుకు అనుగుణంగా డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 51వేల మంది యువతీయువకుల ఓట్లు నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. వారిలో 39,442 మందికి ఓటు హక్కు కల్పించారు. ఈవిషయంలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. అయితే ఆ పేరుతో అర్హుల ఓట్లను కూడా తొలగించారన్న ఆరోపణలు ఉన్నాయి.



సిద్ధం చేస్తున్న ఓటర్ల జాబితాలు

చేర్పులు, మార్పుల కోసం భారీగా దరఖాస్తులు

జిల్లాలో ఓటర్ల సవరణ ప్రక్రియ సమయంలో చేర్పులు, మార్పులు, తొలగింపుల కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. అన్ని రకాలు కలిపి సుమారు 3.10 లక్షలు అధికారులకు అందాయి. వాటిలో ఫారం-6లు 80వేలు, ఫారం-7లు 45వేలు, ఫారం-8లు 1.90 లక్షలు ఉన్నాయి. వాటిపై బూత్‌లెవల్ అధికారులు విచారణ చేశారు. ఆ సమయంలో ప్రతిపక్షాలకు చెందిన వారి ఓట్లను గల్లంతు చేసేలా ఎన్నికల అధికారులు నోటీసులు ఇచ్చారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

మృతుల ఓట్లు 23వేలు తొలగింపు

ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం కూడా మృతుల ఓట్లు అలాగే ఉన్నాయి. దీనిపై జిల్లావ్యాప్తంగా విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో మృతుల వివరాలను సేకరించి వారి ఓట్లను తొలగించారు. అలా జిల్లావ్యాప్తంగా సుమారు 23వేల మంది మృతుల ఓట్లను తొలగించినట్లు సమాచారం.

నేడు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురణ

జిల్లాలోని 2,183 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలను సోమవారం ప్రచురించేందుకు ఏర్పాట్లు చేశారు. ముందుగా జాబితాలను నియోజకవర్గాల వారీగా విభజించారు. వాటిని ఆయా నియోజకవర్గాలకు పంపి అక్కడి నుంచి మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలకు చేరుస్తున్నారు. ఆదివారమే ఈ ప్రక్రియ ప్రారంభమైంది.

బదిలీలపై కసరత్తు

తుది ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం అధికారుల బదిలీల ప్రక్రియ ఊపందుకోనుంది. ఇప్పటికే జోనల్ స్థాయిలో తహసీల్దార్ల బదిలీలు ప్రారంభమయ్యాయి. మనజిల్లా నుంచి ఐదుగురు నెల్లూరు జిల్లాకు వెళ్లగా, ఆ జిల్లా నుంచి ఇక్కడికి ముగ్గురు వచ్చారు. త్వరలో ఎంపీడీవోలు, జిల్లాకు చెందిన ఇతర అధికారులు కూడా బదిలీ అయ్యే అవకాశం ఉంది.

గిద్దలూరు వైసీపీలో మరో ట్విస్ట్

టికెట్ కోసం మళ్లీ రంగంలోకి రాంబాబు

- పోటీపడ్డ రెడ్డి సామాజికవర్గం నాయకులు
- హైదరాబాద్‌లో పంచాయితీ
- అన్ని విషయాలు సీఎం దృష్టికి : బాలినేని

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గిద్దలూరు అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థి ఎంపిక విషయంలో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. రెడ్డి సామాజికవర్గంలో దీటైన అభ్యర్థి కోసం ఆపార్టీ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి సమాలోచనలు చేస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు మళ్లీ రంగంలోకి వచ్చారు. గిద్దలూరు నుంచి తిరిగి తాను పోటీచేయనని గత నెలలో రాంబాబు ప్రకటించిన విషయం విదితమే. ఆతర్వాత సీఎంను కలిసినప్పుడు కూడా అదేమాట చెప్పి వచ్చారు. అనంతరం గిద్దలూరు నుంచి బాలినేనిని రంగంలోకి దించాలని అధిష్ఠానం ప్రయత్నించడం, ఆతర్వాత అనేక మలుపులు చోటుచేసుకున్న విషయం విదితమే. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులను సీఎం సమకూర్చడంతో ఒంగోలు నుంచే పోటీకి బాలినేని సిద్ధమయ్యారు. దీంతో గిద్దలూరు నుంచి రెడ్డి సామాజికవర్గం వారికి అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో దీటైన అభ్యర్థికోసం అన్వేషణ ప్రారంభించారు. శనివారం సీఎంను బాలినేని కలిసినప్పుడు టికెట్ ఆశిస్తున్న వారిలో తగు ఆర్థికస్తోమత ఉన్న వారిని ఎంపికచేయాలని సూచించారు. దీంతో పలువురు ఆశావహులు ఆదివారం హైదరాబాద్ వెళ్లి బాలినేనిని కలిశారు.

రాంబాబుకే టికెట్ ఇవ్వాలని అనుచరుల విజ్ఞప్తి

నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే రాంబాబు అనుచరులు పెద్దసంఖ్యలో బాలినేని వద్దకు చేరారు. ఎమ్మెల్యే రాంబాబు పోటీకి సిద్ధంగా ఉన్నారని, తిరిగి ఆయనకే అవకాశం ఇవ్వాలని వారంతా బాలినేనిని కోరారు. పోటీచేయనని రాంబాబు ప్రకటించిన విషయాన్ని బాలినేని ప్రస్తావించగా మీరు (బాలినేని) గిద్దలూరు నుంచి పోటీచేస్తారన్న ఉద్దేశంతో రాంబాబు ఆ ప్రకటన చేశారని, ఇప్పుడు మీరు ఒంగోలు నుంచే బరిలోకి దిగేందుకు సిద్ధపడిన నేపథ్యంలో ఆయన పోటీకి రెడీ అయ్యారని చెప్పినట్లు తెలిసింది. ఆయనకే అవకాశం ఇవ్వాలని వారు కోరారు. అయితే ఆర్థికంగా ఇబ్బంది ఉందని రాంబాబు చెప్పారు కదా అని బాలినేని అనగా తామంతా సహకరిస్తామని వారు చెప్పినట్లు తెలిసింది.



రెడ్డి సామాజికవర్గం నేతల పట్టు

బాలినేని సూచనతో టికెట్ ఆశిస్తూ హైదరాబాద్ వెళ్లిన రెడ్డి సామాజికవర్గం నాయకులు మాలో ఒకరికే అవకాశం ఇవ్వాలని, మళ్లీ వెనుకడుగు వేయకూడదని పట్టుబట్టినట్లు సమాచారం. నియోజకవర్గానికి చెందిన నాయకుల్లో రమణారెడ్డి, ఐవీ రెడ్డి, చేగిరెడ్డి లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులతోపాటు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి కుమారుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కూడా బాలినేనిని కలిసి టికెట్ అడిగిన వారిలో ఉన్నారు. కొత్తగా రంగంలోకి వచ్చిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తనకు సమీప బంధువైన అనంతపురం జిల్లాకు చెందిన ఒక వైసీపీ నాయకుడితో ముందుగానే సీఎంను కూడా కలిసి టికెట్ కోసం విజ్ఞప్తిచేసినట్లు సమాచారం. పోటీచేయనని ప్రకటించిన రాంబాబు తిరిగి తెరపైకి రావడం వెనుక ఏదో కుట్ర ఉందని టికెట్ ఆశిస్తున్న రెడ్డి సామాజికవర్గ నేతలంతా బాలినేని వద్ద అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిసింది. చివరగా బాలినేని మాట్లాడుతూ.. అన్ని విషయాలు సీఎంతో మాట్లాడతానని, ఆయన తీసుకునే నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించినట్లు సమాచారం. అయితే తిరిగి రాంబాబు రంగంలోకి రావడం నియోజకవర్గ వైసీపీలోని ఆయన వ్యతిరేక, అనుకూల వర్గాల్లో తీవ్రచర్చనీయాంశమైంది. ఈనేపథ్యంలో సీఎం ఎవరివైపు మొగ్గుచూపుతారనేది తేలాల్సి ఉంది. అయితే అందరినీ పక్కనపెట్టి స్థానికేతర నాయకుడిని రంగంలోకి దింపే అవకాశం కూడా లేకపోలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల విధుల నుంచి కొందరికి మినహాయింపు

ఒంగోలు(విద్య), జనవరి 21 : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల విధుల నుంచి పలువురు అధికారులకు మినహాయింపు ఇస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఆరు నెలల్లో అంటే ఈఏడాది జూన్ 30లోపు ఉద్యోగ విరమణ చేసే అధికారులకు ఈ నిబంధన వర్తిస్తుంది. అలాంటి వారికి ఇప్పటికే ఏమైనా ఎన్నికల బాధ్యతలు అప్పగించి ఉంటే వాటి నుంచి మినహాయింపు ఇవ్వాలి. అదేవిధంగా వారు ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా నుంచి బదిలీ చేయకుండా అదేస్థానంలో కొనసాగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు అంగన్‌వాడీల చలో విజయవాడ

వైసీపీ ప్రభుత్వంతో అమీతుమీకి సిద్ధం ● అడ్డుకునేందుకు నోటీసులు ఇస్తున్న పోలీసులు ● ఆందోళనకు వేలాదిగా తరలిపోతున్న అంగన్‌వాడీలు



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు



సీఐటీయూ నేత రాముకు నోటీసు ఇస్తున్న పోలీసు

ఒంగోలు నగరం, జనవరి 21: గత 41 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు ఇక ప్రభుత్వంతో అమీతూమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు జిల్లా కేంద్రాలు, ఐసీడీఎస్ ప్రాజెక్టు కేంద్రాలు, మండల కేంద్రాల్లో వివిధ పద్ధతుల్లో ఆందోళన చేసిన అంగన్‌వాడీలు ప్రభుత్వ మొండివైఖరితో ఆందోళనను ఉధృతం చేసే దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈక్రమంలో సోమవారం అంగన్‌వాడీలు వేలాదిగా తరలిపోయి ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు నివాసం ఉండే విజయవాడలోనే ప్రభుత్వంతో అమీతూమీ తేల్చుకునేందుకు సన్నద్ధమయ్యారు. జిల్లాలోని వేలాదిగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను విజయవాడకు తరలిరావాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి అన్నపూర్ణ వాట్సాప్ ద్వారా వాయిస్ మెసేజ్‌లను చేశారు. కర్ణాటక రాష్ట్రంలోని అంగన్‌వాడీలు వేలాదిగా రాజధాని బెంగళూరును చుట్టిముట్టి తమ డిమాండ్లను సాధించుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అంగన్‌వాడీలు కూడా ఇదే పద్ధతిలో విజయవాడను ముట్టడి చేసి తమ డిమాండ్లను సాధించుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద జరుగుతున్న నిరాహార దీక్షల శిబిరం వద్దకు పోలీసులు చేరుకుని విజయవాడలో జరిగే ఆందోళనకు వెళ్ళవద్దంటూ నోటీసులు జారీ చేసేందుకు ప్రయత్నించారు. కానీ అంగన్‌వాడీలు ఈ నోటీసులను అందుకునేందుకు నిరాకరించారు. అంగన్‌వాడీలు రాత్రికి రాత్రే విజయవాడకు పయనమయ్యారు.

చావో రేవో తేల్చుకుంటాం..

అంగన్‌వాడీలు ప్రభుత్వంపై తీవ్రవత్తిడి తెచ్చి తమ డిమాండ్లను సాధించుకునేందుకు సిద్ధమయ్యారు. 41 రోజులుగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, ఇక చావోరేవో తేల్చుకుంటామని స్పష్టం చేస్తున్నారు. తమ భర్తలకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని, ఉద్యోగం ఊడిపోతుంది.. వెంటనే డ్యూటీలో చేరమని చెప్పు అంటూ బెదిరిస్తున్నారని అంగన్‌వాడీలు ఆరోపిస్తున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకు విజయవాడను విడిచిపెట్టేది లేదంటూ అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. పోలీసులు ఎన్ని నిర్బంధాలు పెట్టినా మారువేషాల్లో అయినా విజయవాడ చేరుకోవాలని యూనియన్ నాయకుల నుంచి క్షేత్ర స్థాయిలో ఉన్న అంగన్‌వాడీలకు మెసేజ్‌లు వెళ్ళాయి. దీంతో జిల్లా నుంచి కూడా వేలాది మందిగా విజయవాడ నగరానికి సోమవారం ఉదయానికల్లా చేరుకునేందుకు తరలివెళ్లారు. నాలుగు రోజుల పాటు విజయవాడలోనే ఉండి ఆందోళనలో పాల్గొనేలా విజయవాడ తరలిరావాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. దీంతో అన్ని జిల్లాల నుంచి విజయవాడ వచ్చే వేలాది మంది అంగన్‌వాడీలతో ప్రభుత్వానికి తమ సత్తా ఏమిటో చూపించనున్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారంతో 41వరోజుకు చేరింది. సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అయ్యప్పరెడ్డి మాట్లాడుతున్న సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల స్థానంలో కొత్తవారిని నియమిస్తామనటం దారుణమన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటసుబ్బమ్మ, దుర్గాభవానీ, అరుణ, రజిని, రమ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల నోటీసులు

టంగుటూరు: తాడేపల్లిలో సోమవారం జరిగే రాష్ట్ర సచివాలయ ముట్టడికి వెళ్లవద్దని హెచ్చరిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలకు పోలీసులు ఆదివారం నోటీసులు జారీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ పిలుపు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సచివాలయ ముట్టడికి అంగన్‌వాడీ కార్యకర్తలు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. టంగుటూరులో అంగన్‌వాడీలు ధర్నా చేస్తున్న శిబిరానికి వెళ్లి పోలీసులు నోటీసులు అందజేశారు. కొందరు కార్యకర్తలను ఇళ్ల వద్ద కలసి నోటీసులిచ్చారు. సచివాలయ ముట్టడికి అనుమతి లేదని, అక్కడ 144 సెక్షన్, పోలీస్ యాక్టు అమలులో ఉన్నాయని, తమ ఆదేశాలను ధిక్కరించి తాడేపల్లి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం సాయంత్రానికి మొత్తం 50 మంది అంగన్‌వాడీలకు నోటీసులు అందించినట్లు ఎస్సై ఖాదర్‌బాషా చెప్పారు. అలాగే ప్రత్యేకించి ధర్నాకు నాయకత్వం వహిస్తున్న అంగన్‌వాడీల యూనియన్ నాయకులకు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రాముకు పోలీసులు నోటీస్ జారీచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

రాక్షస పాలనను అంతమొందించాలి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్

మద్దిపాడు, జనవరి 21: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనను అంతమొందాల్సిన సమయం వచ్చిందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇనమనమెళ్లూరులో ఆయన టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నో సంక్షేమ ఫలాలు అందించిదని, డ్వాక్రా మహిళలకు రుణాలు సైతం చంద్రబాబు హయాంలోనే ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతోపాటు అనేక సంక్షేమ పథకాలను చంద్రబాబు అమలుచేయనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకలుఉ భావన్నారాయణ, మందపల్లి శ్రీనివాసరావు, డొప్ప సుబ్బయ్య, శేషయ్య, గంగవరపు జోసఫ్, ప్రభాకర్‌రెడ్డి, దేవబత్తిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శ



నరసింహారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి21: ఒమ్మెవరం గ్రామానికి చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి పిన్నింటి నరసింహారావును ఆదివారం అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. స్థానిక నరసింహారావు గృహానికి విచ్చేసిన రవికుమార్ మాట్లాడుతూ నిబద్ధతో పనిచేసిన ఉద్యోగులను పరామర్శించటం మన బాధ్యతన్నారు. ప్రజలకు మంచి సేవలు అందించిన ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలపర్తి బాలకోటి, కొమ్మాలపాటి సురేష్, కనగాల శ్రీనివాసరావు, కె.సెల్వం, పిన్నింటి గోపీ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి నాగేశ్వరరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న కళాకారులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 21: పౌరాణిక, సాంఘిక రంగస్థల నటుడు చీమకుర్తి నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఒంగోలులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు రంగస్థల కళాకారులు ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. బండారు రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలి అధ్యక్షులు అల్లూరు శాంతారావు మాట్లాడుతూ చీమకుర్తి నాగేశ్వర రావు తన పద్యాలతో, విశిష్టమైన నటనా చాతుర్యంతో జిల్లాఖ్యాతిని దేశవిదేశాలకు చాటిచెప్పారన్నారు. కేవలం రంగస్థల నటుడే కాకుండా ఎంతోమంది నటులను తయారుచేసిన ఘనత నాగేశ్వరరావుకు దక్కిందని చెప్పారు. కార్యక్రమంలో మిడసల మల్లిఖార్జున రావు, కనమాల రాఘవులు, జయరాం, లక్ష్మారెడ్డి, అంగలకుర్తి ప్రసాద్, బి.వెంకటేశ్వర్లు, రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

కడలిపుత్రుల కడుపు కొట్టిన జగన్

టీడీపీ హయాంలో ఇచ్చిన సబ్సిడీలను రద్దు చేయడం దుర్మార్గం ● ఎమ్మెల్యే స్వామి ధ్వజం



అర్ధంతరంగా నిలిపివేసిన టూరిస్టు రెస్టారెంట్‌ను చూపుతున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, జనవరి 21 : వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భరోసాకు రకరకాల కొర్రీలు పెట్టి కడలి పుత్రుల కడుపు కొట్టిన దుర్మార్గుడు జగన్ అని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. రాష్ట్రంలో 20 లక్షలకు పైగా మత్స్యకారులు ఉంటే కేవలం లక్షమందికి అరకొర సాయం చేస్తూ వారిని వైసీపీ ప్రభుత్వం వంచిస్తోందని విమర్శించారు. తొలుత వేట నిషేధ సమయంలో రూ.4వేల భృతిని ఇచ్చి ఆదుకున్న ప్రభుత్వం తెలుగుదేశమేనన్నారు. కుటుంబంలో నలుగురు చేపల వేటకు వెళ్తుంటే ఒకరికే భృతిని ఇవ్వడం దుర్మార్గం అని చెప్పారు. పాకల గ్రామంలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో స్వామి మాట్లాడారు. గత టీడీపీ 5 ఏళ్లపాలనలో మత్స్యకారుల సంక్షేమానికి రూ.800 కోట్లు ఖర్చు చేశామని, అలాగే 50 ఏళ్లకే పింఛన్లు ఇచ్చి భరోసా ఇచ్చామని చెప్పారు. సబ్సిడీలతో బోట్లు, వలలు, డీజిల్, టీవీఎస్ మోపెడ్‌లు, ఐస్ బాక్సులు అందజేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జీవో నెంబర్ 217 తీసుకొచ్చి మత్స్యకారులను చెరువుల్లో చేపలు పట్టే అవకాశం లేకుండా వాటిని బలవంతంగా లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 30ను తీసుకొచ్చి మత్స్యకారులకు వచ్చే సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేశారని దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లు జగన్ అసమర్ధత వలన 24 శాతానికి తగ్గాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో పాకల తీరాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేయడానికి రూ.4 కోట్లతో టూరిస్టు రెస్టారెంట్ పనులను ప్రారంభించి సగం పైగా పనులు పూర్తి చేస్తే వైసీపీ వచ్చాక ఆ పనులను అర్ధంతరంగా నిలిపివేశారని విమర్శించారు. మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు హయాంలో బకింగ్‌హామ్ కాలువపై మత్స్యకారుల రాకపోకలు సాగించడానికి వీలుగా బ్రిడ్జీలు నిర్మించారని గుర్తు చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, టీడీపీ నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, పులి ప్రసాదు, మందల గాంధీచౌదరి, సుదర్శి చంటి, చిగురుపాటి గిరి, మించల బ్రహ్మయ్య, గుదే వెంకటేశ్వర్లు, నన్నిబోయిన మాలకొండయ్య, పోతురాజు, కన్నా శ్యామ్ ప్రసాద్, పిన్ని శ్రీను, జమ్ము శంకర్, కళ్లగుంట నరసింహ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని



మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 21 : వైసీపీ ప్రభుత్వం ఇంటికెళితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని భాగ్యనగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను, నిరుద్యోగులను మోసం చేసిన ఘనత సీఎం జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్పొరేషన్‌ల ద్వారా ఒక్కరూపాయి కూడా నిధులు కేటాయించలేదని, రుణాలు ఇవ్వలేదన్నారు. మద్య నిషేధం పేరుతో జె.బ్రాండ్‌లను అందుబాటులోకి తెచ్చి మోసం చేశారని విమర్శించారు. పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్యుడు బతికే పరిస్థితి లేదన్నారు. చెత్తపై పన్ను విధించిన చెత్త ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో మీడియా కో ఆర్డినేటర్ బెజవాడ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితుల జీవితాలతో ఆడుకుంటున్న జగన్

దళితులపై కపట ప్రేమ చూపిస్తూ వారి జీవితాలతో ఆటలాడుకుంటున్న సైకో సీఎం జగన్మోహన్ రెడ్డి అని తెలుగు మహిళలు విమర్శించారు. ఆదివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కోడి కత్తి కేసులో శ్రీనును అన్యాయంగా ఇరికించి, ఐదేళ్ళుగా జైలుకే పరిమితం చేశారన్నారు. ఈ కేసులో జగన్ కోర్టుకు హాజరుకాకుండా ఉద్దేశ్యపూర్వకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. నాడు తనపై చంద్రబాబు దాడి చేయించారంటూ దుష్ప్రచారం చేశారని, వాస్తవాలు ప్రజలకు తెలిసేసరికి ఇపుడు కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో తెలుగు మహిళలు ఆర్ల వెంకటరత్నం, రావుల పద్మజ, టి.అనంతమ్మ, నాళం నరసమ్మ, బీరం అరుణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న జయహో బీసీ సభను జయప్రదం చేయండి

● టీడీపీ మండలాధ్యక్షుడు జయంత్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న జయంత్‌బాబు

మద్దిపాడు, జనవరి 21: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఈ నెల 26వ తేదీన నిర్వహించే జయహో బీసీ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు కోరారు. ఆదివారం మద్దిపాడు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలు అధికసంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు మండలంలోని వివిధ గ్రామాల బీసీ నాయకులతో చర్చించారు. అనంతరం జిల్లా బీసీ నాయకుడు బాపట్ల వెంకటేశర్లు మాట్లాడుతూ సీఎం జగన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి పదవులకు దూరం చేశారని విమర్శించారు. బీసీల పట్ల మోసపూరిత వైఖరిని అవలంబిస్తున్నారని మండిపడ్డారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులను దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. ఇసుక ధరలను అనూహ్యంగా పెంచి బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీలను ఇళ్ల నిర్మాణాలకు దూరం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మందపల్లి శ్రీనివాసరావు, యరగర్ల కృష్ణచైతన్య, సుద్దపల్లి అనిల్, కడియాల రఘుబాబు, వేల్పుల నాగరాజు, సుబ్బారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టును సాగర్‌నీటితో నింపాలి



మంత్రి నాగార్జునకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి21: గుండ్లకమ్మ ప్రాజెక్టును నాగార్జున సాగర్ నీటితో తక్షణమే నింపేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం రైతు సంఘం నాయకులు ఆదివారం ఒంగోలులో ఇన్‌చార్జి మంత్రి మెరుగ నాగార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు జె.జయంత్‌బాబు మాట్లాడుతూ గుండ్లకమ్మప్రాజెక్ట్‌కు సాగర్ నుంచి 2టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు. ప్రాజెక్ట్ ఎడమ కాలువ పరిధిలో మిరప పంట పదివేల ఎకరాల్లో సాగు చేశారని, ప్రతి ఎకరానికి రూ.లక్షన్నరకు పైగా రైతులు ఖర్చు చేశారని, అయితే నీరు లేక పంటదెబ్బతినే స్థితికి చేరుకుందని చెప్పారు. అందువల్ల గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌కు సాగర్ నీటిని విడుదల చేసి మిరపరైతులను ఆదుకోవాలని, లేకుంటే తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ సీఎం మాట్లాడి సాగర్‌నీటి విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పమిడి వెంకటరావు, ఎస్‌కే.మాబు, వెంకట్రావు, యోనా తదతరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రేపు విభిన్నప్రతిభావంతులకు జాబ్‌మేళా

ఒంగోలునగరం, జనవరి 21: జిల్లాలోని విభిన్నప్రతిభావంతుల కోసం ఈ నెల 23వ తేదీన ఒంగోలులో ప్రత్యేక జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అర్చన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ జాబ్ మేళ ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందన్నారు. పదో తరగతి ఆపై విద్యార్హతలు ఉన్న వారు హాజరుకావచ్చని, తిరుపతికి చెందిన యూత్‌ఫర్ జాబ్స్ ఫౌండేషన్ సంస్థ ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తుందని తెలిపారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.1.2 లక్షల నుంచి రూ.3.1 లక్షల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. స్టీవార్డ్స్, ఫోల్డింగ్, క్రూమెంబర్ తదితర విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు ఈ జాబ్‌మేళా జరుగుతుందన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొండపి/మర్రిపూడి, జనవరి 21 : కొండపి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, నాలుగు ఆయాల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. పొన్నలూరు మండలం ముప్పాళ్ల గ్రామ పంచాయతీలోని వెల్లటూరు గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు బీసీ-డీ అభ్యర్థిని, ఇదే మండలంలోని వెంకుపాలెంలోని కేంద్రంలో ఆయా పోస్టునకు ఎస్టీ అభ్యర్థిని, మర్రిపూడి మండలం అయ్యపరాజుపాలెంలో ఆయా పోస్టునకు, ధర్మవరం గ్రామంలో ఆయా పోస్టుకు కూడా ఓసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. కొండపి మండలం పెట్లూరు గ్రామంలోని పెట్లూరు-2 కేంద్రంలో ఆయాగా ఓసీ అభ్యర్థిని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తులను కొండపిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

బాలికల సంరక్షణపై పోటీలు రేపు

ఒంగోలు(విద్య), జనవరి 21: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినులకు బాలికల సంరక్షణపై పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో పీఎస్.సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో ఈ పోటీలు ఉదయం పది గంటలకు ప్రారంభంకానున్నాయి. విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలు పారితోషికం ఇవ్వనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థినులు ముందుగా నాగకుమారశర్మ 9949405456 సెల్ నంబరులో సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

రాజ్యాధికారం ద్వారానే సమానత్వం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 21: దళితులకు రాజ్యాధికారం ద్వారానే సమానత్వం లభిస్తుందని ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడుస్తున్నా దళిత, బడుగు, బలహీనవర్గాలకు ఒరిగింది ఏమి లేదన్నారు. ఐదేళ్ళకు ఒకసారి దోపిడీదారు పార్టీలకు ఓట్లు మాత్రం వేసి గెలిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని ఎస్సీఎస్టీ రిజర్వు స్థానాల్లో ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు తమ పార్టీ పోటీ చేస్తుందని, అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు కట్టా వరప్రసాద్, డి.వెంకట్రావు, దాసరి సంగీతరావు, పేరయ్య, వెంకటేశ్వర్లు, ఎం.రమేష్, నరసింహారావు, సుబ్బారావు, ఎస్‌కే.అబ్దుల్‌సత్తార్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గానాల రామమూర్తి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 21: విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య నాయకుడు గానాల రామమూర్తి విగ్రహావిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక కొత్తకూరగాయల మార్కెట్ దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వేల్పూరి రామారావు అధ్యక్షత వహించగా, ప్రముఖ గుండె వైద్యులు వల్లభాపురపు కేశవ, నగర కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. గానాల రామమూర్తి విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతి కోసం విశేష కృషి చేశారని వారు కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బేతంశెట్టి శైలజ, ఎస్.ఎం.పవిత్ర, శివకుమారస్వామి, వేల్పూరి రామారావు, చిడిపోటు శివ వెంకటసుబ్రహ్మణ్యం, కానాల వెంకటేశ్వర్లు, రావినూతల నాగేశ్వరరావు, ఫణిదపు బ్రహ్మయ్యాచారి, సుతారం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేడుకలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మద్దిపాడు, జనవరి 21: మద్దిపాడులోని కడియాల యానాదయ్య జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక నటరాజ కళాకేంద్రంలో నిర్వహించిన ఈ సందర్భంగా కాటూరి మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ బందెల అంజయ్య మాట్లాడుతూ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు.

శోభాయమానంగా ఒంగోలు..!

బాలరాముడి ప్రతిష్ఠ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ● కన్నులపండువగా సీతారాముల కల్యాణం, శోభాయాత్ర ● అలరించిన మార్వాడీ మహిళల నృత్యాలు


కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మరాఠా మహిళలు, చిన్నారులు


గాంధీరోడ్డులో మహిళల కోలాటం


శోభాయాత్రలో నృత్యాలతో ఆకట్టుకుంటున్న చిన్నారులు

ఒంగోలు (కల్చరల్), జనవరి 21 : అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ నేపథ్యంలో ఆదివారం నుంచే నగరంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. సీతారామ కల్యాణాలు, శోభాయాత్రలతో అంతటా భక్తిభావం వెల్లివిరిసింది. స్థానిక అమలనాధుని వీధిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సీతారామ కల్యాణం, ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్, ఇతర ధార్మిక సంఘాల సంయుక్త నిర్వహణలో సాయంత్రం 3 గంటల నుంచి గడియారం వారి వీధి శ్రీ అనంత కోదండరామస్వామి దేవస్థానం దగ్గర నుంచి గాంధీరోడ్డు గీతామందిరం వరక వెండిరథం, 125 కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మార్వాడీ మహిళలు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను అలరించాయి. అంజయ్య రోడ్డు ఆంధ్రకేసరి విద్యాకేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సంస్కార భారతి ఆధ్వర్యంలో విద్యార్థులచే శ్రీరాముని వేషధారణలు, కవితా రచన, పఠనం, దేశభక్తి గీతాల బృందగానం పోటీ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. బాలరాముని ప్రతిష్ఠ జరగనున్న సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక సంతపేట శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీసీతారామ కల్యాణోత్సం నిర్వహించనున్నారు. బాలరాముని ప్రతిష్ఠా మహోత్సవాన్ని ప్రత్యక్షంగా భక్తులు చూసేందుకు వీలుగా గాంధీరోడ్‌లోని శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో అతి పెద్ద స్ర్కీన్ ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థాన ప్రతినిధులు గుర్రం సత్యనారాయణ, గుర్రం రంగనాద్ తెలిపారు.

నూనె, వత్తులకు డిమాండ్

అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ఐదు దీపాలను వెలిగించాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఈ విషయాన్ని పలు హైందవ ధర్మ సంఘాలు విస్తృతంగా ప్రచారం చేశాయి. దీంతో దీపం వెలిగించటానికి కావాల్సిన నువ్వుల నూనె, వత్తులు, ప్రమిదలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఒంగోలులోని గాంధీరోడ్డు, అదేవిధంగా పలు ప్రాంతాల ల్లోని పలు దుకాణాలలో వీటి అమ్మకాలు పెరిగాయి.


రాముడు, సీత, లక్ష్మణ, హనుమ వేషధారణలో చిన్నారులు

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి


మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్ తదితరులు

ఒంగోలు(విద్య), జనవరి 21: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సీహెచ్.శ్రావణ్‌కు మార్ పిలుపునిచ్చారు. మహాపురుషుల జీవితాల త్యాగం, దేశభక్తి, త్యాగనిరతి, దర్మదీక్ష, ధైర్యసాహసాలు వంటి సుగుణాలను విద్యార్థులకు నూరిపోయాలన్నారు. ఒంగోలులోని ఏకేవీకే జూనియర్ కళాశాలలో ఆదివారం ఆపస్ డివిజన్ స్థాయి కర్తవ్య బోధనా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కె.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ వివేకానందుడు ప్రపంచ దేశాల్లో భారతదేశ విలువలను వ్యాపింపజేస్తే, నేతాజీ సుబాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య పిపాసను దేశంలోనే కాకుండా అనేక దేశాలకు వ్యాప్తింపజేశారన్నారు. అజాద్ హింద్ ఫౌజ్ ద్వారా బ్రిటీష్‌వారిని ఎదురించిన వారు దేశం విడిచి వెళ్ళిపోయేలా చేశారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు కె.మల్లికార్జునరావు, దిలీప్ చక్రవర్తి, జి.లక్ష్మీనారాయణ, బీవీఎన్.గుణప్రసాద్, కేవీ.శేషారావు, వై.మార్కండేయులు, వీవై.మధుప్రసాద్, ఎన్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

31న చలో విజయవాడ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 21 : ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మద్యంపై యుద్ధం పేరుతో ఈనెల 31న చేపట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మర్రి విజయ పిలుపునిచ్చారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో దశల వారీగా మద్య నిషేధం చేస్తామని ప్రకటించిన సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆచరణలో విఫలమయ్యారన్నారు. మద్యపానం వల్ల 70శాతం కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, చిన్న వయస్సులోనే అనేక మంది ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు ఈనేపథ్యంలో చలో విజయవాడకు ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రావులపల్లి లక్ష్మి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నంది పురస్కారం ప్రదానం


ప్రసన్నకుమార్‌కు పురస్కారాన్ని అందిస్తున్న అతిథులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 21: ఒంగోలు నగరానికి చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు డాక్టర్ లంకా ప్రసన్నకుమార్‌ను టీఎస్ఆర్ ఫౌండేషన్, లిటిల్ ఛాంప్స్ అకాడమీలు జ్యోతిష్య విద్వాన్ భూషణ్ బిరుదు, బంగారు నంది పురస్కారంతో ఘనంగా సత్కరించాయి. ఆదివారం ఒంగోలులోని సీఎస్ఆర్ శర్మ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మెప్మా పీడీ తేళ్ల రవికుమార్, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ కొలకలూరి రవిబాబు అతిథులుగా పాల్గొని ప్రసన్నకుమార్‌కు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నజీర్ అహ్మద్ మాట్లాడుతూ జ్యోతిష్యరంగంలో విశేష కృషి చేస్తున్న ప్రసన్నకుమార్‌కు పురస్కారాన్ని ఇవ్వటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, మండవ లావణ్య, కోసూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ మాజీ చైర్మన్ మృతి

మద్దిపాడు, జనవరి 21: మల్లవరంలలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ బోయపాటి పాపయ్య(85) ఆదివారం మృతి చెందారు. ఆయన దేవాలయ అభివృద్ధికి కృషి చేశారని గ్రామస్థులు కొనియాడారు. పాప య్య మృతికి పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు.

ఘనంగా గంధ మహోత్సవం



ఆశీర్వచనం అందుకుంటున్న దామచర్ల, దర్గాకు పూలతో అలంకరణ

ఒంగోలు(కల్చరల్), జనవరి 21: ఒంగోలు నగరం ట్రంకురోడ్డు మస్తాన్ దర్గాలో ఆదివారం రాత్రి గంధ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పాల్గొనగా ఆయనకు దర్గా నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల పూలతో అలంకరించిన పీర్లు కనువిందు చేశాయి. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త పూరిమిట్ల బాబా, నిర్వాహకులు బొరపర్తి హరికృష్ణ, టీడీపీ నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

163 మందికి వైద్యపరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నాగులుప్పలపాడు (ఒంగోలురూరల్), జనవరి 21: ఈదుమూడి గ్రామంలో ఆదివారం ఒంగోలు శ్రీరామ్‌మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మనం-మన ఊరు-మన దుమూడి సేవా సంస్థ సహకారంతో జరిగిన వైద్యశిబిరంలో 163మందికి వైద్యపరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసంస్థ వ్యవస్థాపకుడు కాపూరి వాసు, వైద్యులు యాస్మిన్, హరికృష్ణప్రసాదు, ఏడుకొండలు, వైద్యశాల మేనేజర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మప్రచార వారోత్సవాలు ప్రారంభం


ప్రచారరథాన్ని ప్రారంభిస్తున్న పాలకమండలి, అధికారులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 21: ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించనున్న ధర్మప్రచార వారోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన ప్రచార రథాన్ని దేవస్థాన ఛైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజనీకుమారి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు దేవస్థానాల్లో ధర్మప్రచారాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం అభిషేకం, గోపూజ, భక్తిగీతాలాపన మొదలైన పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, ఈమని మదనమోహన్, అర్చకులు పి.రమానాథాచార్యులు, నాగార్జున దేవ్, శ్రీధర్, వీకే.రాంబాబు, ఎం.రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

మార్క్సిజమే మానవాళికి దిక్సూచి


లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 21 : మార్క్సిజమే సకల మానవాళికి దిక్సూచి అని ప్రముఖ సామాజిక, అర్థశాస్త్ర, సైద్ధాంతిక విశ్లేషకులు డి.పాపారావు పేర్కొన్నారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం సైంటిఫిక్ సోషలిస్ట్ సర్కిల్ ఆధ్వర్యంలో లెనిన్ 100వ వర్ధంతి సభ కమ్యూనిజం పత్రిక ఎడిటర్ ఎంసీ.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ 107 సంవత్సరాల క్రితం మానవ సమాజాన్ని పట్టిపీడిస్తున్న రాచరికం, వెట్టిచాకిరి, వలస పాలన,, నిరక్షరాస్యత, దోపిడీ, దురాక్రమణ వంటి అటవిక పాలన విధానాన్ని అంతం చేసేందుకు మార్క్సిజం అనే సిద్ధాంతం వెలుగులోకి వచ్చిందన్నారు. లెనిన్ రష్యాలో మొట్టమొదటి సోషలిస్టు విప్లవరాజ్యం ఏర్పరిచారని చెప్పారు. అంతకు ముందు లెనిన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, నగర కార్యదర్శి పీవీఆర్.చౌదరి, స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎం.వెంకయ్య, ఎస్‌డీసర్దార్, ఆర్.వెంకట్రావు, కేవీ.రారెడ్డి, లక్ష్మి, ఎం.విజయ, పోతినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈమనిపాలెంలో..

లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ప్రజాసాహితీ వెలువరించిన ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ ఆదివారం స్థానిక ఈమనిపాలెంలోని తరిమెల నాగిరెడ్డి భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా జనసాహితీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ.కృష్ణయ్య మాట్లాడుతూ లెనిన్ కేవలం రాజకీయ నాయకుడు కాదని, సాహిత్యానికి కూడా విశేష సేవలు అందించారని కొనియాడారు. ప్రజాతంత్ర మేధావులవేదిక కన్వీనర్ కారుమంచి సుబ్బారావు, డాక్టర్ శాంతికుమార్, ప్రసన్న, సత్యనారాయణ, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జనసాహితి నాయకులు

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 50 కుటుంబాలు

● ఎమ్మెల్యే స్వామి సమక్షంలో చేరిక


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, జనవరి 21 : సింగరాయకొండ మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని 6వ వార్డు మెంబర్ బంకా కృష్ణా, ఎదురింటి నరేంద్ర, ఎస్‌కే సుభాని, ఎస్ షరీఫ్, సుల్తాన్ భాషా, సోడాబత్తిన అశోక్‌కుమార్, పాలకీర్తి మల్లికార్జున వారికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి తూర్పు నాయుడుపాలెంలో ఆదివారం ఎమ్మెల్యే స్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే పాకల పంచాయతీ క్రాంతినగర్ పట్టపుపాలేనికి చెందిన వాయిల బాబు, ఆంజనేయులు, ఎల్లంగారి హరి, నరేష్, వాయిల జయబాబు వీరితోపాటు మరో 20 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే స్వామి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ బీసీ కులాలకు చెందినవారు పార్టీలోకి రావడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు సుదర్శి చంటి, శీలం చంటి, నర్రా రాంబాబు, జమ్ము శంకర్, వాయిల తిరుపతి పాల్గొన్నారు.

రామమందిరానికి మాగుంట రూ.50 లక్షల విరాళం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 21 : అయోధ్య రామమందిరం ట్రస్టుకు ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు, యువపారిశ్రామికవేత్త మాగుంట రాఘవరెడ్డిలు కలిసి రూ.50 లక్షల విరాళాన్ని అందజేశారు. శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఎంపీ మాగుంట ఆదవారం విరాళమిచ్చారు. అయోధ్య రామ మందిరం కమిటీ సభ్యులు ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులురెడ్డిని అభినందించారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ విజేత బూరేపల్లి


బహుమతిని అందుకుంటున్న బూరేపల్లిటీం

సంతనూతల పాడు, జనవరి 21: మైనంపాడు గ్రామంలో ఈనెల 7వ తేదీ నుంచి జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలలో మొదటిబహుమతిని గొడుగుమస్తాన్ అండ్ సన్స్ రూ.20వేలను బూరేపల్లిటీమ్ గెలుచుకుంది. రెండవబహుమతిని కిలారిశ్రీను బ్రదర్స్ రూ.15వేలను ఎఫ్‌సీసీ మైనంపాడు టీం గెలుచుకుంది.

25న బీసీ సంఘాలతో సమావేశం


సమావేశమైన బీసీ నాయకులు

సంతనూతలపాడు, జనవరి 21: టీడీపీ అధిష్ఠానం ఆదేశాలమేరకు సంతనూతలపాడులో ఈనెల 25న బీసీ సంఘాలతో సమావేశం జరుగుతుందని రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షుడు మద్దినేనిహరిబాబు పేర్కొన్నారు. ఆదివారం సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశానికి బీసీ సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో తన్నీరు శ్రీను, కె.ఆంజనేయులు, జనసేన నాయకులు నరసింహారావు, ఫణీంద్ర పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర


వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 21 : వచ్చే ఎన్నికల్లో వైసీపీని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. కనిగిరి అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం నియోజకవర్గంలోని పీసీపల్లి మండలానికి చెందిన వైసీపీ నా యకులు పెద్దఎత్తున ఆ పార్టీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందన్నారు. అన్ని రకాలుగా ధరలను విపరీతంగా పెంచేసి ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారన్నారు. సంక్రాతి, క్రిస్మస్, రంజాన్ కానులను ఎత్తేసి పండుగపూట పేదలకు పరమాన్నాన్ని దూరం చేశారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తే జగన్‌రెడ్డి ఆ పథకాలను రద్దు చేసి, అర్హులను మోసం చేశారన్నారు. టీడీపీ పాలనలో నాణ్యమైన మద్యం అమ్మితే, వైసీపీ వచ్చాక మద్యం నిషేధిస్తామని చెప్పి ఒక్క జే బ్రేండ్ పేరుతో నాసిరకం మద్యంను అమ్ముతూ పేదల కుటుంబాల్లో చిచ్చు రేపారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో కనిగిరి ప్రాంతం మరింత వెనుకబాటుకు గు రైందన్నారు. కనిగిరి అభివృద్ధికి నిమ్జ్, నడికుడి రైల్వేలైన్, ఇంటింటికి తాగునీరు, ట్రిపుల్ ఐటీ, సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు, వెలిగొండ జలాలను సాధించడమే తన లక్ష్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో పాలనాదక్షత ఉన్న చంద్రబాబును ము ఖ్యమంత్రిగా గెలిపించుకోవడంతోపాటు కనిగిరి అభివృద్ధి కోసం తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీసీపల్లి మండలంలోని భట్టుపల్లికి చెందిన 30 కుటుంబాలు వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

భట్టుపల్లిలో వైసీపీకి భారీ షాక్

పీసీపల్లి: భట్టుపల్లి పంచాయతీలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన 30 కుటుంబాలు ఆ గ్రామ వైసీపీ నాయకుడు చెన్నుబోయిన మాలకొండయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉగ్ర నరసింహారెడ్డిని కలిసి టీడీపీలో చేరారు. వైసీపీని వీడి టీడీపీలో చేరడానికి గల కారణాలను మాలకొండయ్య తదితరులు వివరించారు. వారు తెలిపిన వివరాల మే రకు ఒక్కసారి ఒక్క చాన్స్ అంటూ పాదయాత్రలో అనేక హామీలు ఇచ్చిన జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే విస్మరించి అందరినీ మోసం చేశారన్నారు. వైసీపీ నాయకుల మాటలు నమ్మి గ్రామం మొత్తం ఏకపక్షంగా వైసీపీకి ఓట్లేశాం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మరికొద్ది నెలల్లో 5 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ప్రజలకు అవసరమైన ఏ ఒక్క పని కూడా మా గ్రామంలో చేపట్టలేదు. కనీసం తాగేందు కు కూడా మంచి నీరు అందించలేకపోయారన్నారు. ఉగ్ర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మా గ్రామానికి కొద్ది దూరంలోనే పాలేటిపల్లి చెరువును నిర్మించారు. ఇప్పుడు ఆ చెరువులో ఉన్న నీటి వలనే బోర్లు ఎండిపోకుండా రీచార్జి అవుతున్నాయి. ఈ వైసీపీ ప్రభుత్వం ఆ చెరువుకు కనీసం కాలువలు కూడా తీయించలేకపోయింది. అందువల్లనే వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో చెన్నుబోయిన మాలకొండయ్య, చెన్నుబోయిన నరసింహారావు, చెన్నుబోయిన నాగేంద్ర, ఆదిలక్ష్మి, ఆదిలక్ష్మమ్మ, మన్నేపల్లి భాస్కర్, ఎర్మియా, శాంసన్, యోహాన్, జాన్‌పీటర్, జైరావు, డబ్బుగొట్టు నాగరాజు, డబ్బుగొట్టు నాగార్జున, కుదుముల చిట్టి, బండి రవికుమార్, బండి మాలకొండయ్యలతో పాటు మొత్తం 30కుటుంబాలకు చెందినవారు వైసీపీలో చేరారు. వీరికి టీడీపీ ఇన్‌చార్జి ఉగ్ర తెలుగుదేశం కండువాలు మెడలో వేసి పార్టీలోకి స్వాగతించారు.

అంగన్‌వాడీలపై పోలీసుల ఉక్కుపాదం

చలో విజయవాడకు వెళ్లకుండా నోటీసులు ● అరెస్టు చేస్తామని యూనియన్ నేతలకు హెచ్చరికలు ● అర్ధరాత్రి బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

ఒంగోలు (క్రైం), జనవరి 21 : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల చలో విజయవాడ కార్యక్రమంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆదివారం రాత్రి ఒంగోలు రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అంగన్‌వాడీలు ఎవ్వరూ విజయవాడ వెళ్లొద్దని ముందస్తుగా నోటీసులు జారీ చేశారు. విజయవాడ వెళ్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. అదేక్రమంలో ముఖ్యమైన ప్రాంతాల్లో పికెట్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీ మలికగర్గ్ అర్ధరాత్రి 12.45 గంటల ప్రాంతంలో ఒంగోలులోని బస్టాండు, రైల్వేస్టేషన్‌కు చేరుకొని స్వయంగా తనిఖీలు నిర్వహించారు. అంతేగాకుండా అనుమానితులను విచారించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యకర్తలు, ఆయాలు విజయవాడ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


బస్సులో తనిఖీలు చేస్తున్న ఎస్పీ మలికగర్గ్

మిర్చి రైతుకు కన్నీరు

- వెంటాడిన వర్షాభావం
- ఆపై తెగుళ్ల బెడద
- గణనీయంగా తగ్గిన దిగుబడులు,ధరలు



తెగులుసోకిన మిరపతోట

పెద్ద దోర్నాల, జనవరి 9 : మిర్చి రైతులకు ఈ ఏడాది కూడా కడగండ్లు తప్పడం లేదు. భూమిని, రెక్కల కష్టాన్ని నమ్మి సేద్యం బాట పట్టిన రైతన్నకు అప్పులు పెరగడం మినహా మిగిలేదేమి లేకుండా పోతోంది. ఏడాది పొడవునా ఇంటిల్లిపాది రెక్కల కష్టం, లక్షల రూపాయల పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారుతోంది. దీంతో దిక్కుతోచని ఆసామి ఆందోళన చెందుతున్నాడు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో తెచ్చిన అప్పులెలా తీర్చాలో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయి.

మండలంలో ప్రధానంగా పత్తి, మిరప పైర్ల సాగుకు రైతులు మొగ్గు చూపారరు. ఐదారేళ్లగా పత్తిపై ఎర్రనల్లి దాడి చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఈ ఏడాది కేవలం 700 ఎకరాల్లో మాత్రమే పత్తి సాగు చేశారు. అయితే ఈ ఏటా మాదిరి ఈ ఏడాది కూడా లాభాలేమి రాలేదు. పత్తి సాగుపై రైతులు ఎకరాకు రూ.5వేల నుంచి రూ.8 వేల వరకు నష్టపోయారు. కొంత మంది రైతులు పైరును మధ్యలోనే దున్నేశారు. అపరాలు మినుము, అలసంద, బొబ్బర్లు, ఉలవ తదితరాలు విత్తారు. అయితే వర్షాభావ పరిస్థితులు రైతులను పూర్తిగా కుంగ దీశాయి. ఈ ఏడాది రెండు వాయుగుండాలు, ఒక తుఫాన్ సమయంలో మినహా వర్షం పడలేదు. అయితే రైతులు మాత్రం అదునులో విత్తనాలు విత్తారు. ఈ క్రమంలోనే వర్షాభావంతో సాగు చేసిన పైర్లు దెబ్బతిని నష్టాలను మిగిల్చాయి.

కోలుకోలేని మిరప రైతు

మిరప సాగు చేసే రైతులు ఆ పైరును చంటిబిడ్డ మాదిరిగా చూసుకుంటారు. 'యాడబోయిన రూపాయి ఆడే ఎతుక్కోవాలా..' అన్న చందంగా సేద్యంలో నష్టం వస్తే, ఆ నష్టాన్ని మిరప తీరుస్తుందని రైతులు బలంగా విశ్వసిస్తారు. ఈ క్రమంలోనే మండలంలో సుమారు 6,000 ఎకరాల్లో మిర్చి నాట్లు వేశారు. బోరబావుల కింద జూలై, ఆగస్టు మాసాల్లో సాగు చేసిన మిరప ఏపుగా పెరిగింది. బాగాకాపుకొచ్చింది. అయితే కాయలు కోసిన తర్వాత 75 శాతం తాలుకాయలుగా మారాయి. దీంతో రైతులు తలలు పట్టుకున్నారు .పండించిన పంట మందులకు, కూలీల ఖర్చుకు కూడా రావని గగ్గోలు పెడుతున్నారు. సెప్టెంబరు-అక్టోబరు మాసాల్లో సాగు చేసిన మిరపకు నీటి తడులు లేక గిడసబారి పోతున్నాయి. కాలక్రమేణ బోరుబావులు అడుగంటాయి. కొద్దిమంది రైతులకు మాత్రమే అదృష్టవశాత్తు నీరు వస్తుండగా, మిగిలిన రైతుల పైరు పూతదశలో ఎండుముఖం పట్టాయి. కాచిన కాయలు పూర్తిగా పక్వానికిరాలేదు. విత్తనాలు కూడా అవిసి పోవడంతో తాలుకాయలుగా మారుతున్నాయి. దీంతో పెట్టుబడుల సంగతి దేవుడెరుగు. కోత కూలీల ఖర్చు కూడా రాని దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

గణనీయంగా తగ్గిన దిగుబడులు, ధరలు

మిరపలో సాధారణంగా వాతావరణం అనుకూలంగా ఉంటే ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడులు



సగానికి పైగా వచ్చిన తాలుకాయలు

వస్తాయి. కాని ఇప్పుడు ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయి. గతేడాది ఈ సమయంలో క్వింటాలు ధర రకాన్ని బట్టి రూ.18,000ల నుంచి రూ.24,000ల వరకు పలికింది. ఈ ఏడాది రూ.12,000ల నుంచి 16,000ల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది పండిన పంట చాలా మంది శీతల గిడ్డంగులలో నిల్వ చేశారు. గిట్టుబాటు ధర లభించకపోయినా ఏసీల ఖర్చు తడిసి మోపెడవుతోందని నష్టాలకు విక్రయిస్తున్నారు .ఏ విధంగా చూసిన మిరప రైతు తీవ్రంగా నష్టపోయారు.

గొబ్బూరులో పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.4 లక్షల ఆస్తినష్టం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ ఇంజన్

మార్కాపురం రూరల్ జనవరి 21: పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామంలో ఆదివారం పొగాకు బ్యారన్ దగ్ధ మైంది. అందులోని పొగా కు కాలిపోవడంతో సుమారు నాలుగు లక్షల రూపా యల ఆస్తి నష్టం వాటి ల్లింది. స్థానికుల వివరాల ప్రకారం.. గొబ్బూరు గ్రామానికి చెందిన రైతు వెన్న పెద్దవెంకటేశ్వరరెడ్డి పొగాకు క్యూరింగ్ చేయిస్తున్నాడు. ప్రమాదవశాత్తు బ్యారన్‌లో మట్టలు రేగడంతో అందులోని పొగాకంతా దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.4 లక్షల వరకు పంట నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పొగాకు బోర్డు వారు సహకరించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు. సంవత్సరం పొడవునా పెట్టుబడి సాగు చేసిన పైరు చేతికి వచ్చిన సమయంలో అగ్గిపాలు కావడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దారవీడు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు.

బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి

తర్లుపాడు, జనవరి 21: బీసీల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేసిందని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం బీసీల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందన్నారు. తర్లుపాడు అంకాలమ్మ తల్లి దేవాలయం వద్ద జయహో బీసీ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో బీసీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి వారి అభివృద్ధికి కృషి చేసింద న్నారు. యంత్రపరికరాలు, కుట్టు మిషన్లు, సబ్సిడీ లోన్‌ల వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందజేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ.. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. వైసీపీకి బీసీలే చరమగీతం పాడుతారన్నారు. 80 రోజుల్లో టీడీపీ ప్రభుత్వం రానున్నదని, వెంటనే బీసీలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చేం దుకు ప్రతి ఒక్కరూ శాయశక్తుల కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు కంచెర్ల కాశయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ఉడు ముల చిన్నపురెడ్డి, మాజీ ఎంపీపీ పి.ఏసుదాసు, మాజీ ఎంపీటీసీ పి.గోపి నాథ్ చౌదరి, నంబుల లక్ష్యయ్య, ఈర్ల వెంకటయ్య, కె.శ్రీనివాసులు, జి.సుబ్బయ్య, మేకల వెంకట్, ఈ.పెద్దకాశయ్య, ఎ.బాలకోటయ్య, జి.వెంకటేశ్వర్లు, నాయకులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

టీడీపీతోనే భవిష్యత్తు

మార్కాపురం వన్‌టౌన్ : రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మీ అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో ఆదివారం సాయంత్రం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మీ ఇంటింటికి తిరిగి రానున్న టీడీపీ ప్రభుత్వం అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీ నియంతృత్వ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలగాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలన్నారు. తెలుగు మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కారు బోల్తా



బోల్తాపడిన కారు

కంభం, జనవరి 21 : ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో కారు బోల్తాపడిన ఘటన మండలంలోని జంగంగుంట్ల గ్రామపొలాల్లో ఆదివారం చోటుచేసుకొంది. కంభం ఎస్సై రాజేష్ కథనం ప్రకారం.. కర్నూలుకు చెందిన ఓ కుటుంబం కారులో కర్నూలు నుంచి వినుకొండ వెళుతోంది. జంగంగుంట్ల సమీపంలో ద్విచక్ర వాహనదారుడు అడ్డురావడంతో తప్పించే క్రమంలో అదుపుతప్పి కారు పొలాల్లో బొల్లాపడింది. అదృష్టవశాత్తు కారులోని వారికి ఎటువంటి గాయాలు కాలేదు.

చెంచయ్యకు ఘన నివాళి



మాట్లాడుతున్న చైర్మన్ బాలమురళీకృష్ణ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 21: నమ్మిన సిద్ధాంతం కోసం ఉన్నతమైన ఉద్యోగాన్ని వదులుకొని పేదల పెన్నిధిగా రావులపల్లి చెంచయ్య నిలిచారని మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ అన్నారు. రావులపల్లి చెంచయ్య 18వ వర్ధంతి సభ సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమురళీకృష్ణ మాట్లాడుతూ చెంచయ్య చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయక మన్నారు. తొలుత చెంచయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాసరయ్య, కాశీం, ఏపీడబ్ల్యూజే నాయకులు రమణ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డి.రేణుక తదితరులు పాల్గొన్నారు.

బీసీ ద్రోహి జగన్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 21 : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న జగన్‌రెడ్డి బీసీలకు వెన్నుపోటు పొడిచాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి గిద్దలూరు మండలంలోని క్రిష్ణంశెట్టిపల్లె గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాడు ఎన్నికల్లో బీసీ ఓట్లు దండుకోవడానికి అబద్ధపు హామీలు ఇచ్చాడన్నారు. బీసీలంటే 'బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాదు బ్యాక్‌బోన్' అని ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల నడ్డి విరిచారన్నారు. పేరుకు ఉత్తుత్తి కార్పొరేషన్లను ఏర్పాటు చేసి నామమాత్రంగా బీసీలను చైర్మన్లుగా నిర్మించా రన్నారు. ఒక్క రూపాయి కూడా బీసీలకు రుణాలు అందించలేదని విమర్శిం చారు. జగన్‌రెడ్డి పాలనలో సొంత సామాజిక వర్గాలకు చెందిన నాయకులను మాత్రమే సలహాదారులుగా నియమించుకుని కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని దోచిపెట్టారని ధ్వజమెత్తారు. గతం లో టీడీపీ హయాంలో బీసీల సంక్షే మం కోసం అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడి రుణాలు, విద్యార్థులకు విదేశీ విద్య, చేతివృత్తుల వారికి ఆర్థికసాయం అందజేశారన్నారు. మండల కేంద్రాలలో బీసీ భవనాలు, ఆడబిడ్డలకు వివాహ సమయంలో ఆర్థిక సాయం అందజేశారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్ యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, బీసీ నాయకులు బొడ్డురంగారావు, మచ్చ వెంకటేశ్వర్లు, భూపని తిరుమలయ్య, పిక్కిలి నాగరాజు, పాముల వెంకటరమణ యాదవ్, పందనబోయిన రాజభూపాల్‌యాదవ్, చల్లా తిరుపతి, జడల పాండురంగయ్య, మండ్ల సుబ్బారావు, బిల్లా రమేష్‌యాదదవ్, కౌన్సిలర్లు బూనబోయిన చంద్రశేఖర్‌యాదవ్, పసుపుల మల్లేశ్వర్‌రావు, కడియం శేషగిరి, కుసుమాల మహానంది, నంది శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి



హాజరైన బీసీ కార్యకర్తలు

జంకెను కలిసిన దద్దాల

మార్కాపురం రూరల్ జనవరి 21: పట్టణంలోని జవహర్‌నగర్‌కాలనీలో జంకె నివాసంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని కనిగిరి ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



జంకె వెంకటరెడ్డికి బొకే అందజేస్తున్న దద్దాల నారాయణ

కులగణన వివరాల సేకరణ

గిద్దలూరు, జనవరి 21 : కులగణనకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు సేకరిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి కుల విషయంగా, అలాగే సొంత ఇంటిస్థలాలు, పొలా వివరాలు కూడా సేకరిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ వై.రామక్రిష్ణయ్య, ఎంపీడీవో హేమలత ఆదివారం కులగణన చేస్తున్న సర్వేను పర్యవేక్షించారు.

రాచర్ల రైల్వేగేటు సమస్య పరిష్కారానికి కృషి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

గిద్దలూరు టౌన్, జనవరి 21 : గిద్దలూరు ప్రజలు ఎదుర్కొంటున్న రాచర్లగేటు సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కేంద్ర మాజీ మంత్రి దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. నంద్యాల జిల్లాలో పర్యటన అనంతరం శ్రీశైలం వెళుతూ గిద్దలూరులోని కొద్దిసేపు తేనీటి కోసం ఆగారు. అక్కడ స్థానిక బీజేపీ నాయకులతో పాటు పట్టణానికి చెందిన పలువురు ఆమెతో మాట్లాడారు. ఈ సందర్భంగా గిద్దలూరు పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న రాచర్లగేటు సమస్య వలన తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడ డంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతురన్నా రని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అలాగే సగిలేరు నది వలన ముంపుకు గురై పలుమార్లు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంపై అనేకమార్లు ప్రజాప్రతినిధులకు వివరించినా పట్టించుకోలేదన్నారు. ఈ అంశాల పై తాము దృష్టి సారిస్తామన్నారు. బీజేపీ నాయకులతో మాట్లాడుతూ ఎన్నికల్లో అందరూ కలిసి పనిచేయాలని, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల బీజేపీ జిల్లా అధ్యక్షులు సబేరా, నంద్యాల కిసాన్‌మోర్చ ఇన్‌చార్జ్ పిడతల రమేష్‌రెడ్డి, ఓబీసీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న పురందేశ్వరి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో విఫలం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 21: అంగన్‌వాడీల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విమర్శించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురు అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం 41వ రోజుకు చేరింది. సమ్మెకు సంఘీభావం తెలిపి నారాయణరెడ్డి మాట్లా డుతూ.. రాష్ట్రంలో స్కామ్‌లు లేని స్కీమే లేద న్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.సత్యనారాయణ, వహీలాలి, కె.శ్రీనివాసులు, మస్తాన్, సీపీఐ నాయకులు నాసరయ్య, కాశీం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : తమ డిమాండ్లు పరిష్కరించేవరకు ధర్నాలు, ఉద్యమాలు చేస్తామని అంగన్వాడీవర్కర్స్ యూనియన్ నాయకులు అన్నారు. వారు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం చేపట్టిన ధర్నాలో సీఐటీయూ నాయకులు షేక్ రఫీ, అంగన్వాడీ యూనియన్ నాయకులు జి.మల్లేశ్వరి, పి.సుబాషిణి, నాగరాజ కుమారి, రామసుబ్బమ్మ, అరుణ, సునీత, టి.సుబ్బమ్మ, సుజాత, పాల్గొని మాట్లాడారు.



వై.పాలెంలో అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన, మార్కాపురంలో నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

కొనసాగిన సమ్మె

పెద్ద దోర్నాల : స్థానిక ఆర్‌టీసీ బస్టాండు వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం కొనసాగింది. ప్రభుత్వం కళ్లు తెరవాలని న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వై.సుబ్బమ్మ, ముంతాజ్‌బేగం, సుహాసిని, కుమారి, వెంకటలక్ష్మీ, రాణి, వెంకటరత్నం, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు అందజేత

గిద్దలూరు : అంగన్‌వాడీల చలో విజయవాడ ధర్నా కార్యక్రమానికి వెళ్లేందుకు వీలులేదంటూ పోలీసులు అంగన్‌వాడీలకు నోటీసులు అందజేశారు. ఎస్సై అజిత ధర్నా శిబిరం వద్దకు వచ్చి అంగన్‌వాడిలకు నోటీసులు అందజేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, భయభ్రాంతులకు గురి చేసినా సమ్మె విరమించబోమని, పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతోందన్నారు. అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు స్వర్ణ కుమారి, మున్నా తెలిపారు.

పొదిలి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీతం తప్పా జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఇస్తానని చెప్పిన హామీలను అమలుచేయలేదన్నారు. ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరుతున్న తమపై ముఖ్యమంత్రి ఎస్మా ప్రయోగించడం, విధులకు హాజరుకాకపోతే కొత్తవారిని తీసుకుంటామని బెదించడం విడ్డూరంగా ఉందన్నారు. పాలనలో కొత్తదనం ఉంటుందని నమ్మి ఓటు వేసినందుకు తమకు తగిన శాస్తే జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎర్రగొండపాలెం : చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా నివారించేందుకు ఆదివారం ఎర్రగొండపాలెం మండలంలో స్థానిక పోలీసులు అంగన్వాడీ కార్యకర్తలకు, యూనియన్ నాయకులకు నోటీసులు అందజేశారు. కార్యకర్తలను పోలీసులు ఇళ్ల వద్ద కలసి నోటీసులు ఇచ్చారు. చలో విజయవాడకు వెళ్లవద్దని మార్గమధ్యంలో బస్సులను తనిఖీ చేసి అరెస్టు చేస్తామన్నారు. ఆ మేరకు అంగన్‌వాడీలకు నోటీసులు ఇచ్చారు.

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురానికి చెందిన ఏఐటీయూసీ నాయకులు షేక్ కాశీంకు ఆదివారం పోలీసులు నోటీసులు అందజేశారు. విజయవాడలో అంగన్‌వాడీల సభకు ప్రభుత్వ అనుమతులు లేనందున కాశీంకు పోలీసులు నోటీసులు ఇచ్చారు.

అవీ..ఇవీ..

వైభవంగా శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

గిద్దలూరు, జనవరి 21 : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో గిద్దలూ రు పట్టణంలో వైభవంగా శోభాయాత్ర నిర్వహించా రు. స్థానిక గాంధీబొమ్మ కూడలి నుంచి దీపాలతో మహిళలు శోభాయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హిందూ దేవాలయాల కమిటీ అధ్యక్షులు చేరెడ్డి యర్రారెడ్డి, అమ్మవారిశాల, కుసుమ హరనాథ మందిరం సర్వసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆర్యవైశ్య సూర్యవంశావలి, ఆంజనేయ స్వామి దేవస్థానం, వాసవిక్లబ్, వాసవి వాకర్స్ కమిటీల ఆధ్వర్యంలో మహిళలు, కమిటీ ప్రతినిధులు పెద్ద ఎత్తున శోభాయాత్రలో పాల్గొన్నారు.

కంభం : అయోధ్యలో సోమవారం 22న అయోధ్య రామయ్య ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కంభం పట్టణంలో 22వ తేదీ ఉదయం 9గంటలకు శోభయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అఖండ రామనామ సంకీర్తన

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 21: అయోధ్యలో రామ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో రెండవ రోజు ఆదివారం అఖండ రామనామ సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రధానార్చకులు అప్పనా చార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. చెన్నకేశవస్వామి వికాస తరంగిణి మహిళల ఆధ్వర్యంలో రామనామ సంకీర్తన నిర్వహించారు. ఏవో గొలమారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడలు అన్ని రంగాల్లో రాణించాలి



గౌడసంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 21: గౌడ సంఘీయులు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా గౌడ సంఘం కార్యదర్శి కీర్తిసాయన్న గౌడ్ అన్నారు. స్థానిక ఎన్జీవో హోంలో నియోజకవర్గ గౌడ సంఘ క్యాలెండర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల చదువుకు అవసరమైన సాయం చేస్తామన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన గౌడ విద్యార్థులకు బహుమతులు ఇస్తామన్నారు. గౌడ సంఘీయులు అందరూ ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కంచెర్ల కాశయ్య, రమణ, నాగార్జున, రంగస్వామి, నరసింహరావు, వెంకటేశ్వరు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- ఎర్రగొండపాలెం వైసీపీ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్

మార్కాపురం రూరల్ జనవరి 21: 'ప్రజా సమస్యలను నా సమస్యగా భావించి పరిష్కరిస్తా'అని వైసీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాడిపత్రి చంద్రశేఖర్ అన్నారు. పెద్దారవీడు మండలం హనుమాన్ జంక్షన్ కుంట వద్ద పెద్దారవీడు మండల వైసీపీ కార్యకర్తల, నాయకులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజక వర్గంలోని గ్రామాలలో ఎక్కడైనా నీటిసమస్య ఉన్నా, ప్రభుత్వం ద్వారా ఆలస్యం అయితే తన సొంత నిధుల నుండి బోర్లు వేయించి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. ప్రతి కుటుంబంలో చిన్న చిన్న సమస్యలు ఉన్నట్లుగా పార్టీలో కార్యకర్తల మధ్య కూడా మనస్పర్ధలు ఉంటాయని అందరిని కలుపుకు పోవాలన్నారు. సమావేశంలో పెద్దారవీడు మండల వైసీపీ కన్వినర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీపీ గురవయ్య జడ్పీటీసీ సభ్యుడు ఏరువ చలమారెడ్డి, మాజీ ఎంపీపీ డి వెంకటరెడ్డి, వైసీపి సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్


ఆర్థిక సాయం అందిస్తున్న గోపీ

చిన్నారి కుటుంబానికి గరికపాటి సాయం

ముండ్లమూరు, జనవరి 21 : మండలంలోని రమణారెడ్డి పాలెం గ్రామానికి చెందిన నూకతోటి సురేష్ కుమారుడు రోషన్ అనే చిన్నారి ఇటీవల ప్రమాద వశాత్తు తీవ్రంగా గాయపడి గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న దర్శి నియోజక వర్గ జనసేన పార్టీ నాయకు డు గరికపాటి వెంకట్ రూ.50వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆ నగదును ఆదివారం వెంకట్ సోదరుడు గోపీ, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాస రావు చిన్నారి రోషన్ తండ్రి సురేష్‌కు నగదును అందజేసి, ధైర్యం చె ప్పారు. ఈ సందర్భంగా వారు వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దామా కృష్ణ, జిల్లెలమూడి చిరంజీవి, రాయపూడి భాస్కరరావు, సుబ్బారావు, ప్రసాద్ ఉన్నారు. పసుపుగల్లులో టీడీపీ కార్యకర్త డీ మీరావలి చని పోవడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయండి

తాళ్లూరు, జనవరి 21 : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. తాళ్లూరు ప్రాంతానికి చెందిన జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కైపు వెంకట కృష్ణా రెడ్డి ఆదివారం కడప విమానాశ్రయంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. దర్శి నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలను తెలుసుకున్నామని ఆమెకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఉత్సాహంతో పని చేయాలని ఆమె సూచించారని కృష్ణారెడ్డి తెలిపారు.

వైసీపీని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర


వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 21 : వచ్చే ఎన్నికల్లో వైసీపీని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ము క్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం నియోజకవర్గంలోని పీసీపల్లి మండలానికి చెందిన వైసీపీ నా యకులు పెద్దఎత్తున ఆ పార్టీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందన్నారు. లెక్కకు మించి అప్పులు తెచ్చిన జగన్‌రెడ్డి అభివృద్ధి పనులు చేయకుండా తన ఖజానా నింపుకుని ప్రజల నెత్తిన రుణ భారా న్ని మోపారారన్నారు. అన్ని రకాలుగా ధరలను విపరీతంగా పెంచేసి ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారన్నారు. బస్సు చార్జీలను పెంచిన జగన్, ఆయిల్, కరెంట్ చార్జీలను విపరీతంగా పెంచారన్నారు. ఆఖరికి చెత్తపై కూడా పన్ను లాగుతున్న ఏకైక వ్యక్తి జగన్ అన్నారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ కానులను ఎత్తేసి పండుగపూట పేదలకు పరమాన్నాన్ని దూరం చేశారన్నారు. టీడీపీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తే జగన్‌రెడ్డి ఆ పథకాలను రద్దు చేసి, అర్హులను మోసం చేశారన్నారు. టీడీపీ పాలనలో నాణ్యమైన మద్యం అమ్మితే, వైసీపీ వచ్చాక మద్యం నిషేధిస్తామని చెప్పి ఒక్క జే బ్రేండ్ పేరుతో నాసిరకం మద్యంను యథేచ్ఛగా అమ్ముతూ పేదల కుటుంబాల్లో చిచ్చు రేపారన్నారు. నాసిరకం మద్యం తాగిన అనేక మంది ప్రాణాలు కోల్పోగా, కొందరు అనేక వ్యాధులతో మంచంపట్టారని ఉగ్ర ఆం దోళన వ్యక్తం చేశారు. ఈ నాలుగున్నరేళ్లలో కనిగిరి ప్రాంతం మరింత వెనుకబాటుకు గు రైందన్నారు. కనిగిరి అభివృద్ధికి నిమ్జ్, నడికుడి రైల్వేలైన్, ఇంటింటికి తాగునీరు, ట్రిపుల్ ఐటీ, సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు, వెలిగొండ జలాలను సాధించడమే తన లక్ష్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో పాలనాదక్షత ఉన్న చంద్రబాబును ము ఖ్యమంత్రిగా గెలిపించుకోవడంతోపాటు కనిగిరి అభివృద్ధి కోసం తనను ఆశీర్వదించా లని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఇంటింటికీ టీడీపీ ప్రణాళికను ప్రజలకు వివరించాలని నూతనంగా పార్టీలో చేరిన వారికి ఉగ్ర సూచించారు. కార్యక్రమంలో పీసీపల్లి మం డలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

భట్టుపల్లిలో వైసీపీకి భారీ షాక్

» జగన్‌రెడ్డికి ఓట్లు వేసి మోసపోయామంటూ శ్రేణుల ఆవేదన

» టీడీపీలో చేరిన 30కుటుంబాలు

పీసీపల్లి : మండలంలోని భట్టుపల్లి పంచాయతీలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన 30 కుటుంబాలు ఆ గ్రామ వైసీపీ నాయకుడు చెన్నుబోయిన మాలకొండయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉగ్ర నరసింహారెడ్డిని కలిసి టీడీపీలో చేరారు. వైసీపీని వీడి టీడీపీలో చేరడానికి గల కారణాలను మాలకొండయ్య తదితరులు వివరించారు. వారు తెలిపిన వివరాల మేరకు ఒక్కసారి ఒక్కచాన్స్ అంటూ పాదయాత్రలో అనేక హామీలు ఇచ్చిన జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే హామీలను విస్మరించి ఓట్లు వేసిన అందరినీ మోసం చేశారన్నారు. వైసీపీ నాయకుల మాటలు నమ్మి గ్రామం మొత్తం ఏకపక్షంగా వైసీపీకి ఓట్లేశాం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మరికొద్ది నెలల్లో 5 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ప్రజలకు అవసరమైన ఏ ఒక్క పని కూడా మా గ్రామంలో చేపట్టలేదు. కనీసం తాగేందుకు కూడా మంచి నీరు అందించలేకపోయారన్నారు. ఉగ్ర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మా గ్రామానికి కొద్ది దూరంలోనే పాలేటిపల్లి చెరువును నిర్మించారు. ఇప్పుడు ఆ చెరువులో ఉన్న నీటి వలనే బోర్లు ఎండిపోకుండా రీచార్జి అవుతున్నాయి. ఈ వైసీపీ ప్రభుత్వం ఆ చెరువుకు కనీసం కాలువలు కూడా తీయించలేకపోయింది. తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు తప్ప వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు.మా గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా ఉగ్ర నరసింహారెడ్డితోనే సాధ్యమన్నారు. అందువల్లనే వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో చెన్నుబోయిన మాలకొండయ్య, చెన్నుబోయిన నరసింహారావు, చెన్నుబోయిన నాగేంద్ర, ఆదిలక్ష్మి, ఆదిలక్ష్మమ్మ, మన్నేపల్లి భాస్కర్, ఎర్మియా, శాంసన్, యోహాన్, జాన్‌పీటర్, భైరావు, డబ్బుగొట్టు నాగరాజు, డబ్బుగొట్టు నాగార్జున, కుడుముల చిట్టి, బండి రవికుమార్, బండి మాలకొండయ్యలతో పాటు మొత్తం 30కుటుంబాలకు చెందినవారు వైసీపీలో చేరారు. వీరికి టీడీపీ ఇన్‌చార్జి ఉగ్ర తెలుగుదేశం కండువాలు మెడలో వేసి పార్టీలోకి సాదరంగా స్వాగతించారు.


పెద్దన్నపల్లిలో కంది పైరు చుట్టూ చీరలు కడుతున్న రైతు

చీరలే రక్షణ కవచం

పీసీపల్లి, జనవరి 21 : ఖరీఫ్‌లో సాగుచేసిన మినుము, కంది పైర్లను అడవిపందుల బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని అడవిలోపల్లి, లక్ష్మక్కపల్లి, తలకొండపాడు, పెద్దన్నపల్లి, వేపగుంపల్లి, పీసీపల్లి గ్రామాల్లో ఈ ఏడాది రైతులు కంది, మినుమును అధికంగా సాగు చేశారు. కాయ దశలో ఉన్న ఈ పైర్లను అడవి పందులు వచ్చి ధ్వంసం చేస్తున్నాయి. దీంతో వాటిని రక్షించుకునేందుకు రైతులు పొలాలకు చుట్టూ చీరలతో రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఒక్కో చీరకు రూ.20 నుంచి రూ.25 ఖర్చు చేసి చేనుచుట్టూ వలయంలా కడుతున్నామని, చీరలను చూసిన పందులు మనుషులు ఉన్నారని భావించి పైరులోకి రాకుండా వెళ్లిపోతున్నాయని రైతులు చెప్తున్నారు.

శ్రీరామ నగర సంకీర్తనను విజయవంతం చేయాలి


భైరవానందస్వామి

దొనకొండ, జనవరి 21 : అయోధ్యలో సోమవారం బాలరాముని నూతన వి గ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సోమవారం భక్తజనులతో శ్రీరామ.. జ యరామ అంటూ.. ఉదయం 5 గంటలకు ఆనంద్ ఆశ్రమం నుంచి దొనకొండ లో నిర్వహించే శ్రీరామ నగర సంకీర్తన శోభాయాత్రను విజయవంతం చేయాలని ఆశ్రమ ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి పిలుపునిచ్చారు. శోభాయాత్ర ఉదయం 5 గంటలకు ఆనంద ఆశ్రమం నుంచి ప్రారంభమై మల్లెల వారిపేటలోని సీతారాములవారి దేవాలయంలో దర్శనం అక్కడ నుంచి అరబ స్తాన్ వీధిలోని భక్తాంజనేయస్వామి వారి దర్శనం, తర్వాత బ్రహ్మారావుపేటలోని శ్రీ ప ట్టాభి రామచంద్ర స్వామి, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, శ్రీ సాయిబాబా దర్శనా లు అనంతరం అల్పాహారం ఉంటుందన్నారు. అనంతరం వీవీపురంలోని పోలేరమ్మ దర్శనం, కనకదుర్గమ్మ దేవాలయ దర్శనం, గుట్టమీదపల్లిలోని పట్టాభిరామచంద్రుడు, పోలేరమ్మ, రైల్వే కాలనీలోని శ్రీ సీతారామచంద్ర స్వామి, అడ్డరోడ్డులోని విజయాంజనేయస్వామి దర్శనానంతరం తిరిగి ఆశ్రమానికి శోభాయా త్ర చేరుకుంటుందని తెలిపారు. ఆశ్రమంలో మంగళహారతి, తీ ర్థప్రసాద కా ర్యక్రమం, అన్నప్రసాద వితరణతో ముగుస్తుందని వివరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీరామ కార్యాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రిక్షాను ఢీకొట్టిన ఆటో

పామూరు, జనవరి 21 : పామూరుకు వస్తున్న రిక్షాను పామూరు నుంచి వెంకటాపురానికి వెళుతున్న ఆటో ఢీకొన్న ఘటనలో రిక్షా కూలీ దేవయ్య తీవ్రంగా గాయపడ్డారు. పామూరు పంచాయతీ పరిధిలోని డీవీ పాలెం నుంచి పామూరుకు రిక్షాపై వస్తున్న బొజ్జా దేవయ్య రిక్షాను పామూరు నుంచి వెంకటాపురం గ్రామానికి ప్రయాణికులతో వెళుతున్న ఆటో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవయ్య తలకు గాయమైంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సను అందించి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


జడ్పీటీసీ సభ్యుడు మారంతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి

మద్దిశెట్టి వర్గీయులతో బూచేపల్లి సంప్రదింపులు

వైసీపీ విజయానికి అండగా నిలవాలని విజ్ఞప్తి

తాళ్లూరు, జనవరి 21 : తాళ్లూరు మండలంలో ఇప్పటి వరకు ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు ముఖ్య అనుచరులుగా ఉన్న పలువురు నేతలను దర్శి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదివారం కలిశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి, తాళ్లూరుకు చెందిన వైస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి ఇళ్లకు స్వయంగా వెళ్లి వారితో సంప్రదింపులు జరిపారు. వైసీపీ ఇన్‌చార్జిగా బూచేపల్లిని అధిష్ఠానం నియమించినప్పటికి కీలక పదవుల్లో ఉన్న జట్పీటీసీ సభ్యుడు, ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, జేసీఎస్ మండల కన్వీనర్‌తో పాటు పలువురు నేతలు బూచేపల్లికి దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మద్దిశెట్టి వర్గీయులను కలిసి పార్టీ విజయానికి అండగా నిలవాలని బూచేపల్లి కోరారు. తాము ఎప్పుడూ వైసీపీలోనే ఉన్నామని, 2009, 2014 మీకోసం, 2019 ఎన్నికల్లో మీరు చెప్పినట్లు మద్దిశెట్టి విజయానికి కృషి చేశామన్నారు. అధిష్ఠాన నిర్ణయం మేరకు మీ విజయానికి కృషి చేస్తామని జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. వైస్‌ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి షెడ్ వద్ద జరిగిన కార్యకర్తల సమావేశంలో బూచేపల్లి మాట్లాడారు. మీకు అండగా ఎల్లప్పుడూ బూచేపల్లి కుటుంబం అండగా ఉంటుందన్నారు. గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుంటున్న అధికార వైసీపీ కీలక నేత, వైసీపీ మండల మాజీ కన్వీనర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇడమకంటి వేణుగోపాల్‌రెడ్డిని బూచేపల్లి కలవకపోవడం చర్చనీయాంశమైంది. తాళ్లూరు గ్రామంలో బూచేపల్లి అనుచరులుగా ఉన్న మాజీ ఎంపీపీ కె.రామిరెడ్డి వర్గీయులు వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి వద్దకు బూచేపల్లితో పాటు వెళ్లకుండా దూరంగా ఉన్నారు. మాజీ ఎంపీపీ కోటరామిరెడ్డి ఏర్పాటు చేసే పార్టీ కార్యాలయ భవనాన్ని బూచేపల్లి పరిశీలించారు. బూచేపల్లి వెంట వైసీపీ మండల కన్వీనర్ తూము వెంకట సుబ్బారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పులి ప్రసాద్ రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లోకిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు చార్లెస్ సర్జన్, చిమటా సుబ్బారావు, కాలేషావలి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు రోజూ నిర్వహించాలి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య

దర్శి, జనవరి 21 : పట్టణంలో పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ఆదేశించారు. నగర పంచాయతీలోని 10, 11 వార్డుల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఉదయం నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త కుప్పలు ఎక్కడా నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు ఎత్తివేయాలన్నారు. కాలువల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పసుపులేటి దత్తాత్రేయ టీడీపీ నాయకులు నారాయణ, కల్లూరి సుబ్బు పాల్గొన్నారు.

అధిష్ఠాన నిర్ణయం మేరకు నడుచుకుందాం..!

వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆదిరెడ్డి

కనిగిరి, జనవరి 21 : వైసీపీ అధిష్ఠాన నిర్ణయం మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని జిల్లా అధికార ప్రతినిధి రాజాల ఆదిరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని హనుమంతునిపాడు మండలానికి చెందిన వైసీపీ నేతలు ఆదివారం ఆయన నివాసంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రాజాల ఆదిరెడ్డి మాట్లాడుతూ పార్టీలోని అసంతృప్తి వాదులతో మాట్లాడి దగ్గర చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విభేదాలకు తావు లేకుండా కనిగిరి అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. రాజాలను కలసిన వారిలో ఎంపీటీసీ సభ్యుడు గూడూరి బెంజిమెన్, మాజీ వైస్ ఎంపీపీ మూరక వెంకట రెడ్డి, కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ దిరిశం ఆదిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, గురుస్వామి, నాగేశ్వరరావు, చిన్నబాలయ్య దానియేలు, వెంకటచెన్నయ్య, పగులయ్య, కత్తి అశోక్, బాలకృష్ణ, రాకేష్ పాల్గొన్నారు.


ఆదిరెడ్డితో సమావేశమైన హెచ్‌ఎంపాడు మండల వైసీపీ నేతలు

47 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక



దొనకొండ రైల్వే కమ్యూనిటీ హాలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దొనకొండ, జనవరి 21 : ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. చదువుకునే రోజులు.. చేసే అల్లరి.. వారితో కలిసి ఆడిన ఆటలు అవన్నీ మధురమైన క్షణాలు. మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ దాదాపు 47 సంవత్సరాల కిందట వారంతా కలిసి ఒకే పాఠశాలలో చదివారు. తరువాత ఎక్కడెక్కడో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో స్థిరపడి కొందరు ఉద్యోగవిరమణ సైతం పొందారు. ఆదివారం వారిలో కొందరు దొనకొండలోని రైల్వే కమ్యూనిటీ హాలులో కలుసుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక, మధుర జ్ఞాపకాలతో దొనకొండ రైల్వే కమ్యూనిటీ హాలు ఆవరణ ఆనందపరవశంతో నిండింది. దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1977-78 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు నిర్వహించుకున్న గెట్‌టుగెదర్ కార్యక్రమంలో దాదాపు 20 మంది పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, ఆప్యాయంగా పలకరించుకుంటూ కుటుంబ సభ్యుల బాగోగులు తెలుసుకుంటూ చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను నెమరేసుకుంటూ పరవశించిపోయారు. అందరూ కలిసి కేకు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని అప్పటి స్నేహ బంధంను గుర్తు చేసుకున్నారు. ఇలా ఎన్నో సంవత్సరాల తర్వాత ఎంతో పని ఒత్తిడిలో ఉన్నా దాదాపు 47 సంవత్సరాల తర్వాత 20 మంది కార్యక్రమంలో పాలుపంచుకొని ప్రతి ఒక్కరిలో ఆనందోత్సవాలు నింపారని వారు చర్చించుకున్నారు. అందరూ కలిసి విందు భోజనాలు ఆరగించి గ్రూప్ ఫొటోలు దిగి కొంగత్త జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.

అనుభూతి వర్ణనాతీతం



జీవితంలో ఇటువంటి అనుభూ తి దొరకదు. చిన్ననాటి స్నేహితులు ఒకచోట చేరడం అదృష్టంగా భావిస్తున్నా. ఒక్కమాటలో చెప్పాలం టే వర్ణించలేను. ఎక్కడెక్కడో ఉన్న వారందరమూ దాదాపు 47 సంవత్సరాల తర్వాత ఒ క్కచోట కలుసుకోవటం ఆనందంగా ఉంది.

- ఎస్‌డీ ఖాదర్‌హుస్సేన్, రైల్వే ఎస్‌ఐ, విజయవాడ


సమావేశమైన బుర్రా మద్దతుదారులు

బుర్రా మద్దతుదారుల సమావేశం

పీసీపల్లి, జనవరి 21 : మండల కేంద్రమైన పీసీపల్లిలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ వర్గీయులు ఆదివారం సమావేశమయ్యారు. ఇటీవల వైసీపీ అధిష్ఠానం విడుదల చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి 4వ జాబితాలో కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్యే బుర్రాను తప్పించి దద్దాల నారాయణయాదవ్‌ను నియమించిన విషయం విదితమే. దీంతో మండలంలో వైసీపీ నాయకులు రెండు వర్గాలుగా వీడారు. ఎంపీపీ జవన్య, మండల కన్వీనర్ బొర్రారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు మరికొంతమంది విజయవాడ వెళ్లి దద్దాలకు మద్దతు తెలిపారు. దద్దాల పేరును ఇష్టపడని మరికొందరు సమావేశాలు ఏర్పాటు చేసి బుర్రాకు మద్దతు తెలుపుతున్నారు. వైఎస్సార్ విగ్రహ ప్రాంగణంలో ఆదివారం మండల సచివాలయాల కన్వీనర్ శీలం సుదర్శన్ మరికొంతమంది నాయకులు సమావేశమయ్యారు. కార్యకర్తల సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యేను కాదని కార్యకర్తలకు పెద్దగా పరిచయం లేని దద్దాలను ఇన్‌చార్జిగా నియమించడం ఏంటని వారు ప్రశ్నించారు. అధిష్ఠానం మరోసారి పునరాలోచన చేసి ఎమ్మెల్యే బుర్రానే నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించి వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వాలని వారు కోరారు. సమావేశంలో పులి వెంకటేశ్వరరెడ్డి, మేకల మాల్యాద్రి, రమేష్, బొడ్డుబోయిన వెంకటేశ్వర్లు, శ్రీను, ఏరువ నరసింహులు, శీలం సుదర్శన్, వెంకటేశ్వర్లు, దేశిరెడ్డి బ్రహ్మరెడ్డి, గుర్రం మాల్యాద్రి ఉన్నారు.

చల్లగా చూడమ్మ గంగమ్మ


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

తాళ్లూరు,జనవరి 21 : తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మకు పొంగళ్లు పెట్టి మొక్కుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటువివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో సందడిగా మారింది. పలువురు వాహన పూజలు చేయించారు. మరి కొందరు గంగమ్మకు విరాళాలుగా సమర్పించా రు. ఆలయ బ్రాహ్మణ అర్చకుడు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. సీఐ జె.రామకోటయ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గురుబ్ర హ్మం దుశ్శాలువాతో సీఐను సత్కరించారు. కార్యక్రమంలో ఆ లయ ఈవో కార్తీక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్ర హ్మం పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ముండ్లమూరు, జనవరి 21 : మండలంలోని పలు గ్రామాల్లో పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు పొంగళ్ల నైవేద్యాన్ని సమర్పించారు. ముండ్లమూరు, బొ ప్పూడివారిపాలెం, ఈదర, పోలవరం, శంకరాపురం, పసుపుగల్లు, వెల్లంపల్లిలో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేశారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన



41వ రోజు శిబిరంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

దర్శి జనవరి 21 : అంగన్‌వాడీల ఆందోళన 41వ రోజు ఆదివారం కొనసాగింది. యూనియన్ నాయకులు తిరుపతమ్మ మాట్లాడుతూ జగన్‌రెడ్డి మొండివైఖరిని తూర్పారబట్టారు. వేతనాలు రూ.26వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే తగిన బుద్ధి చెప్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టీ రంగారావు సందు వెంకటేశ్వరరావు, ఈ నాగేశ్వరరావు, గోగు వెంకయ్య, రంగనాయకులు, యూనియన్‌నాయకురాళ్లు విజయమ్మ, అజిత, కుమారి, నాగమణి, బాలమ్మ పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కార్యకర్తకు నోటీసును ఇస్తున్న పోలీస్ అధికారి

అంగన్‌వాడీలకు ముందస్తు నోటీసులు

పామూరు : అంగన్‌వాడీలు సోమవారం తలపెట్టిన సీఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడిని అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఆ కార్యక్రమానికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లికి వెళ్లకుండా అంగన్‌వాడీ కార్యకర్తలకు ముందస్తు నోటీసులను ఆదివారం అందజేశారు. నోటీసులను కాదని ఎవరైనా విజయవాడకు వెళితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





దాచుకున్న సొమ్ముకూ.. దిక్కు లేదు!





- ఆపత్కాలంలో ఆదుకోని జీపీఎఫ్ నిధులు
- లోను పెట్టుకుని నెలలు గడిచినా దక్కని దుస్థితి
- వడ్డీలకు తెచ్చుకుని అప్పులపాలవుతున్న ఉద్యోగులు
- రెండేళ్లుగా సరండర్ లీవ్ బకాయిలు పెండింగ్
- మూడు డీఏ బకాయిలతో ఉద్యోగుల ఇక్కట్లు
- ఊసే లేని ఏపీజీఎల్ఐ వెబ్‌సైట్

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు తమ భవిష్యత్ అవసరాల కోసం, భద్రత కోసం ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్ రూపంలో నగదు దాచుకుంటారు. పండుగలు, శుభకార్యాలు, ఇతర అత్యవసరాలకు, ఆపత్కాల సమయంలో ఆ దాచుకున్న డబ్బులో నుంచి కొంత రుణం పొంది అవసరాలను నెట్టుకుపోవచ్చన్న కారణంగా ఉద్యోగులు కాస్త స్థిమితంగా ఉంటారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారి పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. ఉద్యోగులు దాచుకున్న గవర్నమెంట్ ప్రావిడెంట్ ఫండ్, ఉపాధ్యాయులు దాచుకున్న జెడ్పీ ప్రావిడెంట్ ఫండ్ నిధులను రూ.19వేల కోట్లను ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో ఉద్యోగులు దాచుకున్న సొమ్ముపై రుణాన్ని కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఉద్యోగులు రుణాలకు దరఖాస్తు చేసుకోవడమే తప్ప, ఆ రుణం ఎప్పుడు మంజూరవుతుందో కూడా తెలియని పరిస్థితి వారిది. దాదాపు తొమ్మిది నెలల క్రితం ఒక మారు రుణాలు మంజూరు చేసిన ప్రభుత్వం, ఆ తరువాత దరఖాస్తు చేసుకున్నవారికి రుణాలు మంజూరు చేయలేదు. దీంతో గడిచిన 9 నెలలుగా వారికి నిరీక్షణ తప్పలేదు. సుమారు వెయ్యిమంది ఉద్యోగులు జిల్లాలో రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యోగుల నుంచి ఒత్తిడి పెరగడం, మరో మూడు నెలల్లో ఎన్నికలు వస్తుండడంతో కంటి తుడుపు చర్యగా ప్రభుత్వం నామమాత్రంగా కొందరికి రుణాలు మంజూరు చేసి మమ అనిపించింది. కాగా మెజారిటీ ఉద్యోగులు ఇప్పటికీ రుణాల కోసం ఎదురు చూస్తున్నారు.

3 డీఏలు పెండింగ్..

పీఆర్సీ జరిగిన తరువాత ఇప్పటికి 3 డీఏలు పెండింగులో వున్నాయి. తొలి డీఏకి సంబంధించి 18 నెలలు, రెండో డీఏకి సంబంధించి 12 నెలలు, మూడో డీఏకి సంబంధించి 6 నెలలుగా ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉంది. వాటిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పీఆర్సీ పేరుతో అప్పటికే వున్న వేతనాలను తగ్గించిన ప్రభుత్వం డీఏలను బకాయి పెట్టడంతో ఉద్యోగులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఏడాదిన్నర కాలంగా డీఏ బకాయిలను చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వ తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డీఏ బకాయిలు విడుదల చేయకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

సెరెండర్ లీవ్స్ పరిస్థితి ఏంటి?

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వున్నారు. వారిలో ప్రభుత్వ ఉద్యోగులకు ఏటా 30, ఉపాధ్యాయులకు ఏటా 6 ఎర్న్‌డ్ లీవ్స్ ఉంటాయి. వాటిని వినియోగించుకోని ఉద్యోగులు వాటిని ప్రభుత్వానికి సరండర్ చేసి వేతనాలు పొందుతారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అవీ ప్రశ్నార్థకంగా మారాయి. ఉద్యోగులు సెలవులైతే సెరండర్ చేస్తున్నారుగానీ ప్రభుత్వం వారికి చెల్లించాల్సిన వేతనాన్ని ఇవ్వడం లేదు. గడిచిన రెండేళ్లుగా ప్రభుత్వం వాటి ఊసే ఎత్తడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 4వేల కోట్ల మేర సరండర్ లీవ్స్ బకాయిలు వున్నట్లు ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు చెబుతున్నారు. వాటి ని తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

- గుంటూరు మండలానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు తన పీఎఫ్ నుంచి రూ.13 లక్షలు రుణం కావాలని కిందటేడాది సెప్టెంబరులో దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పటి వరకూ ఆయన రుణానికి సంబంధించిన ఊసే లేదు. అక్టోబరులో ఆయన పదవీ విరమణ కూడా చేశాడు. అయినా సరే ఆయనకు రుణమూ రాలేదు. పీఎఫ్ నగదూ రాలేదు. ఇప్పటికీ ఆయన ఆ నగదు కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.
- మరో ప్రభుత్వ ఉద్యోగి ప్రాణాంతక ఆరోగ్య సమస్యకు గురై ఆసుపత్రి పాలయ్యాడు. అత్యవసర వైద్యం కోసం అతడికి రూ.6 లక్షలు అవసరమయ్యాయి. జీపీఎఫ్ ఉంది కదా అని దరఖాస్తు చేసుకున్నాడు. కానీ రుణం మాత్రం రాలేదు. దీంతో బయట అప్పు తెచ్చు కుని ప్రాణాలు నిలబెట్టుకోవాల్సి వచ్చింది.

- ఇలా ఒకటి కాదు.. రెండు కాదు ఉమ్మడి గుంటూరు జిల్లాలో గడిచిన 9 నెలలుగా వందల సంఖ్యలో ఉద్యోగులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

పత్తా లేని ఏపీజీఎల్ఐ..

ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే జీవిత బీమా(ఏపీజీఎల్ఐ) ఆచూకీ కూడా కనిపించడం లేదు. దాదాపుగా 9 నెలల నుంచి వందలాది క్లెయిములు పెండింగులో వున్నాయి. ప్రస్తుతం ఏపీజీఎల్ఐ వెబ్‌సైటు కూడా అందుబాటులో లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఆరు నెలల క్రితం మెయిన్‌టెన్స్ పేరుతో వెబ్‌సైటును నిలిపివేసిన ప్రభుత్వం ఆ తరువాత దాని ఊసు ఎత్తడమే మానేసింది. దీంతో ఇప్పటికే మెచ్యూర్ అయిన ఇన్సూరెన్స్ క్లెయిములు, ఇన్సూరెన్సుపై తీసుకునే రుణాల దరఖాస్తులు 9 నెలలుగా అలానే పడివున్నాయి.

- గుట్టుచప్పుడు కాకుండా వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచేసిన ప్రభుత్వం
- మూడు నుంచి నాలుగు రెట్లు ఒకేసారి పెంపు
- 1955 హిందూ వివాహ రిజిస్ట్రేషన్ చట్టం సవరణ పేరుతో వడ్డింపులు
- రిజిస్ట్రార్ ఫీజు రూ.1,100 నుంచి రూ. 5,000 పెంపు
- స్లాట్ బుకింగ్‌కూ రూ.200 నుంచి రూ.500కి పెంపు
- 2023 డిసెంబర్‌లో కొత్త జీఓ జారీ

పెళ్లి నమోదైనా.. బాదుడే

హిందూ వివాహ చట్టాన్ని జనం అభిప్రాయాల మేరకు మార్పులు చేస్తున్నామంటూ... డిజిటలైజేషన్ పేరు చెప్పి వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులను ప్రభుత్వం ఒకేసారి నాలుగు రెట్లు పెంచేసింది. ఈ మేరకు గత ఏడాది డిసెంబర్ 22న 609 జీఓను గుట్టుచప్పుడు కాకుండా విడుదల చేసేసింది. ఆన్‌లైన్‌లో వివాహ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి, స్లాట్ బుక్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నవారు ఒకేసారి భారీగా ఫీజులు పెంచేసిన తీరుచూసి విస్తుపోతున్నారు. అదేమంటే వివాహ వేడుకలకు భారీగా ఖర్చు చేస్తున్నవారు ఆమాత్రం ఫీజులు కట్టలేరా అంటూ ప్రభుత్వ పెద్దలు సమర్థించుకోవడం విశేషం.

ఫీజులు పెంచేశారిలా..

చలానా ఫీజు రూ.200కు బదులు ఏకంగా ఒకేసారి రూ.500కు పెంచేశారు. దంపతులు అందించే సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్‌కు గతంలో రూ.10 చెల్లిస్తే దానిని ఇప్పుడు రూ.100 చేశారు. రికార్డుల తనిఖీ వంటివాటికి కూడా గతంలో రూ.10, ప్రస్తుత సంవత్సరం కాకుండా ప్రతి గత సంవత్సరాలకు రూ.10 చొప్పున చెల్లించాల్సిఉండేది. కానీ ఇదికూడా రూ.100 చేసేశారు. వీటి పరిస్థితి ఇట్లా ఉంటే.. వివాహం చేసుకుంటున్న కళ్యాణ మండపానికో, గుడి దగ్గరకో రిజిస్ట్రార్ వచ్చి వివాహ రిజిస్ట్రేషన్ చేస్తే, దీనికి రిజిస్ట్రార్ ఫీరు రూ.1,100 చెల్లించాల్సి ఉండేది. దీనికి ఏకంగా రూ.5వేలకు పెంచేశారు. పైగా సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్ చెయ్యాలంటే మరో రూ.5,000 చెల్లించుకోవలసిందే. ఇది కేవలం రికార్డుల ప్రకారం అధికారిక చెల్లింపులు మాత్రమే.

తెనాలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): హిందూ వివాహ చట్టం 1955ను 1965లో ఒకసారి, మధ్యలో స్వల్ప సవరణలు చేసినా ఫీజులు మాత్రం గత ప్రభుత్వాలు పెంచనేలేదు. కానీ జగన్ సర్కారు వచ్చాక వరుస వడ్డనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అన్ని శాఖల తరహాలో వివాహ రిజిస్ట్రేషన్‌ల విభాగంపైనా ప్రభుత్వం కన్నుపడింది. గతంలోఉన్న ఫీజులను మాత్రమే మార్పులు చేస్తూ కొత్త జీఓను గత ఏడాది డిసెంబర్‌లో విడుదల చేసింది హిందూ వివాహాలు సాధారణంగా దేవాలయాల్లో, మండపాల్లో, లేక ఇళ్ల దగ్గర బంధువుల సమక్షంలో జరుపుకోవటం ఆనవాయితీ, మరికొందరు ఇటువంటి ఆడంబరాలు ఏమీ లేకుండా రిజిస్ట్రార్ సమక్షంలో సంబంధిత కార్యాలయంలోనే వివాహం చేసుకోవటం కూడా ఎప్పటి నుంచో ఉంది. బయట వివాహాలు చేసుకుని తమ వివాహాన్ని చట్టబద్ధం చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవటం కూడా పరిపాటే. దీనికోసం గతంలో రిజిస్ట్రేషన్ దరఖాస్తుతోపాటు రూ.200 చలానా తీయటం, దంపతులు అందించే ధ్రువీకరణ పత్రాల పరిశీలన, రికార్డుల పరిశీలన వంటి వాటికోసం రూ.50 వరకు చెల్లించటం జరిగేది. ఒకవేళ వివాహం చేసుకుంటున్న కళ్యాణ మండపం, లేక దేవాలయానికే రిజిస్ట్రార్ నేరుగా వచ్చి వివాహాన్ని రిజిస్టర్ చేయాలంటే రూ.1,100 రిజిస్ట్రార్ ఫీజు చెల్లించాల్సి ఉండేది. కానీ వీటన్నిటినీ ఇప్పుడు మూడు నుంచి పది రెట్ల వరకు పెంచేసింది ప్రభుత్వం.

అనధికార వసూళ్లు సరేసరి..

పాత ఫీజులున్నప్పుడే మధ్యవర్తులు వివాహ రిజిస్ట్రేషన్ చేయించినందుకు తమకు, సిబ్బంది లంచాలపేరు చెప్పి రూ.4వేలు వసూలు చేసేవారు. కానీ ఇప్పుడు ఫీజులే భారీగా పెంచేయటంతో ప్రస్తుతం రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు అనధికార వసూళ్లు చేస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం ఈ ఫీజులన్నీ పెంచేయటంతో తాముకూడా దళారీ ఫీజులు పెంచేయాలనే ఆలోచనలో ఉన్నారని, అయితే జీఓ వచ్చి నెలరోజులు మాత్రమే కావటంతో ఎంత పెంచాలనే విషయంలో ఆలోచన చేస్తున్నారని సమాచారం. అంటే ప్రభుత్వం పెంచిన ఫీజులే భారీగా ఉంటే, అనధికారికంగా వసూళ్లు కూడా పెంచేస్తే కొత్త జంటలకు వివాహ చట్టభద్రత ఇక భారమే అయ్యే పరిస్థితి.

డిజిటలైజేషన్ పేరుతో బాదుడే...

హిందూ వివాహ రిజిస్ట్రేషన్ చట్టాన్ని మార్పులు చేస్తున్నట్టు 609 జీఓలో పేర్కొన్న ప్రభుత్వం డిజిటలైజేషన్‌కు సంబంధించి మార్పులు మాత్రం పెద్దగా ఏమీచేయలేదు. ఇప్పుడు డిజిటల్ ధ్రువీకరణ పత్రాలు వచ్చినా, ఇంకా నకళ్లు అడుగుతుండటం విశేషం, ఫారం-ఎ గతంలోనూ అందించాల్సి ఉండేది. అయితే ఇప్పుడు స్లాట్ బుక్ చేసుకున్నాక ఫారం-ఎను ఆన్‌లైన్‌లో నింపటం ఒక్కటే కాకుండా, డౌన్‌లోడ్ చేసి, మళ్లీ వాటికి ఇతర ధ్రువపత్రాలను జతచేసి ఇవ్వాల్సిన పరిస్థితి. మరో విశేషమేమంటే... హిందూ వివాహ చట్టం రూల్స్ మార్చేందుకు ఒక కమిటీని వేశామని, ఆ కమిటీ ముందు జనం వివరించిన అభిప్రాయాలు, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని చట్ట సవరణ చేసినట్టు ప్రభుత్వం పేర్కొంది. అయితే జనాభిప్రాయంలో ఎవరూ ఫీజుల పెంపు సూచనలు చేయటం వాస్తవ విరుద్ధమే.



బాపట్లలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

కొనసాగుతున్న ఆందోళన

- విధుల్లోకి చేరమని తీవ్ర ఒత్తిడి
- లెక్కచేయని అంగన్‌వాడీలు

బాపట్ల, జనవరి 21: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ 41 రోజులుగా సమ్మె చేస్తున్నారు. సమ్మె చేస్తున్న వారిని విధుల్లోకి చేరమని అధికారులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే నోటీసులు జారీ చేసిన ఐసీడీఎస్ అధికారులు విధుల్లోకి చేరకపోతే టెర్మినేషన్ ఆర్డర్స్ ఇచ్చి కొత్తవారిని నియమిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో నియోజకవర్గంలో 75 మంది విధుల్లో చేరారు. కొందరు చేరేందుకు సిద్ధపడుతున్నారు. బాపట్ల ప్రాజెక్ట్ పరిధిలో 253 కేంద్రాలుండగా వర్కర్స్, హెల్పర్స్ మొత్తం 506 మంది ఉన్నారు. ఐసీడీఎస్ పీడీ ఆదేశాల మేరకు సీడీపీఓలు, సూపర్‌వైజర్‌లు వీరిని భయపెడుతున్నారు. ఉద్యోగంలో జాయిన్ కాకపోతే తొలిగించటం ఖాయమని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ వారు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగిస్తూనే ఉన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనేందుకు అనేక మంది బయలుదేరి వెళ్లారు. పోలీసులు విజయవాడ వెళ్లకుండా ఆపేందుకు నోటీసులు జారీ చేస్తున్నట్లు సమాచారం. అధికారులు మాత్రం కౌన్సెలింగ్ ఇస్తూనే జాయిన్ కాకపోతే ఉద్యోగాలు ఊడిపోతాయంటున్నారు. ఈ విషయమై సీడీఎస్ పీడీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు. సీడీపీవో శైలజను వివరణ కోరగా టెర్మినేషన్ ఆర్డర్స్ సిద్ధం చేశామని ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన వెంటనే అందజేస్తామన్నారు.

చలో విజయవాడకు అనుమతి లేదు : ఎస్పీ

అంగన్‌వాడీలు సోమవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి పోలీస్ శాఖనుంచి ఎలాంటి అనుమతి లేదని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతి లేనందున జిల్లాలోని అంగన్‌వాడీలు ఆ కార్యక్రమానికి వెళ్లొద్దని సూచించారు. జిల్లాలోని ముఖ్యమైన మార్గాలలో ఇప్పటికే చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, బస్టాండ్, రైల్వే స్టేషన్ ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు



కారంచేడు, స్వర్ణల మధ్య కొమ్మమూరు కాలువ కట్టకు పడిన గండికి తాత్కాలిక మరమ్మతులు చేసిన దృశ్యం

కడగండ్లు

- గండ్లు పూడిస్తేనే గట్టెక్కేది..!
- కనీస మరమ్మతులు కూడా చేపట్టని దుస్థితి
- బెట్టకొచ్చిన మాగాణి
- ఉన్న పంటను కాపాడుకునేందుకు...
- కొమ్మమూరు ఆయకట్టు రైతుల భగీరథయత్నం

చీరాల, జనవరి 21: ఇటీవల వచ్చిన తుఫాన్ నేపథ్యంలో కొమ్మమూరు కాలువకు పడిన గండ్లకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి సాగునీరు అందిస్తేనే తాము గట్టెక్కేదని, లేదంటే తీవ్రంగా నష్టపోతామని కొమ్మమూరు ఆయకట్టు రైతులు వాపోతున్నారు. 2006వ సంవత్సరంలో వచ్చిన తుఫాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలకు కొమ్మమూరు కాలువకు చిన్న, పెద్దవి కలిపి మొత్తం 70 గండ్లు పడ్డాయి. ఆ క్రమంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తరువాత ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో చేపడతామని ప్రకటన చేశారు. 2007లో మూడు ప్యాకేజీలుగా పనులను విభజించి టెండర్లు పిలిచారు. పనులను పొందిన కాంట్రాక్టరు కేవలం కొంతమేర (10శాతంలోపు) మట్టి పనులు చేసి, ఆ తరువాత కాడి కిందపడేశారు. ఒకటికి మూడు పర్యాయాలు ఈవోటీ (ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్) కూడా ఇచ్చారు. అయినా ప్రయోజనం లేదు. తరువాత బకింగ్‌హాం కెనాల్ ఆధునికీకరణ పేరుతో కొమ్మమూరు ఆధునికీకరణ పనులను, అందుకు సంబంధించిన ఫైలును పూర్తిగా అటకెక్కించారు.

కేడబ్ల్యూడీ(కృష్ణా వెస్టన్ డెల్టా) కింద జిల్లాలోని పర్చూరు, కారంచేడు, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో అధికారికంగా, అనధికారికంగా సుమారు లక్ష ఎకరాల్లో మాగాణి సాగవుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ చివరి దశలో రైతులు వరి సాగు చేశారు. అప్పటికి ప్రభుత్వపరంగా సాగునీరు అందించలేమనే ప్రకటన చేయలేదు. ఆతరువాత వారబందీతో సాగునీరు ఇస్తామని కొద్ది రోజులు, అనంతరం సాగునీరు ఇవ్వలేమని చేతులెత్తేశారు. అప్పటికే నార్లు పోసుకుని, కొన్నిచోట్ల నాట్లు కూడా వేసిన పరిస్థితి. ఈక్రమంలో మిచౌంగ్ తుఫాన్ సర్వం ముంచింది. కొమ్మమూరు కాలువకు సుమారు 40 చోట్ల గండ్లు పడ్డాయి. సాగునీరు కొంత పంటలను ముంచగా, మరికొంత సముద్రం పాలైంది. ఈనేపథ్యంలో మరో పక్షం రోజులకు మాగాణికి నీటి తడులు అవసరం ఏర్పడింది.



కాలువ నుంచి ఆయిల్ ఇంజనుతో నీటిని పంప్ చేస్తూ..

ఎమ్మెల్యే చొరవతో కొంత కదలిక..

చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి దృష్టికి తమ సమస్యను సాగుదారులు తెచ్చారు. దీంతో ఆయన ఎస్ఈతో మాట్లాడారు. దీంతో ఈనెల మొదటి వారంలో వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వాస్తవానికి కాలువ పారుదల సామర్థ్యం మూడు వేల క్యూసెక్కులు కాగా 2500 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేయవచ్చు. కాలువ కట్టలు బలహీనంగా ఉండటం, పలుచోట్ల గండ్లకు తాత్కాలిక మరమ్మతులు చేస్తుండటంతో కేవలం వెయ్యి క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశారు. ప్రస్తుతం కాలువకు సాగునీరు ఆగింది. దీంతో దిగువ ప్రాంత రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పైరు కొన్నిచోట్ల కోత దశకు వస్తే మరికొన్నిచోట్ల పొట్టదశలో ఉంది. ఆ పైరును నీటి తడులు ఇచ్చేందుకు రైతులు భగీరథయత్నం చేస్తున్నారు. అయితే, మరమ్మతు పనులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో చేపట్టలేదు.

అంచనాలకే పరిమితమైన అధికారుల చర్యలు

తుఫాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలకు కొమ్మమూరు కాలువకు సంబంధించి గండ్లు, ఇతర మరమ్మతులకు సంబంధించి 33 ప్రదేశాలను గుర్తించారు. వాటి మరమ్మతులకుగాను రూ.78 లక్షలు వ్యయం అవుతుందని ప్రభుత్వానికి అంచనాల నివేదికను పంపారు. ఇదేమని అడిగిన రైతులు మరమ్మతులకు రూపాయి కూడా విడుదల కాలేదని స్థానిక అధికారులు చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో మాసం ఆగితే తాగునీటి చెరువులకు నీరు నింపాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కొమ్మమూరు ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మిర్చి రైతు గుండె కోత



పర్చూరు, యద్దనపూడి మధ్య మిర్చి పైరుకు నీటి తడికి ఏర్పాటు చేసిన ఇంజన్

- పడిపోతున్న ఎర్ర బంగారం ధరలు
- పెరుగుతున్న పెట్టుబడులు, తగ్గుతున్న దిగుబడులు
- మరలా తడుల కోసం తంటాలు

చీరాల, జనవరి 21: మిర్చి రైతు కంట కన్నీరు ఒలుకుతోంది. అనుకూల వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు ఓ వైపు, దిగజారుతున్న ధరలు, త గ్గుతున్న దిగుబడులు మరో వైపు.. దీనికి తోడు పెరిగిన పెట్టుబడులు.. వెరసి దిక్కుతోచని స్థితిలో మిర్చి రైతు ఆవేదన చెందుతున్నాడు.

పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,557 హెక్టార్లు, రబీలో 4,153 హెక్టార్లులో మిర్చి సాగు చేశారు. గతేడాది ఖరీఫ్‌లోనే సుమారు 4,500 హెక్టార్లలోను, రబీలో సుమారు 1,500 ఎకరాల్లోను మిరప సాగుచేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. దీంతో రబీలో అధికంగా సాగుచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ తరువాత వరుస వర్షాలు, తుఫాన్ల నేపథ్యంలో కురిసిన వర్షాలతో మిర్చి రైతులు కుదేలయ్యారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో నిండా మునిగారు. ప్రభుత్వ పరంగా అందిన సాయం శూన్యం. ఇదిలా ఉంటే ఓ వైపు దిగుబడులు, కాయల నాణ్యత కూడా తగ్గుతోంది. దీనికి తోడు ప్రస్తుతం మరలా రబీలో సాగుచేసిన రైతుల పైర్లు బెట్టకు వస్తున్నాయి. ఆ పైరుకు తడి ఇచ్చేందుకు సాగుదారులు భగీరథయత్నం చేస్తున్నారు. అదనంగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. సాధారణంగా అడుగుకాయలు కోసి విక్రయించగా వచ్చిన సొమ్మును పెట్టుబడిగా ఉపయోగించుకుంటూ మిగిలిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వచేస్తుంటారు. అయితే ప్రస్తుతం అడుగు పంట దిగుబడి అంతంత మాత్రంగా ఉంది. కోసిన కాయలకు కూడా సరైన ధర దక్కటం లేదు. గత ఏడాది క్వింటా రూ.19 వేల నుంచి రూ.23వేల వరకు పలికిన తేజ రకం ప్రస్తుతం రూ.14వేల నుంచి రూ.19వేల మధ్య ఉంది. 2043 రకం గత ఏడాది క్వింటా రూ.50వేల నుంచి రూ.60వేల వరకు పలికింది. అది ప్రస్తుతం రూ.20 మాత్రమే ఉంది. బాడిగ రకాలు గత ఏడాది రూ.22 వేల నుంచి రూ.23వేల వరకు ధర పలికితే ప్రస్తుతం రూ.12వేల నుంచి రూ.13వేల మధ్య ఉంది. ఇక నాటు రకాలు గత ఏడాది క్వింటా రూ.18 వేల నుంచి రూ.22వేల మధ్య ఉంటే ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.18వేల మధ్య మాత్రమే ధర పలుకుతున్నాయి. దీంతో లాభాలు అటుంచి పెట్టిన పెట్టుబడులు వస్తే అదే పదివేలని సాగు దారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మిర్చి కోతలు మొదలయ్యాయి. పెట్టుబడుల కోసం కొందరు అయినకాడికి తెగనమ్ముకుంటున్నారు. ఆర్థిక వెసులుబాటు ఉన్న కొందరు కోల్డ్ స్టోరేజీలో నిల్వచేసే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మిర్చి రైతుల కడగండ్లపై ప్రత్యేక దృష్టి సారించి గిట్టుబాటు ధర లభించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని సాగుదారులు కోరుతున్నారు.



కల్లంలో ఆరబోసిన మిర్చి



కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

టీడీపీతో రాష్ట్రానికి భవిష్యత్

ఎమ్మెల్యే రవికుమార్

మేదరమెట్ల , జనవరి 21: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం కొరిశపాడు మండలం ప్రాసంగలపాడులో నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో పర్యటించి టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమలుచేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్ని జబ్బులకు ఆ రోగ్యశ్రీ వర్తింపచేస్తామని చెప్పి ఆచరణలో చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రులకు చెల్లించాల్సిన నిధులు చెల్లించకపోవడంతో పేదలకు అందాల్సిన వైద్య సేవలు నిలిచిపోయింది నిజం కాదా అని ప్రశ్నించారు. అమ్మఒడి పథకంపై ప్రభుత్వం చెప్పింది ఒకటి, చేస్తుంది మరొకటి అని అన్నారు. ఇంటిలో ఎంతమంది చదువుకుంటే అంతమందికి ఒమ్మఒడి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే మాట మార్చారని చెప్పారు. దళితుల ఉన్నతికి టీడీపీ ప్రభుత్వం అమలుచేసిన ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని జగన్‌రెడ్డి రద్దు చేసి తీరని ద్రోహం చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా రెడీ

- నేడు పోలింగ్ కేంద్రాల్లో ప్రచురణ
- వీటితోనే ఎన్నికలు
- జిల్లాలో కొత్తగా 39,442 యువ ఓటర్లు
- చనిపోయిన 23వేల మందివి తొలగింపు
- ఇక బదిలీలపై కసరత్తు

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 21 : ఓటర్ల తుది జాబితాలు సిద్ధమయ్యాయి. సోమవారం వీటిని ప్రచురించనున్నారు. అందుకు అవసరమైన అన్ని చర్యలను ఎన్నికల అధికారులు తీసుకున్నారు. జిల్లాలోని 2,183 పోలింగ్ కేంద్రాల్లో జాబితాలను ప్రచురించడంతోపాటు గుర్తింపు పొందిన ఏడు రాజకీయ పార్టీలకు వాటిని ఇవ్వనున్నారు. గత ఏడాది అక్టోబరు 27న ముసాయిదా జాబితాను ప్రకటించారు. ఆ సమయంలో జిల్లాలో 17,80,145 మంది ఓటర్లు ఉన్నారు. అనంతరం చేపట్టిన చేర్పులు, మార్పుల సమయంలో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ప్రతిపక్షాలు ఆందోళనకు కూడా చేశాయి. ఈనేపథ్యంలో తుది ఓటర్ల జాబితాలో ఎంత మంది ఉన్నారన్నది చర్చనీయాంశమైంది.

చేర్పులు, మార్పుల కోసం భారీగా దరఖాస్తులు

జిల్లాలో ఓటర్ల సవరణ ప్రక్రియ సమయంలో చేర్పులు, మార్పులు, తొలగింపుల కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. అన్ని రకాలు కలిపి సుమారు 3.10 లక్షలు అధికారులకు అందాయి. వాటిలో ఫారం-6లు 80వేలు, ఫారం-7లు 45వేలు, ఫారం-8లు 1.90 లక్షలు ఉన్నాయి. వాటిపై బూత్‌లెవల్ అధికారులు విచారణ చేశారు. ఆ సమయంలో ప్రతిపక్షాలకు చెందిన వారి ఓట్లను గల్లంతు చేసేలా ఎన్నికల అధికారులు నోటీసులు ఇచ్చారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో తుది ఓటర్ల జాబితాపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

39,442 మందికి కొత్తగా ఓటు హక్కు

జిల్లావ్యాప్తంగా ఈ పర్యాయం కొత్తగా 39,442 యువత ఓట్లు నమోదయ్యాయి. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇవి కీలకం కానున్నాయి. ఎన్నికల కమిషన్ యువత ఓట్ల నమోదుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో అందుకు అనుగుణంగా డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 51వేల మంది యువతీయువకుల ఓట్లు నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. వారిలో 39,442 మందికి ఓటు హక్కు కల్పించారు. ఈవిషయంలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో నిలిచింది.

మృతుల ఓట్లు 23వేలు తొలగింపు

ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం కూడా మృతుల ఓట్లు అలాగే ఉన్నాయి. దీనిపై జిల్లావ్యాప్తంగా విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో మృతుల వివరాలను సేకరించి వారి ఓట్లను తొలగించారు. అలా జిల్లావ్యాప్తంగా సుమారు 23వేల మంది మృతుల ఓట్లను తొలగించినట్లు సమాచారం. అయితే ఆ పేరుతో అర్హుల ఓట్లను కూడా తొలగించారన్న ఆరోపణలు ఉన్నాయి.

నేడు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురణ

జిల్లాలోని 2,183 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలను సోమవారం ప్రచురించేందుకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ఓటర్ల జాబితాలను నియోజకవర్గాల వారీగా విభజించారు. వాటిని నియోజకవర్గాలకు పంపి అక్కడి నుంచి మండలాల పోలింగ్ కేంద్రాలకు చేరుస్తున్నారు.

బదిలీలపై కసరత్తు

తుది ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం అధికారుల బదిలీల ప్రక్రియ ఊపందుకోనుంది. ఇప్పటికే జోనల్ స్థాయిలో తహసీల్దార్ల బదిలీలు ప్రారంభమయ్యాయి. మనజిల్లా నుంచి ఐదుగురు నెల్లూరు జిల్లాకు వెళ్లగా, ఆ జిల్లా నుంచి ఇక్కడికి ముగ్గురు వచ్చారు. త్వరలో ఎంపీడీవోలు, జిల్లాకు చెందిన ఇతర అధికారులు కూడా బదిలీ అయ్యే అవకాశం ఉంది.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు

ఒంగోలు(విద్య), జనవరి 21 : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల విధుల నుంచి పలువురు అధికారులకు మినహాయింపు ఇస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఆరు నెలల్లో అంటే ఈఏడాది జూన్ 30లోపు ఉద్యోగ విరమణ చేసే అధికారులకు ఈ నిబంధన వర్తిస్తుంది. అలాంటి వారికి ఇప్పటికే ఏమైనా ఎన్నికల బాధ్యతలు అప్పగించి ఉంటే వాటి నుంచి మినహాయింపు ఇవ్వాలి. అదేవిధంగా వారు ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా నుంచి బదిలీ చేయకుండా అదేస్థానంలో కొనసాగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైసీపీ వింత పోకడ

- జీవోలకే ర్యాలీలా
- ఒంగోలులో తాగునీటి సమస్య పరిష్కారానికి ఏడాది క్రితం రూ.339 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు
- కేంద్ర ప్రభుత్వ అమృత్ నిధులకు అధికార పార్టీ నేతల హడావుడి
- అప్పట్లో నగరంలో భారీ బైక్ ర్యాలీ
- నేటికీ ప్రారంభంకాని పనులు
- ఇప్పుడు ఇళ్ల స్థలాల కోసం నిధులు కేటాయిస్తూ జీవో
- మరోసారి ప్రదర్శనకు సిద్ధమైన వైసీపీ శ్రేణులు
- ప్రజల నుంచి విమర్శలు

వైసీపీ నేతల ప్రచార పిచ్చి పతాకస్థాయికి చేరింది. గతంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా జీవో జారీలకే జబ్బలుచరుచుకుంటూ ర్యాలీలు చేయడం ఒంగోలులో సర్వసాధారణమైంది. సరిగ్గా ఏడాది క్రితం కేంద్రం ఇచ్చిన అమృత్ నిధులు రూ.339.92 కోట్లు మొత్తం రాష్ట్రం మంజూరు చేసినట్లు వైసీపీ నేతలు హడావుడి చేశారు. నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కానీ ఇప్పటి వరకూ పనులు ప్రారంభంకాకపోవడంతో ప్రజలు పెదవివిరుస్తున్నారు. ఇప్పుడు ఒంగోలులో పేదలకు ఇళ్ల పట్టాల కోసం అవసరమైన భూసేకరణకు రూ.180 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో మరోసారి వైసీపీ నేతలు ర్యాలీకి సిద్ధమవడం చూసి జనం నవ్వుకుంటున్నారు. ఏడాది క్రితం జారీ అయిన జీవో ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదు.. కొత్త వాటికి ర్యాలీలా అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. జీవోలతో ప్రదర్శనలు చేస్తూ సంబరపడిపోతున్న అధికార పార్టీ నాయకులు పనుల పురోగతిపై దృష్టిపెట్టకపోవడాన్ని విమర్శిస్తున్నారు.



ట్యాంకర్ల నీటిని మోసుకొస్తున్న మహిళలు



ఎప్పటికప్పుడు పైపుల లీకులు

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 21 : ఒంగోలుకు రోజూ తాగునీటి సరఫరా కోసం గత టీడీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం-1 కింద రూ.123 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో గుండ్లకమ్మ నుంచి ఒంగోలులోని వేసవి చెరువులకు నీటి సరఫరా కోసం పైప్‌లైన్‌ల పనులు చేపట్టారు. అప్పట్లో 70 శాతం పనులు పూర్తి చేయగా, ఎన్నికలు రావడంతో మిగిలినవి నిలిచిపోయాయి. గత నాలుగున్నరేళ్లుగా పురోగతి కరువైంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలకు కేటాయించే నిధుల్లో భాగంగా ఒంగోలుకు అమృత్ 2.0 పథకం కింద తాగునీటి అవసరాల కోసం ఏడాది క్రితం నిధులు మంజూరు చేసింది. అయితే దీనిపై అప్పట్లో వైసీపీ ప్రభుత్వం తాము నిధులు కేటాయించినట్లు నానా హడావుడి చేసింది. ఆపార్టీ శ్రేణులు జీవో జారీకే నగరంలోకి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి గొప్పలుపోయారు. కానీ నేటికీ అతీగతీ కరువైంది. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అమృత్ నిధుల కేటాయింపు ఇలా..

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమృత్ పథకం 2.0 కింద మొత్తం 239 నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలను ఎంపిక చేసింది. అందులో కేంద్రం వాటా 1065.594 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా 1189.801 కోట్లు, కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీల వాటా రూ.695.748 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.200.331 కోట్లు ఉపయోగించాల్సి ఉంది. అందులో భాగంగానే ఒంగోలు నగరానికి రూ.339.92 తాగునీటికి కేటాయించింది. అయితే ఈ మొత్తం నిధులన్నీ వైసీపీ ప్రభుత్వమే భరిస్తున్నట్లు ప్రచారం చేసుకోవడంపై విమర్శలు వినిపించాయి.

రాష్ట్రం వాటా రూ.196.32 కోట్లు మాత్రమే

ఒంగోలు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం సరిగ్గా గత ఏడాది జనవరి 20న నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అందులో కేంద్రం వాటాగా రూ.110.87 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.196.32, ఒంగోలు కార్పొరేషన్ ఫండ్ రూ.1.91, మెయింటెనెన్స్ కింద కార్పొరేషన్ భాగస్వామ్యం రూ.7.29 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.23.54 కోట్లు వెరసి మొత్తం రూ.339.93 కోట్లు కేటాయించింది.

టెండర్లు పూర్తయినా ప్రారంభం కాని పనులు

నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం నిధులు కేటాయిస్తూ జీవో జారీ చేసిన కొద్దిరోజులకే టెండర్‌లు కూడా పూర్తయినట్లు సమాచారం. కేంద్రం తొలివిడతగా నిధులు విడుదల చేసినా టెండర్‌లో పాల్గొన్న వారికి పనులు కేటాయిస్తూ వర్క్ ఆర్డర్ ఇంత వరకూ ఇవ్వలేదు. ప్రస్తుతం నిధులు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీయూఎఫ్ఐడీసీ)లోనే ఉన్నట్లు తెలుస్తోంది. మరో రెండు నెలల్లో ఎన్నికలు వచ్చే అవకాశం కనిపిస్తుండగా, పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అప్పట్లో జీవో జారీకే నగరంలో ర్యాలీ

ఒంగోలులో తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు కేటాయిస్తూ జీవో జారీకే వైసీపీ శ్రేణులు హడావుడి చేశాయి. అప్పట్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం కేటాయించిన రూ.339.93 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని, తా గునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. అది జరిగి ఏడాది దాటింది. నేటికీ పను ల్లో పురోగతి కనిపించకపోవడంతో ప్రజలు పెదవివిరుస్తున్నారు.

ఇళ్ల పట్టాల జీవోపై ర్యాలీ, సభ

సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై ఒత్తిడి

గతంలో అనేక ప్రభుత్వాలు పలు అభివృద్ధి పనులకు, సంక్షేమ పథకాలకు జీవోలు జారీ చేశాయి. కానీ వైసీపీ తరహాలో ఎవ్వరూ ర్యాలీలు చేయలేదు. ఇలా జీవోలకు ర్యాలీలు, బహిరంగ సభలతో సరిపెట్టుకుని సంతోషపడటం తప్ప సమస్యల పరిష్కారం గురించి పట్టించుకునే నాథుడేలేడని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల కేటాయింపుపై నోరు మెదపని వైసీపీ నాయకులు ఇప్పుడు కొత్తగా జగనన్న కాలనీల కోసం అవసరమైన స్థలం కొనుగోలుకు నిధులు కోరడం, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం హడావిడిగా రూ.180 కోట్లు విడుదల చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంత వరకూ స్థలం కొనుగోలు కూడా చేయలేదు.. ఇక పట్టాలు ఎప్పుడు ఇస్తారు? ఇళ్ల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుంది? అని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల వేళ ఇదో కొత్త తరహా ఎత్తుగడ అని అభిప్రాయపడుతున్నారు. పేదలపై ప్రేమ ఉంటే ఆ రూ.180 కోట్లు టిడ్కో ఇళ్ల పనులకు కేటాయిస్తే వేల మందికి సొంత ఇంటి కల నెరవేరుతుంది కదా అన్న వాదనను వినిపిస్తున్నారు. గత ఏడాది జీవోకే దిక్కులేదు. తాజా జీవోతో హడావుడా అంటూ ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి.

ర్యాలీ.. సభ విజయవంతం కోసం జనసమీకరణ

ఒంగోలు నగరంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం రూ.180 కోట్లు విడుదల చేయడంతో ఆపార్టీ శ్రేణులు తెగ సంబరపడిపోతున్నాయి. మంగళవారం ఒంగోలు కర్నూలు రోడ్డు బైపాస్ నుంచి నగరంలో ర్యాలీతోపాటు, స్థానిక చర్చి సెంటర్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. దీంతో ఆపార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి పెంచారు. ప్రజలను పెద్ద సం ఖ్యలో సమీకరించేందుకు ఆర్పీలను సమాయత్తం చేశారు. ఒక్కో ఆర్పీ కనీసం వంద మందికి తగ్గకుండా, అదనంగా మరో ఐదుగురు బైక్‌లపై హాజరయ్యేలా చూడాలని మెప్మా, కార్పొరేషన్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సచివాల య సెక్రటరీలు, వార్డు వలంటీర్లపై కూడా ఒత్తిడి పెంచారు. ఇదిలా ఉండగా శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పుట్టిన రోజు సందర్భంగా నగరమంతా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా, వాటిని సోమవారం ఒంగోలులో జరిగే వైసీపీ సభ కోసం హడావిడిగా రాత్రికి రాత్రే తొలగించారు. అయితే గతంలో నెలల తరబడి వైసీపీ ఫ్లె క్సీలు నగరంలో ఉంచినప్పటికీ పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు సైతం 24 గంటలు గడవక ముందే టీడీపీ ఫ్లెక్సీ లు తొలగించడం పాలకుల పెత్తనానికి నిదర్శనంగా నిలుస్తోంది.

గిద్దలూరు వైసీపీలో మరో ట్విస్ట్

- టికెట్ కోసం మళ్లీ రంగంలోకి రాంబాబు
- పోటీపడ్డ రెడ్డి సామాజికవర్గం నాయకులు
- హైదరాబాద్‌లో పంచాయితీ
- అన్ని విషయాలు సీఎం దృష్టికి తీసుకెళ్తా : బాలినేని

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గిద్దలూరు అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థి ఎంపిక విషయంలో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. రెడ్డి సామాజికవర్గంలో దీటైన అభ్యర్థి కోసం ఆపార్టీ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి సమాలోచనలు చేస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు మళ్లీ రంగంలోకి వచ్చారు. గిద్దలూరు నుంచి తిరిగి తాను పోటీచేయనని గత నెలలో రాంబాబు ప్రకటించిన విషయం విదితమే. ఆతర్వాత సీఎంను కలిసినప్పుడు కూడా అదేమాట చెప్పి వచ్చారు. అనంతరం గిద్దలూరు నుంచి బాలినేనిని రంగంలోకి దింపాలని అధిష్ఠానం ప్రయత్నించడం, ఆతర్వాత అనేక మలుపులు చోటుచేసుకున్న విషయమ విదితమే. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులను సీఎం సమకూర్చడంతో ఒంగోలు నుంచే పోటీకి బాలినేని సిద్ధమయ్యారు. దీంతో గిద్దలూరు నుంచి రెడ్డి సామాజికవర్గం వారికి అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో దీటైన అభ్యర్థికోసం అన్వేషణ ప్రారంభించారు. శనివారం సీఎంను బాలినేని కలిసినప్పుడు టికెట్ ఆశిస్తున్న వారిలో తగు ఆర్థికస్థోమత ఉన్న వారిని ఎంపికచేయాలని సూచించారు. దీంతో పలువురు ఆశావహులు ఆదివారం హైదరాబాద్ వెళ్లి బాలినేనిని కలిశారు.

రాంబాబుకే టికెట్ ఇవ్వాలని అనుచరుల విజ్ఞప్తి

నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే రాంబాబు అనుచరులు పెద్దసంఖ్యలో బాలినేని వద్దకు చేరారు. ఎమ్మెల్యే రాంబాబు పోటీకి సిద్ధంగా ఉన్నారని, తిరిగి ఆయనకే అవకాశం ఇవ్వాలని వారంతా బాలినేనిని కోరారు. పోటీచేయనని రాంబాబు ప్రకటించిన విషయాన్ని బాలినేని ప్రస్తావించగా మీరు (బాలినేని) గిద్దలూరు నుంచి పోటీచేస్తారన్న ఉద్దేశంతో రాంబాబు ఆ ప్రకటన చేశారని, ఇప్పుడు మీరు ఒంగోలు నుంచే బరిలోకి దిగేందుకు సిద్ధపడిన నేపథ్యంలో ఆయన పోటీకి రెడీ అయ్యారని చెప్పినట్లు తెలిసింది. ఆయనకే అవకాశం ఇవ్వాలని వారు కోరారు. అయితే ఆర్థికంగా ఇబ్బంది ఉందని రాంబాబు చెప్పారు కదా అని బాలినేని అనగా తామంతా సహకరిస్తామని వారు చెప్పినట్లు తెలిసింది.

రెడ్డి సామాజికవర్గం నేతల పట్టు

బాలినేని సూచనతో టికెట్ ఆశిస్తూ హైదరాబాద్ వెళ్లిన రెడ్డి సామాజికవర్గం నాయకులు మాలో ఒకరికే అవకాశం ఇవ్వాలని, మళ్లీ వెనుకడుగు వేయకూడదని పట్టుబట్టినట్లు సమాచారం. నియోజకవర్గానికి చెందిన నాయకుల్లో రమణారెడ్డి, ఐవీ రెడ్డి, చేగిరెడ్డి లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులతోపాటు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి కుమారుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కూడా బాలినేనిని కలిసి టికెట్ అడిగిన వారిలో ఉన్నారు. కొత్తగా రంగంలోకి వచ్చిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తనకు సమీప బంధువైన అనంతపురం జిల్లాకు చెందిన ఒక వైసీపీ నాయకుడితో ముందుగానే సీఎంను కూడా కలిసి టికెట్ కోసం విజ్ఞప్తిచేసినట్లు సమాచారం. పోటీచేయనని ప్రకటించిన రాంబాబు తిరిగి తెరపైకి రావడం వెనుక ఏదో కుట్ర ఉందని టికెట్ ఆశిస్తున్న రెడ్డి సామాజికవర్గ నేతలంతా బాలినేని వద్ద అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిసింది. చివరగా బాలినేని మాట్లాడుతూ అన్ని విషయాలు సీఎంతో మాట్లాడతానని, ఆయన తీసుకునే నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించినట్లు సమాచారం. అయితే తిరిగి రాంబాబు రంగంలోకి రావడం నియోజకవర్గ వైసీపీలోని ఆయన వ్యతిరేక, అనుకూల వర్గాల్లో తీవ్రచర్చనీయాంశమైంది. ఈనేపథ్యంలో సీఎం ఎవరివైపు మొగ్గు చూపుతారనేది తేలాల్సి ఉంది. అయితే అందరినీ పక్కనపెట్టి స్థానికేతర నాయకుడిని రంగంలోకి దింపే అవకాశం కూడా లేకపోలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

భట్టుపల్లిలో వైసీపీకి భారీ షాక్

- జగన్‌రెడ్డికి ఓట్లు వేసి మోసపోయామంటూ శ్రేణుల ఆవేదన
- టీడీపీలో చేరిన 30కుటుంబాలు

పీసీపల్లి : మండలంలోని భట్టుపల్లి పంచాయతీలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన 30 కుటుంబాలు ఆ గ్రామ వైసీపీ నాయకుడు చెన్నుబోయిన మాలకొండయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉగ్ర నరసింహారెడ్డిని కలిసి టీడీపీలో చేరారు. వైసీపీని వీడి టీడీపీలో చేరడానికి గల కారణాలను మాలకొండయ్య తదితరులు వివరించారు. ఒక్కసారి ఒక్కచాన్స్ అంటూ పాదయాత్రలో అనేక హామీలు ఇచ్చిన జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే హామీలను విస్మరించి ఓట్లు వేసిన అందరినీ మోసం చేశారన్నారు. పార్టీలో చేరిన వారిలో చెన్నుబోయిన మాలకొండయ్య, చెన్నుబోయిన నరసింహారావు, నాగేంద్ర, ఆదిలక్ష్మి, ఆదిలక్ష్మమ్మ, మన్నేపల్లి భాస్కర్, ఎర్మియా, శాంసన్, యోహాన్, జాన్‌పీటర్, జైరావు, డబ్బుగొట్టు నాగరాజు, డబ్బుగొట్టు నాగార్జున, కుడుముల చిట్టి, బండి రవికుమార్, బండి మాలకొండయ్యలతోపాటు మొత్తం 30కుటుంబాలకు చెందినవారు వైసీపీలో చేరారు.

47 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక



దొనకొండ రైల్వే కమ్యూనిటీ హాలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దొనకొండ, జనవరి 21 : ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. చదువుకునే రోజులు.. చేసే అల్లరి.. వారితో కలిసి ఆడిన ఆటలు అవన్నీ మధురమైన క్షణాలు. మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ దాదాపు 47 సంవత్సరాల కిందట వారంతా కలిసి ఒకే పాఠశాలలో చదివారు. తరువాత ఎక్కడెక్కడో ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో స్థిరపడి కొందరు ఉద్యోగవిరమణ సైతం పొందారు. ఆదివారం వారిలో కొందరు దొనకొండలోని రైల్వే కమ్యూనిటీ హాలులో కలుసుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక, మధుర జ్ఞాపకాలతో దొనకొండ రైల్వే కమ్యూనిటీ హాలు ఆవరణ ఆనందపరవశంతో నిండింది. దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1977-78 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు నిర్వహించుకున్న గెట్‌టుగెదర్ కార్యక్రమంలో దాదాపు 20 మంది పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, ఆప్యాయంగా పలకరించుకుంటూ కుటుంబ సభ్యుల బాగోగులు తెలుసుకుంటూ చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను నెమరేసుకుంటూ పరవశించిపోయారు. అందరూ కలిసి కేకు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని అప్పటి స్నేహ బంధంను గుర్తు చేసుకున్నారు. ఇలా ఎన్నో సంవత్సరాల తర్వాత ఎంతో పని ఒత్తిడిలో ఉన్నా దాదాపు 47 సంవత్సరాల తర్వాత 20 మంది కార్యక్రమంలో పాలుపంచుకొని ప్రతి ఒక్కరిలో ఆనందోత్సవాలు నింపారని వారు చర్చించుకున్నారు. అందరూ కలిసి విందు భోజనాలు ఆరగించి గ్రూప్ ఫొటోలు దిగి కొంగత్త జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.

ఎస్ఈబీలో భారీగా బదిలీలు

- ఐదుగురు సీఐలకు స్థానచలనం
- ఇతర జిల్లాల నుంచి ఎనిమిది మంది రాక
- 11 మంది ఎస్సైలు కూడా..

ఒంగోలు (క్రైం), జనవరి 21 : ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)లో భారీగా బదిలీలు జరిగాయి. జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు సీఐలకు స్థానచలనం కల్పించారు. ఈ స్థానాలతోపాటు ఇప్పటికే ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఇతర జిల్లాల నుంచి ఎనిమిది మందిని నియమించారు. మరో 11 మంది ఎస్సైలను కూడా బదిలీ చేశారు. ఈమేరకు ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఒంగోలులో సీఐగా పనిచేస్తున్న బి.లతను గుంటూరు-2కు పంపారు. ఆస్థానంలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో పనిచేస్తున్న బి.సూర్యనారాయణను నియమించారు. మార్కాపురంలో పనిచేస్తున్న ఎస్.రాఘమయిని నెల్లూరు-2కు, కావలిలో పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును మార్కాపురంనకు బదిలీ చేశారు. కనిగిరిలో పనిచేస్తున్న జలీల్‌ను పల్నాడు జిల్లా వినుకొండకు స్థానచలనం కల్పించారు. ఆస్థానంలో రేపల్లెలో పనిచేస్తున్న లీనాను నియమించారు. ఎర్రగొండపాలెం ఎస్ఈబీ సీఐగా ఉన్న వెంకటరమణను పల్నాడు జిల్లా గురజాలకు పంపారు. ఆస్థానంలో ఎవ్వరినీ నియమించలేదు. గిద్దలూరులో పనిచేస్తున్న అరుణకుమారిని తిరుపతి జిల్లా నాయుడుపేటకు పంపారు. అక్కడ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సీఐగా ఉన్న ఎస్.కొండారెడ్డిని నియమించారు. ఖాళీగా ఉన్న పొదిలి సీఐగా పల్నాడు జిల్లా ఈపూరులో పనిచేస్తున్న బి.ఈశ్వరయ్యను బదిలీ చేశారు. సింగరాయకొండకు నెల్లూరు జిల్లా కోవూరులో పనిచేస్తున్న వి.నరహరిరావును, నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో పనిచేస్తున్న ఎం.బాలకృష్ణను కంభం, మంగళగిరిలో పనిచేస్తున్న మరియబాబును చీమకుర్తికి స్థానచలనం కల్పించారు.

ఎస్సైల బదిలీలు

జిల్లా నుంచి 11 మంది ఎస్సైలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. వారిస్థానాల్లో ఇతర జిల్లాలలో పనిచేస్తున్న వారిని నియమించారు. ఒంగోలులో పనిచేస్తున్న గోపాలకృష్ణను మార్కాపురం పంపారు. గుంటూరు-2లో పనిచేస్తున్న కల్యాణచక్రవర్తిని దర్శి, పత్తిపాడులో పనిచేస్తున్న చుండూరి గీతను ఒంగోలు, తెనాలిలో పనిచేస్తున్న వినీతారెడ్డిని చీమకుర్తి, గుంటూరు ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న ఎస్కే రిహానాను ఒంగోలు ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేశారు. పెదకూరపాడులో పనిచేస్తున్న ఫణికుమార్‌ను గిద్దలూరు, గురజాలలో పనిచేస్తున్న వై.మోహన్‌ను ఎర్రగొండపాలెం, ఈపూరులో పనిచేస్తున్న సైమన్‌ను కనిగిరికి స్థానంచలనం కల్పించారు.

భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలి


ప్రచారరథం నుంచి మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, జనవరి 21: రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలని, అదొక్కటే మార్గమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని విజయలక్ష్మీపురంలో ఆదివారం టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలసి బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో గ్రామస్థులను కలిశారు. ఇంటింటికి తిరుగుతూ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజాచైతన్య సదస్సులో భాగంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌరీఅమర్‌నాథ్, గంజి పురుషోత్తమ్, నక్కల వెంకటేశ్వర్లు, పులిమి శివకుమార్, నరాల తిరుపతిరాయుడు, పాకల పాండు, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రాములవారి శోభాయాత్ర

వేటపాలెం(చీరాల), జనవరి 21: వేటపాలెం మండలం అణుమల్లిపేట వేణుగోపాలస్వామి గుడి నుంచి అయోధ్యలో రాములవారి ప్రతిష్ఠలో భాగంగా రాముల వారి శోభయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు కోడూరు తరుణ్, గొల్లపూడి సీతారామయ్య, కె.మహేష్, హర్షవర్ధనరెడ్డి, ప్రత్తి వెంకటసుబ్బారావు, రామిశెట్టి చైతన్య, రమేష్, ప్రత్తి వెంకటనాగలక్ష్మి, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం

చినగంజాం, జనవరి 21: మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసియున్న సీతా లక్ష్మణహనుమత్ సమేత కోదండ రామస్వామి దేవస్థానంలో హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠను పురస్కరించుకొని కోదండరామ స్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించనున్నారు. చీరాల, వేటపాలెం, పందిళ్ళపల్లి, కడవకుదురు, చినగంజాం, తిమ్మసముద్రం తదితర గ్రామాలకు చెందిన మహిళా భజన బృందాలు నిర్విరామంగా హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానంలో స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. సోవవారం దేవస్థానంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో బాలరాముని ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామకూరు కొండపై రుద్రాభిషేకం

పంగులూరు, జనవరి 21: మండలంలోని రామకూరు కొండపై కొలువుదీరిన గంగా బాలత్రిపురసుందరీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి వారికి యక్కల వంశస్థులు రుద్రాభిషేకం నిర్వహించారు. తమ వంశదైవమైన రెడంకమ్మతల్లి నెల పొంగళ్ళ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా జరిగిన కార్యక్రమంలో ఒంగోలు మాజీ మున్సిపల్ చైర్మన్ యక్కల తులసీరావు, బాల వెంకటసుబ్బయ్య, తిరుమలరావు, కాశీ విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

రావిపూడి ఆశయాలను కొనసాగించాలి


గ్రంథాలను ఆవిష్కరిస్తున్న హేతువాద ప్రముఖులు

ఇంకొల్లు, జనవరి 21: ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన ప్రముఖ హేతువాది రావిపూడి వెంకటాద్రి రాజీలేని రాడికల్ హ్యూమనిస్ట్‌గా జీవించారని భారత హేతువాద సంఘ అధ్యక్షుడు కుర్రా మనుమంతరావు అన్నారు. స్థానిక రాడికల్ హ్యూమనిస్టు సెంటర్‌లో ఆదివారం రావిపూడి వెంకటాద్రి వర్ధంతి సందర్భంగా మేడూరి సత్యనారాయణ అధ్యక్షతన సమస్మరణ సభ జరిగింది. ఈసందర్భంగా పలువురు హేతువాద ప్రముఖులు పాల్గొని రావిపూడి జీవిత చరిత్ర గురించి మాట్లాడారు. రావిపూడి రచనలను అధ్యయనం చేసి ఉద్యమించాలన్నారు. ఆయన సాహిత్యాలతో చైతన్యవంతం కావాలన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని భారతహేతువాద సంఘ ట్రెజరర్ షేక్ బాబు అన్నారు. రావిపూడి భావాలు-ప్రభావాలు, మానవ విజయం, మానవవాద జీవన విధానం గ్రంథాలను ఆవిష్కరించారు.

ఏపీ హేతువాదసంఘ ప్రధానకార్యదర్శి దరియావలి, ట్రెజరర్ కరణం రవీంద్రబాబు, పూర్వ అధ్యక్షుడు చుంచు శేషయ్య, రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ ప్రధానకార్యదర్శి కరి హరిబాబు, యలమందారెడ్డి, కల్యాణం చంద్రశేఖర్, తాటి సుబ్బారావు, బీరం సుందరరావు, రావి నాగేశ్వరి, మేడూరి లక్ష్మీనారాయణ, కుటుంబసభ్యులు, మిత్రులు పాల్గొని రావిపూడికి నివాళులర్పించారు.

ఎస్ఈబీ సీఐ, ఎస్ఐ బదిలీ

పర్చూరు, జనవరి 21: పర్చూరు ఎస్ఈబీ కార్యాలయంలో పనిచేస్తున్న సీఐ యశోధరాదేవి, ఎస్ఐ శివరామకృష్ణ బదిలీ అయ్యారు. సీఐ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంకు, ఎస్సై నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో అధికారులు బదిలీ అయినట్లు సమాచారం.

గవర్నర్‌ను కలిసిన న్యాయ విద్యార్థి


గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన న్యాయ విద్యార్థి సుభేష్

అద్దంకిటౌన్, జనవరి 21: విజయవాడలోని రాజ్‌భవనలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను అద్దంకిలోని కాకానిపాలెంకు చెందిన న్యాయ విద్యార్థి సందిరెడ్డి సుభేష్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వెస్కాన్సిన్ లా పుస్తకాన్ని, వెస్కాన్సిన్ గవర్నర్ ప్యాలెస్ నమూనాను అందజేశారు. సుభేష్ రాష్ట్ర ప్రభుత్వ విదేశీ విద్యా దీవెన పథకం కింద అమెరికాలోని వెస్కాన్సిన్ యూనివర్శిటీ ఆఫ్ లా కళాశాలలో ఎల్ఎల్ఎం గ్రాడ్యుయేషన్ చదువుతున్నాడు.

రంగస్థల కళాకారుల అభ్యున్నతికి తోడ్పాటు

అద్దంకిటౌన్, జనవరి 21: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యను ఆదివారం విజయవాడలోని తన నివాసంలో ఆ పార్టీ బాపట్ల జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గోవాడ శ్రీకాంత్, అధికార ప్రతినిధి చెబ్రోలు వెంకటసుబ్బయ్య కలిశారు. వైసీపీ ప్రభుత్వం జీవో నెంబర్ 7 ద్వారా చింతమణి నాటకాన్ని రద్దుచేసి కళాకారులను రోడ్డు పడవేసిందన్నారు. అద్దంకిలో ప్రముఖ్య రంగస్థలం కళారులైన అద్దంకి మణిక్యాలరావు, బండారు రామారావు విగ్రహాలను ప్రతిష్ఠించే బాధ్యతను తాను తీసుకుంటానని వర్ల రామయ్య పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కళాకారుకులకు ఇళ్ల స్థలాలు, 6 వేల రాష్ట్ర ప్రభుత్వ కళాకారుల పెన్షన్ ఇచ్చి వారి అభ్యున్నతికి తోడ్పాటును అందిస్తామన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి..

- టీడీపీ, జనసేన కలయికతో స్వర్ణ యుగం
- ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేయాలి
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


కొణిదెన గ్రామ టీడీపీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బల్లికురవ, జనవరి 21: టీడీపీ, జనసేన కలయికతో రానున్న రోజుల్లో స్వర్ణ యుగం రానుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం మార్టూరు మండలం జొన్నతాళిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బల్లికురవ మండలం కొణిదెన, గంగపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ నేతలతో మాట్లాడుతూ గ్రామాలలో నేతలు, కార్యకర్తలు సమిష్టిగా ఉంటూ రానున్న రోజుల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఓటర్ల జాబితాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బోగస్ ఓట్లు ఉన్నా, నిజమైన ఓటర్ల ఓట్లు తొలగించినా వెంటనే జాబితాలను తనిఖీ చేసుకొని అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. టీడీపీ మేనిఫెస్టోపై ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించాలన్నారు.

అనంతరం ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఒక వైపు రాష్ట్రం అప్పులకుప్పగా మారిపోతుంటే, వైసీపీ ప్రభుత్వం మాత్రం ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు చెరుకూరి అంజయ్య, యనమాల నాగార్జున, పోలినేని రామయ్య, గుంజి సుబ్బారావు, యిన్నమూరి సత్యం, చిట్టిబోయిన ఏడుకొండలు, కోసనం జగన్నాధం, బండిబాబు, జంధ్రాజుపల్లి దేవదాస్, నట్టి అంజకమ్మ, కోడుగడ్డ ఏలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలి

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఏలూరి సాంబశివరావు

కారంచేడు(పర్చూరు), జనవరి 21: రైతాంగానికి చుక్కనీరు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం కారంచేడు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ అరాచక ప్రభుత్వానికి కాలంచెల్లిపోయే రోజులు దగ్గరపడ్డాయని మండిపడ్డారు. తుపాను ప్రభావంతో నష్టపోయిన ఏఒక్క రైతును ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. అధికార పార్టీ నేతలు ఇసుక, మైనింగ్‌లతో కోట్లకు పడగలెత్తుతున్నారని ఆరోపించారు. జగన్ పాలనకు కాలం చెల్లిందన్నారు. అక్రమ మార్గాన అధికారంలోకి వచ్చేందుకు సీఎం జగన్ నానాపాట్లు పడుతున్నారన్నారు. సొంతపార్టీ నేతలే జగన్‌ను నమ్మే స్థితిలో లేరని చెప్పారు. టీడీపీ, జనసేన పొత్తుతో ఉమ్మడిగా పోదాం, అరాచక ప్రభుత్వాన్ని గద్దెదింపుదాం అని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై తీవ్రభారం పడిందన్నారు. విద్యుత్, ఆర్టీసీ, నిత్యావసర వస్తువుల ధరలుల పదేపదే పెంచి ప్రజలపై పెనుభారం మోపారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక, రంజాన్ తోఫా ఏమయ్యాయని ప్రశ్నించారు. మద్యపాన నిషేధం చేస్తామని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలను తీస్తుందని మండిపడ్డారు. వైసీపీ నేతల వేధింపులతో ఎస్సీలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. భూరక్ష చట్టం అమల్లోకి వస్తే మీ భూములు గోవిందా...గోవిందా అని అన్నారు.

కారంచేడు గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ఏలూరికి ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. తొలుత మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరితో భేటీ అయ్యారు. కొద్దిసేపు అక్కడి నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత బళ్లారి జట్టు


ఫైనల్ పోటీలో తలపడుతున్న బళ్లారి - శ్రీకాకుళం జట్లు

పర్చూరు, జనవరి 21: పర్చూరులోని ఎరీనా క్రికెట్ స్టేడియంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన జాతీయస్థాయి క్రికెట్ పోటీలలో బళ్ళారి జట్టు విజయం సాధించింది. ఆదివారం శ్రీకాకుళం - బళ్ళారి జట్లు మధ్య ఫైనల్ పోటీ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీకాకుళం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన బళ్ళారి జట్టు 18 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 169 పరుగులు చేసి విజయం సాధించింది. 35 బంతుల్లో 54 పరుగులు చేసి జట్టు విజయానికి కారకుడైన శివరాజ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యాడు. మ్యాన్ ఆఫ్ ది సీరిస్‌గా శ్రీకాకుళంకు చెందిన ప్రసాద్ ఎంపికయ్యారు. మొదటి బహుమతి రూ.3 లక్షలు, రెండో బహుమతి రూ.2లక్షలు, మూడో బహుమతి లక్ష చొప్పున గెలుపొందిన విజేతలకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, అప్పారావు, కోటా శ్రీనివాసరావు, బలరాం, ఉప్పలపాటి అనిల్, రామకృష్ణ, కాలేషా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధానకార్యదర్శిగా మద్దాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు

మేదరమెట్ల, జనవరి 21: ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మేదరమెట్లకు చెందిన మద్దాలి సంజీవరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలో ఆదివారం జిల్లా ఆర్యవైశ్య సంఘం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మూడు మండలాల ఆర్యవైశ్య సంఘాలను నేటి నుండి బాపట్ల జిల్లా పరిధిలోకి వచ్చేవిధంగా తీర్మానాలు చేశారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సంజీవరావు మాట్లాడుతూ జిల్లాలో ఆర్యవైశ్యుల ఉన్నతికి కృషి చేస్తానని చెప్పారు.

కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లబోతు వెంకటేశ్వర్లు, వాసవి సేవాదళ్ అధ్యక్షుడు పెనుగొండ శ్రీను, జిల్లా అధ్యక్షుడు పూనుగుంట శ్రీనివాసరావు, జి.రామారావు, డి.సత్యనారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

యువతి ప్రేమని తిరస్కరించిందని చేతిని కోసుకున్న యువకుడు

అద్దంకి, జనవరి21: యువతి తన ప్రేమని తిరస్కరించిందని యువకుడు చేతిని కోసుకున్న సంఘటన అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన టి.రమేష్ యువతిని ప్రేమించాడు. యువతి ప్రేమను తిరస్కరించటంతో సోమవారం సాయంత్రం భవాని సెంటర్‌లో బ్లేడ్‌తో చేయి కోసుకున్నాడు. రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

అద్దంకి, జనవరి 21: గుండ్లకమ్మ నది నుండి ఇసుక తరలిస్తుండగా పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అద్దంకి పట్టణం సమీపంలోని గుండ్లకమ్మ నది నుండి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ఛిద్రమైన రహదారులు

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పంగులూరు, జనవరి 21: మండల కేంద్రమైన పంగులూరు నుంచి పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు ఛిద్రమయ్యాయి. రహదారులకు ఏర్పడిన గోతులపై రాకపోకలు సాగించలేక ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. పంగులూరు నుంచి ముప్పవరం వెళ్ళే ప్రధాన రహదారితో పాటు జనకవరం నుంచి కోటపాడు, కొండమంజులూరు వెళ్ళే రహదారిలో పలు చోట్ల గోతులు ఏర్పడి రాకపోకలు సాగించడం కష్టంగా ఉందని ఆయా గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జనకవరం నుంచి కొండమంజులూరు వెళ్ళే రోడ్డులో ఏర్పడిన గోతులు


పంగులూరు, చందలూరు మధ్య ఛిద్రమైన రహదారి

పంగులూరు నుంచి చందలూరు వైపు వెళ్ళే రహదారి గోతులతో పాటు ఎత్తు పల్లాలుగా మారడంతో ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

పంగులూరు నుంచి తూర్పు తక్కెళ్ళపాడు వెళ్ళే రహదారిలో గోతులతో పాటు అడుగడుగునా రహదారి ఎగుడు దిగుడుగా ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. తక్షణ చర్యలు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలి

- సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి


కారంచేడులో అంగన్‌వాడీల నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

కారంచేడు(పర్చూరు), జనవరి 21: అంగన్‌వాడీల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. కారంచేడులోని తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా నిలిచారు. ఆదివారం అంగన్‌వాడీలతో కలసి దీక్షా శిబిరంలో కూర్చొని సంఘీభావం తెలిపారు తెలుగుదేశం పార్టీ అంగన్‌వాడీలకు అండగా నిలుస్తుందని చెప్పారు.. నలభై రోజుల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం బాధ్యతారాహిత్యమన్నారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్

చీరాల, జనవరి 21: ప్రభుత్వ సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక రామకృష్ణాపురంలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం చీరాల సాయిప్యాలెస్ రోడ్డులోని షేక్ ఫాతిమాకు రూ.5.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును వారు అందజేశారు. అలాగే వేటపాలెం మండలం పొల్లరిపాలెంకు చెందిన చప్పిడి శ్రీదేవికి లక్షా 70 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల పక్షపాతిగా ఉందన్నారు. అందుకనుగుణంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రజాప్రయోజనాలలే లక్ష్యంగా చేపడుతున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు గవిని శ్రీనివాసరావు, ధనుంజయ్, అంకాళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక మసీదు సెంటర్లో జరుగుతున్న డ్రైయిన్, రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే బలరాం ఆదివారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులకు చెప్పారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏతరవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు

చీరాలటౌన్, జనవరి 21: అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వన్‌టౌన్ పరిధిలోని దండుబాట రోడ్డులో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఓవ్యక్తి అక్రమంగా ఇంట్లో నిల్వచేసిన 184 క్వార్టర్ సీసాలు, ఓ ఫుల్ బాటిల్ స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచారు. పత్రాలు సరిగ్గాలేని పది వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా పోలీసులు మాట్లాడుతూ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై వినీల, ఎస్సైలు జనార్దన్, శ్రీనివాసరావు, ఏఎస్సైలు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

వేమన పద్యాలపై గ్రామాలలో ప్రచారం

బల్లికురవ, జనవరి 21: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో ఆదివారం వేమన జయంతి సందర్భంగా చిలకలూరిపేటకు చెందిన ఇందూ జ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేటితరం ప్రజలకు వేమన పద్యాల గురించి తెలియజేసేందుకు అన్ని గ్రామాలలో ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. వేమన సాక్షాత్తు దేవుడే అని, అందుకే అయనను వేమన భగవాన్ అని పిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు, రామాంజనేయులు, వెంకట్రామిరెడ్డి, గంగయ్య, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యమ్మ, పుల్లయ్య, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలు అవశ్యం

చీరాల, జనవరి 21: సిద్ధాంతపరమైన పోరాటాలతో ప్రగతి సాధ్యమని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం లెనిన్, నూతి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్య పోరాటాలు అవశ్యమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, సీపీఐ నాయకులు మేడా వెంకట్రావు చిరుమల ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, కె.వీరాంజనేయులు, ఎస్.రాజశేఖర్, అచ్యుతిని బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆశ్రమంలో రామ్మూర్తి జయంతి

మార్టూరు, జనవరి 21: స్థానిక అమ్మ ఆశ్రమంలో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ, స్వర్గీయ గానాల రామ్మూర్తి జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ పావులూరి హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు మచ్చా అనంతాచారి, కొండముది రఘు, మల్లికార్జున, వంగవోలు బ్రహ్మం, ఉండవల్లి కృష్ణమూర్తి, గుంటుపల్లి చందు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మైనార్టీ సెల్ కార్యవర్గం

ఇంకొల్లు, జనవరి 21: తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ ఇంకొల్లు మండల నూతన కమిటీని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆమోదించగా, మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు వారి పేర్లు ప్రకటించారు. మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఇంకొల్లుకు చెందిన షేక్ బాబర్‌బాషా, కార్యదర్శిగా షేక్ బాజి, ఉపాధ్యక్షులుగా షేక్ వలి, ఇడుపులపాడుకు చెందిన షేక్ మహబూబ్ సుబాని, ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా కీదరవలి, సూరజ్, ఖాసీం, కార్యదర్శులుగా షేక్ మోదిన్, కరిముల్లా, కార్యవర్గసభ్యులుగా సయ్యద్ కరిముల్లా, పటాన్ బాజీ, ఇసుబ్, షేక్ కాలేషా ఎన్నికయ్యారు. ఇంకొల్లు పట్టణ మైనార్టీసెల్ అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ మీరావలి, షేక్ మస్తాన్‌వలి, ఉపాధ్యక్షులుగా షేక్ ఖాజీవలి, షేక్ సుబాని ఎన్నికయ్యారు.

జనసేన ఎన్నికల సెంట్రల్ కమిటీ కన్వీనర్‌గా అనిల్‌కుమార్



పర్చూరు, జనవరి 21: జనసేన పార్టీ ఎన్నికల సెంట్రల్ కమిటీ కన్వీనర్‌గా పర్చూరుకు చెందిన ఆలా అనిల్‌కుమార్‌ను ఆపార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నియమించటం పట్ల జనసేనులు హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పవన్ కల్యాణ్‌కు అభినందలు తెలిపారు. పార్టీలో తమకు అప్పగించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా నిర్వహించి టీడీపీ, జనసేన పొత్తుతో అధికార వైసీపీని గద్దెదించేలా కృషిచేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన జనసేనులు నాగేంద్రబాబు, నాదెండ్ల మనోహర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ హెల్పర్ మృతి

అద్దంకిటౌన్, జనవరి 21: గత పదిరోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ హెల్పర్ ఆదివారం మృతి చెందారు. అద్దంకి పట్టణంలోని పసుమర్తిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పని చేస్తున్న తెల్ల సుబ్బులు(55) పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అద్దంకిలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సపొందుతూ మృతిచెందారు. మృతదేహాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జి.శారద, కార్యకర్తలు మనోలత, పార్వతి, చంద్రమతి, రమాదేవి, పలువురు ఆయాలు సందర్శించి నివాళులర్పించారు.

కాగా, తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 41వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి నిరసన తెలిపారు.

చికిత్స పొందుతూ అర్చకుడు మృతి

పర్చూరు, జనవరి 21: రోడ్డు ప్రమాదంతో గాయపడి చికిత్స పొందుతూ అర్చకుడు శనివారం రాత్రి మృతి చెందాడు. ఇంకొల్లు మండలం గంగవరం గ్రామానికి చెందిన సోమరాజుపల్లి షణ్ముఖ సదాశివశాస్త్రి(18) పర్చూరులోని శ్రీసాయిబాబ ఆలయంతోపాటు, స్థానిక వైజంక్షన్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయాల్లో అర్చకునిగా పనిచేస్తున్నాడు. ఈనెల 16న తన స్వగ్రామానికి బైక్‌పై వెళుతూ జాగర్లమూడి అడ్డరోడ్డు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు.

దేగరమూడిలో ఏలూరి ఫ్లెక్సీ చించివేత

మార్టూరు, జనవరి 21: మండలంలోని దేగరమూడి గ్రామంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫ్లెక్సీని చించివేశారు. నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ పార్టీ కార్యకర్తలు ఏలూరి, పవన్ కల్యాణ్ బొమ్మలతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని చించిచేశారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఎలాంటి గొడవలకు తాము కారకులు కాకూడదనే కారణంగా ఫ్లెక్సీని చించి వేసినప్పటికీ కార్యకర్తలు మౌనంగా ఉన్నారని గ్రామంలోని టీడీపీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు.



సోమశిలలో 28.512 టీఎంసీల నీటి నిల్వ



అనంతసాగరం, జనవరి 21: సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి జలాశయంలో 28.512 టీఎంసీలలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,450, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లుగా వారు వెల్లడించారు.

అంతా రామమయం..!

- పలు ఆలయాల్లో రామనామ స్మరణ
- బాలరాముడిని కనులారా వీక్షిద్దాం రండి !
- అయోధ్య రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారానికి భారీగా ఎల్ఈడీ స్ర్కీన్ల ఏర్పాటు
- నేడు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, రామభజనలు
- ప్రధాన కూడళ్లలో తోరణాలు, కాషాయ జెండాలు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 21: అయోధ్య రామమందిరంలో సోమవారం మధ్యాహ్నం జరగనున్న బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను తిలకించేందుకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయోధ్య రాముడ్ని చూసేందుకు చిన్నాపెద్ద ఎంతో ఆతృతగా ఎదు రు చూస్తున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీల పిలుపు మేరకు జిల్లాలోని అన్నీ ఆలయాల పరిసరాలను ఆదివారం శుభ్రం చేశారు. వివిధ పరిమళ పుష్పాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో దేవాలయాలను సుంద రంగా అలంకరించారు. సోమవారం ఉదయం నుంచి జిల్లాలోని రామా లయాలతో పాటు వివిధ ఆలయాల్లో అభిషేకాలు, హోమాలు, రామ భజనలు నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పలు ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో ముందస్తు రామభజనలు ప్రారంభించారు. నెల్లూరు నగరంలోనూ జిల్లా లోని ప్రధాన పట్టణాల్లోనూ అయోధ్య రాముడి కటౌట్‌లు, ఫ్లెక్సీలు వెలిశాయి. ఇప్పటికే వీహెచ్‌పీ కార్యకర్తలు జిల్లా అంతటా అయోధ్యలో పూజిం చిన అక్షితలు పంపిణీ చేశారు. రాముడి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం సోమవారం సాయంత్రం ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలని, రామనామకీర్తనలు ఆలపించాలని, భజనలు చేయాలని, ఇళ్లపై కాషాయ జెండాలు ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు.



కావలి : ట్రంకురోడ్డులో ప్రదర్శన నిర్వహిస్తున్న విశ్వహిందు పరిషత్ నాయకులు

● నెల్లూరులో భారీగా కార్యక్రమాలు

అయోధ్య రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నెల్లూరు నగరంలోని సుమారు 150కిపైగా ఆలయాల్లో సోమవారం పూజలు, రామభజనలు చేయనున్నారు. శబరి శ్రీరామక్షేత్రంలో ఉదయం 6గంటలకు అభిషేకాలు, 9గంటలకు శ్రీరామహోమం నిర్వహించనున్నారు. 10 నుంచి రామభజనలు, వీణా కచేరీ, కోలాటాలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 11 నుంచి అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని ఎల్ఈడీ స్ర్కీన్‌పై ప్రదర్శించనున్నారు. అలాగే సోమవారం ఉదయం 10 గంటలకు సంతపేట నాలుగుకాళ్ల మండపం నుంచి గాంధీబొమ్మ వరకు శోభాయాత్ర జరుగుతుంది. అలాగే వేదాయపాలెం, పెద్దబజారు రామమందిరాల ఆధ్వర్యంలో శోభాయాత్రలు ఘనంగా జరు గుతాయని నిర్వా హకులు తెలిపారు. గాంధీబొమ్మ సెంటర్, శివాజీ సెంటర్, చిన్నబ జారు రాణాప్రతాప్ సెంటర్, పప్పులవీధి ఆంజనేయ స్వామి ఆలయం, నిప్పోసెం టర్, వేదాయ పాలెంసెం టర్, భక్తవత్సల నగర్ తదితర ప్రాంతాల్లో ఎల్ఈడీ స్ర్కీన్లపై అయోధ్యలో జరిగే కార్యక్రమాలను వీక్షించేం దుకు ఏర్పాట్లు చేశారు.



కందుకూరు : పామూరు రోడ్డులోని కోదండ రామాలయంలో ఆదివారం జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు



నెల్లూరు పెద్దబజారులోని ఓ దుకాణంలో కాషాయ జెండాల విక్రయం



శోభాయాత్ర నిర్వహిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

వైభవంగా శోభాయాత్ర

నెల్లూరు (విద్య) : అయోధ్య రామాలయ పునఃనిర్మాణం, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని వేదాయపాళెం వేదగణపతి ఆలయ ప్రాంగణంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి అయ్యప్పస్వామి గుడి మీదుగా రాజరాజే శ్వరి ఆలయం, శబరి శ్రీరామ క్షేత్రం మీదుగా వేదగణ పతి ఆలయం వరకు శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో స్థానిక యువకులు, ప్రజలు యాత్రలో పాల్గొని జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్... అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు, యువతకు ట్రస్ట్ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ జరిగే సమయంలో స్థానికంగా ప్రత్యేక కార్యక్రమాలు, పూజల నిర్వహణతోపాటు అన్నదానం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.



విద్యుత్ దీపాల వెలుగులో నెల్లూరు శబరి శ్రీరామక్షేత్రం

ఆదివాసీల అయోధ్య యాత్ర



నెల్లూరు (సాంస్కృతికం): శ్రీశైలం నుంచి కన్యా కుమారికి, అక్కడ నుంచి అయోధ్యకు సైకిల్ ర్యాలీ చేపట్టిన ఆదివాసీ చిన్నారులు ఆదివారం నెల్లూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఆయన స్వగృహంలో కలుసుకున్నారు. యాత్ర గురించి నిర్వాహకుడు వంశీధర్ ఆయనకు వివరిం చారు. దృఢమైన యువతను తయారు చేసేందు కు ఈ యాత్ర చేపట్టామని తెలియచేశాడు. ఈ యాత్ర విజయవంతం కావాలని వేమిరెడ్డి ఆకాంక్షించారు. అనంతరం వారికి ఆర్థిక సహాయం చేసి, యాత్రకు జెండా ఊపి ముందుకు నడిపించారు.



వరికుంటపాడు : గన్నేపల్లి పంచాయతీలోని అడవి పేరంటాలమ్మ ఆలయాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు

బెదిరింపులు, నిర్బంధాలు ఆపండి !

అంగన్‌వాడీల సమస్యలను సామరస్యంగా పరిష్కరించండి : సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

నెల్లూరు (వైద్యం) జనవరి 21: అంగన్‌వాడీలపై బెదిరింపులు, నిర్బం ధాలు ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు జిల్లాలో ఆదివారం నాటికి అంగన్‌వాడీల సమ్మె 41వ రోజుకు చేరుకుంది. నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు సుదీర్ఘకాలంగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం పోరాడు తుంటే ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటం దుర్మార్గమన్నారు. సమస్యలను పరిష్కరించకుండా ఇలా నిర్బంధించడం వల్ల సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉందన్నారు. అంగన్ వాడీల దీక్షలను, ర్యాలీలను భగ్నం చేసేందుకు ప్రభుత్వం పోలీసుల చేత దాడులకు పాల్పడటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం ఇలాంటి చర్యలకు స్వస్తి పలికి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయ కురాళ్లు రజని, మల్లెమ్మ, రమాదేవి, ఉష పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరాహారదీక్షలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్

● ఆత్మకూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో అంగన్‌వాడీలు బైఠాయించి ఆదివారం కూడా సమ్మె కొనసాగించారు. వారికి సీపీఎం, సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు.

● కావలిలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేవరకు వెనక డుగు వేసే ప్రసక్తే లేదని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని వారు హెచ్చరించారు.

పేరెంట్స్ కమిటీలకు
ఎన్నికలు లేనట్టే !?

- పదవీకాలం గడుపు పొడిగింపు
- ఖాళీలు భర్తీకాక చెల్లింపుల్లో ఇబ్బందులు
- పాఠశాలల్లో హెచ్‌ఎంలు, టీచర్లకు కొత్త సమస్యలు

నెల్లూరు (విద్య), జనవరి 21: పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ పాలక వర్గాల గడువు గత డిసెంబరుతో ముగిసింది. అయితే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా వారి పదవీకా లాన్ని పొడిగించింది. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులకు కొత్త చిక్కులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న ఖాళీలను భర్తీ చేయకపోవడంతో చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. జిల్లాలో 2,688 ప్రాథమిక, 361 ప్రాథమి కోన్నత, 418 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,467 సర్కార్ స్కూళ్లు ఉన్నాయి. పాఠశాలల విలీనం, నాడు-నేడు పనులు పూర్తికాక పోవడంతో తరగతి గదుల సమస్య తలెత్తింది. దీంతో కొందరు తల్లిదండ్రులు అసౌకర్యాల నడుమ తమ పిల్లల చదువు సరిగా సాగదని ప్రైవేట్ స్కూళ్ల బాట పట్టారు. మరి కొంతమంది పాఠశాలలను విడిచి వెళ్లిపోయారు. ఇలా వెళ్లినపిల్లల తల్లిదండ్రుల్లో ఎవరైనా స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా, సభ్యులుగా ఉంటే వారిస్థానం లో కొత్తవారిని యమించుకోవాలి. ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున ప్రాథమిక పాఠశాలల్లో 15 మందిని, ఉన్నత పాఠశాలల్లో 24 మందిని పాలకవర్గ సభ్యులుగా ఎన్నుకోవాలి. వైసీపీ అధికారం లోకి వచ్చాక ఈ కమిటీలో అధికార పార్టీకి చెందిన నేతలు తమ వర్గానికి చెందిన వారే చైర్మన్‌లుగా, సభ్యులుగా ఉంచేందుకు పోటీపడ్డారు. తాజా రాజకీయ పరి స్థితుల నేపథ్యం లో ఆయా పాఠశాలల్లో ఖాళీ అయిన పదవులకు పోటీపడేవారే కరువయ్యారు. ఖాళీ అయిన చైర్మన్ స్థానాల భర్తీకి ఆపసోపాలు పడాల్సి వస్తోందని ప్రధానో పాధ్యా యులు చెబుతున్నారు. ఈ పదవులను భర్తీ చేయకుం డా పాలకవర్గాన్ని నడిపే పరిస్థితి లేదని వారంటున్నారు.



● క్షేత్రస్థాయిలో ఇబ్బందులు

కమిటీ చైర్మన్, హెచ్‌ఎంల పేరుతో సంయుక్త బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసుకుని నాడు-నేడు నిధులు ఖర్చు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల నిర్వహణలో పేరెంట్స్ కమిటీ ప్రాధాన్యం కీలకంగా ఉంది. అయితే పాలక వర్గాల గడువు ముగిసినా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించ కుండా పాత కమిటీల పదవీకాలాన్ని పొడిగించింది. ప్రభు త్వం నిర్ణయం తీసుకునే ముందు క్షేత్రస్థాయిలో ఉండే ఇబ్బందులను పరిగణలోకి తీసుకోలేదన్న విమర్శలు వినిపి స్తున్నాయి. అలాగే ఈ కమిటీల్లో అన్ని వర్గాల నుంచి ప్రాతి నిధ్యం కల్పించాల్సి ఉండగా, కొన్ని వర్గాలు తమకు పదవులు వద్దని తిరస్కరిస్తున్నారు. దీంతో బిల్లుల చెల్లింపులు నిలిచి పోయే అవకాశం ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

● కార్పొరేట్లకు దీటుగా... ఒట్టిమాటే !

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పించి కార్పొరేట్‌లకు దీటుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన కార్యక్రమాలు విమర్శలకు తావిస్తోంది. పాఠశాలల అభివృద్ధి కోట్లాది రూపాయలు వెచ్చించామని చెపుతున్నా క్షేత్రస్థాయిలో విద్యార్థుల సమస్యలు మాత్రం తీరడం లేదు. జిల్లాలో కోట్లు వెచ్చించి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లు దిష్టిబొమ్మల్లా మిగిలాయి. ఆగమేఘాలపై నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం అందుకు తగినట్లు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. నాడు-నేడు కింద వసతులు కల్పిస్తామని చెప్పినా అత్యధిక పాఠశాలల్లో నేటివరకు పునాదులే పడలేదు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ, వంటశాలలు, తాగునీరు, విద్యుత్, బెంచీలు, గ్రీన్‌బోర్డుల ఏర్పాటు తదితర వసతులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించినా నేటికీ ఈ పనులు నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. పాఠశాలల నిర్వహణ కోసం విడుదల చేసే నిధులతోనే విద్యుత్, ఇంటర్ నెట్‌బిల్లుల చెల్లింపు, ఫ్యాన్సలు, వాష్‌రూమ్‌లలో ట్యాప్‌లు, పైపులు మరమ్మతులు, కంప్యూటర్‌ల రిపేర్లు చేయిస్తున్నారు. స్టేషనరీ ఖర్చుల కోసం ఈ ఏడాది కేటాయించిన బడ్జెట్‌లో కేవలం 20శాతం మాత్రమే నిధులు విడుదల చేశారు. పాఠశాలల్లో పనులకు ప్రాధాన్య తనిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పలు రకాల ఇబ్బందులు, ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఓవైపు బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడం, మరోవైపు మెటీరియల్స్, సిమెంట్, ఇసుక కొరత ఏర్పడడంతో పనులు నిలిచిపోతున్నాయి. గత ఏడాది పూర్తి చేస్తామని ప్రకటించినా వచ్చే ఏడాదికి కూడా పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదని తల్లిదండ్రుల కమిటీలు చెబుతున్నాయి.

మినుముల ధర
మటాష్ !

- పది రోజుల్లో క్వింటాల్ రేటు రూ.3 వేలు పతనం
- వ్యాపారుల సిండికేట్, దళారుల చేతివాటం
- అయోమయంలో రైతులు

కందుకూరు, జనవరి 21: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన మినుములను నిలువునా దోచుకునేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. కందుకూరు ప్రాంతంలోనే కాక జిల్లాలోని పలు ప్రాంతాల్లో వారంరోజులుగా మినుము నూర్పిళ్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కేవలం పదిరోజుల వ్యవధిలో క్వింటాల్‌కు రూ. 3వేలు ధర తగ్గించిన వ్యాపారులు రైతుల కష్టాన్ని దోచుకునేందుకు సిద్ధమయ్యారు. మినుములకు డిమాండ్ తగ్గింది. ఈ ధర కూడా ఎన్ని రోజులు ఉంటుందో... ఇంకా తగ్గుతుందో ...? చెప్పలేమని దళారులతో ప్రచారం చేయిస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారు.

● రూ.3 వేల పతనం



పదిరోజులక్రితం వరకు క్వింటాల్ మినుములు రూ. 10వేలు నుంచి రూ. 11వేలు వరకు ధర పలుకుతూ వచ్చాయి. ఆరేడు నెలలుగా ఈ ధర స్థిరంగా కొనసాగింది. మేలురకం మినుములు క్వింటాల్ రూ. 11వేలకు కొనుగోలు జరగ్గా, సరుకు నాణ్యతను బట్టి రూ. 10వేలకు తక్కువ కాకుండా ధర పలుకుతూ వచ్చింది. అయితే అనూహ్యంగా అత్యంత నాణ్యత కలిగిన కొత్త మినుములను క్వింటాల్ రూ. 8వేలుకి కొనుగోలు చేస్తున్న వ్యాపా రులు, నాణ్యత తక్కువగా ఉంటే రూ. 7వేలకే కొంటామని చెబుతున్నారు. దీంతో పంట చేతికొస్తే మంచిధరకు అమ్ము కోవచ్చని నూర్పిళ్లు చేసిన రైతులు వ్యాపారుల మాయాజాలం తో బిక్కముఖాలు వేశారు. కొద్దిరోజులు నిల్వ చేస్తే మంచి ధర కు అమ్ముకోవచ్చన్న ఆశ ఓవైపు.. ఒకవేళ ధర ఇంకా తగ్గిపోతుం దేమోనన్న ఆందోళన మరోవైపు వారిని అయోమయానికి గురిచేస్తోంది. కందుకూరు డివిజన్‌తో పాటు ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజక వర్గాలలోను పెద్దఎత్తున మినుము సాగు చేయగా, ప్రస్తుతం నూర్పిళ్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబరు మొదటివారంలో వచ్చిన మిచౌంగ్ తుఫాను మినుము రైతును తీవ్రంగా దెబ్బతీసింది. పంట పూత, కాయదశలో ఉన్న సమయంలో తుఫాను రావటంతో పంట దెబ్బతిని దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి.



సంగంలో వైసీపీ నాయకుడు తాళం వేసింది ఈ గోదాముకే!

- జగనన్న కాలనీల్లో పక్కదారి పడుతున్న సిమెంటు
- నల్లబజారులో విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- ఓ అధికారి తీరుపై విమర్శల వెల్లువ
- గోదాముకు తాళం వేసిన వైసీపీ నేత

గృహ నిర్మాణంలో
బకాసురులు!

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సిమెంటు బస్తాలు పక్కదారి పడుతున్నాయి. గృహ నిర్మాణ శాఖకు చెందిన కొంతమంది అధికారులే బస్తాలను నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఉదయగిరిలో ఓ అధికారి తన ఇంటి నిర్మాణం కోసం తరలించిన సిమెంటు బస్తాలను టీడీపీ నాయకులు గుర్తించారు. తాజాగా సంగంలో అధికార పార్టీ నాయకుడే పక్కదారి పడుతున్న సిమెంట్ బస్తాల వ్యవహారాన్ని గుర్తించి, సదరు గోదాముకు తాళం వేశాడు.

సంగం, జనవరి 21 : సంగం మండలంలో జగనన్న కాలనీ కోసం మొదటి విడతలో 1072 పక్కా గృహాలు మంజూరయ్యాయి. కొందరు లబ్ధిదారులు సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటుండగా, మరికొందరు ముందుకురాలేదు. సదరు ఇళ్లను ఇద్దరు వైసీపీ నాయకులతోపాటు మరో కాంట్రాక్టర్‌కు ఆర్నెల్ల క్రితం నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. 1072 ఇళ్లకుగాను పునాదుల స్థాయిలో 198, బేస్‌మెంట్ స్థాయిలో 367, రూఫ్ లెవల్‌లో 151, శ్లాబ్ లెవల్‌లో 48 ఉండగా 15 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన 293 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. వీటితోపాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మరో 663 పక్కాల గృహాలు మంజూరయ్యాయి. వీటిలో పునాదుల స్థాయిలో 96, బేస్‌మెంట్‌లో 49, రూఫ్‌లెవల్‌లో 29, శ్లాబు లెవల్‌లో 25 ఉండగా 10 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన 454 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.8 లక్షలు ఇస్తుంది. ఇందులోనే స్టీలు, 90 బస్తాల సిమెంట్ సరఫరా చేసి ఇందుకయ్యే ఖర్చు పోను మిగిలిన నగదును నాలుగు విడతల్లో కాంట్రాక్టర్లకు బిల్లులు అందచేస్తారు. దీంతోపాటు ఒక్కో ఇంటి నిర్మాణానికి 5 యూనిట్ల ఇసుక ఉచితంగా ఇస్తుంది.

● 17,480 బస్తాల సిమెంట్ సరఫరా

మండలానికి ఇప్పటివరకు 17,480 బస్తాల సిమెంట్ సరఫరా అయిందని, ఇందులో 11,215 బస్తాలను ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టర్లకు, లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు సీఆర్‌ఓ (సిమెంట్ రిలీజ్ ఆర్డర్)లను హౌసింగ్ అధికారులు చూపిస్తున్నారు. ప్రస్తుతం 1,965 బస్తాల సిమెంట్ గోదాములో నిల్వ ఉంది. మరో 1,965 బస్తాలకు కాంట్రాక్టర్ల నుంచి సీఆర్‌ఓలు రావాల్సి ఉన్నట్లు సమాచారం. అయినా 4300 బస్తాల సిమెంట్‌కు లెక్కలు తేలలేదు. ఈ క్రమంలో మళ్లీ 4 వేల బస్తాల సిమెంట్ గోదాముకు సరఫరా అయింది.

● గోదాముకు తాళాలు

కాలనీ ఇళ్లకు ప్రభుత్వం సరఫరా చేసే సిమెంట్‌లో గోల్‌మాల్ జరిగిందంటూ వైసీపీకి చెందిన ఓ నాయకుడు 4 రోజుల క్రితం గోదాముకు తాళం వేశారు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు సిమెంట్ సరఫరా నిలిచిపోయి లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. కాగా, ప్రభుత్వం సరఫరా చేసే సిమెంట్ బస్తా ధర రూ.277. అదే ప్రైవేట్ మార్కెట్‌లో బస్తా రూ.350. ఈ నేపథ్యంలో సిమెంట్‌ను ఆ శాఖ సిబ్బందే బయటి మార్కెట్‌లో విక్రయిస్తున్నారని తెలియడంతో గోదాముకు తాళం వేసినట్లు వైసీపీ నాయకుడు వాసుదేవరెడ్డి చెబుతున్నారు. ఇది జరిగిన 4 రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సిమెంట్ అక్రమాలపై వచ్చే ఆరోపణలకు బలం చేకూరుతోంది.

4 వేల బస్తాలకు సీఆర్‌వోలు రావాలి

4 వేల సిమెంట్ బస్తాల్లో తేడా ఉన్నమాట వాస్తవమే. అయితే మొదట్లో గోదాము అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చిన సిమెంట్‌ను నేరుగా కాంట్రాక్టర్లకు సరఫరా చేశాం. వారి నుంచి సీఆర్‌వోలు రావాలి. వారే జాప్యం చేస్తున్నారు. ఈ విష యాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.



- కరీముల్లా, హౌసింగ్ ఏఈ

ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం

అంగన్‌వాడీల ఆందోళన



కావలి టౌన్ : నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



ఆత్మకూరు: నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కావలి టౌన్, జనవరి 21: సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం 41వ రోజుకు చేరింది. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నేతలు రఘురావమ్మ, సుబాషిణి, విజలయతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలని నిలబెట్టుకోమని మహిళలు 41రోజుల నుంచి సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రికి చీమకుట్టినట్టు కూడా లేకుండా మొండి వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. చలో విజయవాడ తలపెడితే అర్ధరాత్రి ఇళ్లకొచ్చి నోటీసులు తీసుకోవాలని వత్తిడి చేసి నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆత్మకూరు: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో భైఠాయించి సమ్మెను కొనసాగించారు. వీరికి మద్దతుగా సీపీఎం, సీఐటీయు నాయకులు జి లక్ష్మపతి, ఆత్మకూరు నాగయ్య, జి శివప్రసాద్ శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మెతో అంగన్‌వాడీలు మూతపడడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

కాజ్‌వే, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



కాజ్‌వే, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 21 : మండలంలోని వెన్నవాడ-గండ్లవీడు మధ్యన బొగ్గేరుపై కాజ్‌వే, రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తీరుస్తామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన గండ్లవీడులో బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన గండ్లవీడులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వీటి నిర్మాణ పనులు పూర్తయితే నాలుగు మండలాల్లోని 40 గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణు గోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, వైసీపీ నాయకులు కొల్లి దొరస్వామినాయుడు, ఆత్మకూరు సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వై మోహన్‌రెడ్డి, వైసీపీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, మండల కన్వీనర్ చిట్టమూరి జితేంద్రనాగ్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

హసనపురంలో విజయీభవ యాత్ర

ఏఎస్ పేట: మండలంలోని హసనపురం గ్రామంలో ఆదివారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా డా. బీఆర్ అంబేడ్కర్, డా వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విజయీభవ ప్రచార యాత్ర ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

సీతారామపురం, జనవరి 21 : మండల పరిధిలోని దేవమ్మ చెరువు, పండ్రంగి గ్రామాలలోని నిరుపేద ఎస్టీలకు దాసరి వీరయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆది చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆదినారాయణ, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో 'జయహో బీసీ'



మాట్లాడుతున్న ప్రభాకర్‌రాజు

సీతారామపురం, జనవరి 21: సీతారామపురం గ్రామ పంచాయతీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం టీడీపీ మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని బీసీ కులాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మద్దినేని ఆదినారాయణ, శేఖర్, పిన్నిబోయిన రమణయ్య, తురక వెంకటేశ్వర్లు, మండల ముస్లిం అధ్యక్షుడు పెద్దగౌసు, బీసీ సంఘం నాయకులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయం శుద్ధి

ఉదయగిరిరూరల్, జనవరి 21: మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో ఉన్న అడవి పేరంటాలమ్మ ఆలయాన్ని ఆదివారం బీజేపీ నాయకులు శుద్ధి చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆలయాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఆలయంతో పాటు రామాలయ ప్రాంగణాన్ని సైతం శుభ్రం చేయడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ నివాసాలతో సహా ఆలయాల్లో శ్రీరామ జ్యోతిని వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటస్వామి నాయుడు, ఆవుల రోశయ్య, మేకపాటి మాల్యాద్రినాయుడు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలను పరామర్శించిన వేలూరు



పోలిరెడ్డిని పరామర్శిస్తున్న వేలూరు కేశవచౌదరి

చేజర్ల, జనవరి 21: అనారోగ్యంతో బాధపడుతూ ప్రస్తుతం కోలుకుంటున్న పలు గ్రామాల టీడీపీ నాయకులను మండల టీడీపీ సీనియర్ నాయకుడు వేలూరు కేశవచౌదరి ఆదివారం పరామర్శించారు. తిరుపతి నాయుడుపల్లి గ్రామానికి చెందిన నూతక్కి రామానాయుడు, గాలిపాళెం గ్రామానికి చెందిన ఓరుగుంట రమేష్, ఎన్‌వి కండ్రిక గ్రామానికి చెందిన ముప్పే పోలిరెడ్డిలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రామానాయుడు, తిరుపతినాయుడు, శ్రీనివాసచౌదరి, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ఉదయగిరి, జనవరి 21 : మండల పరిధిలోని క్రిష్ణంపల్లి, అర్లపడియ పంచాయతీల సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, విలేజీ హెల్త్‌క్లినిక్ భవనాలను వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, సర్పంచ్ అక్కి ప్రమీల, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

మండల పరిధిలోని బండగానిపల్లి హాట్ రోడ్డు మరమ్మతు పనులను ఆదివారం వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. దెబ్బతిన్న గ్రావెల్ రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజల విన్నపాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు.

జనసేన, టీడీపీ విజయానికి కృషి చేయాలి : బొల్లినేని



పరికుంటపాడు: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

పరికుంటపాడు, జనవరి 21: ఎన్నికల్లో జనసేన, టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అధికారం ఉందనే అహంకారంతో టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన వైసీపీ గుండాల అంతుచూస్తానని మాజీ శాసనసభ్యుడు బొల్లినేని వెంకటరామారావు అన్నారు. ఆదివారం తోటలచెరువుపల్లిలో బాబు ష్యూరిటీ - భవి ష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైకో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే ప్రజావేదికను కూల్చివేయడంతో పాటు పోలవరం, అమరావతి పనులను నిలిపివేసి కక్ష సాధింపులకు పాల్పడడం దారుణమని మండిపడ్డారు. నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నారా అంటూ సవాల్ విసిరారు. తాను అధికారం చేపట్టిన వెంటనే సాతువారిపల్లి-తోటలచెరువుపల్లి గ్రామాలకు అనుకూలంగా రహదారి నిర్మిస్తానని హామీనిచ్చారు. అనంతరం వైసీపీ నుంచి పార్టీలో చేరిన వందమందికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, పఠాన్ రసూల్, చంద్ర ఉమామహేశ్వరరావు, పోకా మహేష్, చంద్ర వెంకయ్య, పోలిబోయిన శ్రీకాంత్, ముజ్జె లక్ష్మీ నారాయణ, కొమ్మలపాటి జనార్ధన్, సుంకే సభాపతి, నూల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు: వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ శాసన సభ్యుడు, తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. ఆదివారం వింజమూరు పట్టణంలో సుజాత నగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తపై పన్నువేసిన చెత్త ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. టీడీపీ ఏ చార్జీలూ పెంచలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ దంతులూరు వెంకటేశ్వరరావు, పార్లమెంటు నియోజకవర్గ కార్యదర్శి చల్ల వెంకటేశ్వరరావు, గణపం సుదర్శన్‌రెడ్డి, కోడూరు నాగిరెడ్డి, గూడా నర్సారెడ్డి, ఎమ్మెస్ నాయుడు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న చేజర్ల

దుత్తలూరు(ఉదయగిరిరూరల్), జనవరి 21: మండలంలోని బైరవరంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచి ప్రథమ స్థానం సాధించిన జట్టుకు చేజర్ల సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు అధినేత చేజర్ల సుబ్బారెడ్డి ట్రోఫీతో సహా రూ. 30వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గువ్వల శేఖర్‌రెడ్డి, పోలు పుల్లారెడ్డి, చేజర్ల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల భవనం స్వాధీనం

సంగం, జనవరి 21: సంగం పంచాయతీ మజరా వెంకటేశ్వరపురంలో ఉన్న మూసేసిన పాఠశాల భవనాన్ని ఎంఈవో జానకిరామయ్య ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థులు లేక పాఠశాలలను 20 ఏళ్ల కిందట మూసేశారు. అయితే పాఠశాల భవనంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ పనిముట్లతోపాటు దేవుడి విగ్రహాన్ని భద్రపరిచి ఉన్నారు. దీంతో దీనిపై గ్రామానికి చెందిన సుభాస్కర్ అనే వ్యక్తి పాఠశాల భవనం ఆక్రమణకు గురైందని స్పందనలో ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఎంఈవో అందులో ఉన్న సామగ్రిని తీసేసి తాళాలు తీసుకుని భవనం స్వాధీనం చేసుకున్నారు.



మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

దోచుకోవడం తప్ప ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యం

- టికెట్ విషయంలో అధిష్ఠానం నిర్ణయం శిరోధార్యం
- టీడీపీ కావలి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు

కావలి, జనవరి 21: కావలి ఎమ్మెల్యేగా 10 ఏళ్ల పనిచేసిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి కావలికి ఏమి చేశాడో చెప్పాలని టీడీపీ కావలి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు ప్రశ్నించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలుపొందిననాటి నుంచి కావలి అభివృద్ధిని విస్మరించి దొరికినకాడికి దోపిడీ చేశారన్నారు. కాలువలు, వాగులు, వంకలు, గుంటలు, శ్మశానాలు.. ఇలా కనిపించిందల్లా సుమారు 100 ఎకరాలు ఎమ్మెల్యే ప్రోద్భలంతో వారి అనుచరులు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని, వాటన్నింటిలో ఎమ్మెల్యేకు పరోక్షంగా, ప్రత్యక్షంగా వాటాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ ఆక్రమణలకు సంబంధించిన వివరాలను ఆధారాలతో సహా టీడీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జాబితా బయటపెట్టి అవినీతిపరులపై చర్యలు చేపడుతామన్నారు. కావలి ఆర్డీవో దోపిడీ ఎక్కువైందన్నారు. రోజూ వందల ట్రిప్పుల గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. వీటికి బాధ్యులైన అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

టికెట్ ఆశిస్తున్నా... : తాను రెండున్నరేళ్లుగా నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కష్టపడినందున కావలి నుంచి పోటీ చేసేందుకు టికెట్ ఆశిస్తున్నానన్నారు. అయితే టికెట్ విషయంలో చంద్రబాబు నాయుడు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి కావలిలో టీడీపీ అభ్యర్థిని గెలిపించుకు తీరుతామన్నారు. పార్టీలోకి ఎవరు వచ్చినా పార్టీ బలోపేతం కోసం వారిని స్వాగతిస్తామన్నారు. అయితే కొత్త నాయకుల వలన పాత క్యాడర్ తమకు అన్యాయం జరుగుతోందేమోనని భయపడుతోందని, వారికి తాను భరోసాగా ఉంటానన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ ఇన్‌చార్జి అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, నేతలు మన్నవ రవిచంద్ర, మొగిలి కల్లయ్య, జ్యోతి బాబూరావు, బొట్లగుంట శ్రీహరినాయుడు, దావులూరి దేవకుమార్, షేక్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లోనూ గుర్తింపు తేవాలి



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న కావ్య కృష్ణారెడ్డి

కావలిటౌన్, జనవరి 21: జాతీయస్థాయి క్రీడల్లో కావలికి గుర్తింపు తేవాలని టీడీపీ నాయకుడు కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ముసునూరులోని మైదానంలో ఇందిరానగర్ యూత్ ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు మంచి క్రీడా మైదానం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. విన్నర్‌గా నిలిచిన కేసీపీడీ లెవెన్స్‌కు రూ.30,000, రన్నర్‌గా నిలిచిన లెవెన్ బుల్స్‌కు రూ.20,000, తృతీయ స్థానం సాధించిన కేకేఆర్ లెవెన్స్‌కు రూ.10,000, నాల్గవ స్థానంలో నిలిచిన లెవెన్ కింగ్స్‌కు రూ.5,000లతోపాటు ట్రోఫీలను అందజేశారు.

లెనిన్‌కు ఘన నివాళులు



లెనిన్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కందుకూరు, జనవరి 21: సోషలిస్టు వ్యవస్థ రూపకర్త, కమ్యూనిస్టు సిద్ధాంతకర్త వీఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో బి.సురేష్‌బాబు అధ్యక్షతన లెనిన్ శతజయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పోకూరి మాలకొండయ్య మాట్లాడుతూ మార్క్సిజాన్ని రష్యాకు అన్వయించి ప్రపంచంలో మొట్టమొదటి శ్రామికవర్గ రాజ్యాన్ని నెలకొల్పిన లెనిన్ ప్రపంచదేశాలన్నింటికీ ఆదర్శంగా నిలిశారన్నారు. ప్రజాసంఘాల నాయకుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లెనిన్ నాయకత్వంలో విజయవంతంగా నడిచిన అక్టోబరు విప్లవం, శ్రామికవర్గం రాజ్యం ఆవిర్భావం ద్వారా ప్రపంచంలో విప్లవోద్యమాలకు స్వాతంత్ర్యోద్యమాలకు స్ఫూర్తిని ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పవరపు కిషోర్, వై. ఆనంద్‌మోహన్, గాండ్ల హరిప్రసాదు, చనమాల కోటేశ్వరరావు, ఎస్కే. హుస్సేన్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితేనే విజయం సాధ్యం



రామయ్యను సత్కరిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కందుకూరు, జనవరి 21: కష్టపడితే అన్నట్లుగా విజయానికి మూలం శ్రమేనని విశ్రాంత లెఫ్టినెంట్ రమణయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు జూనియర్స్ ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనతికాలంలోనే ప్రకాశంలో ఎన్‌సీసీ ఎదుగుదలకు విద్యార్థుల క్రమశిక్షణే కారణమని ప్రశంసించారు. కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ ఆకడమిక్స్, ఉద్యోగం, ఉపాధితో పాటు ఎన్‌సీసీ కూడా తమ కాలేజీలో అగ్రభాగాన ఉండేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా రామయ్యను ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆఫీసర్లు సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ నిర్వాహకుడు మీరావలి తదితరులు పాల్గొన్నారు.

యాదవులను దగా చేసిన జగన్‌కు బుద్ధి చెప్పాలి

ఉలవపాడు, జనవరి 21 : బీసీలలో బలమైన యాదవ సామాజిక వర్గాన్ని రాజకీయంగా వాడుకొని వదిలేసిన జగన్‌మోహన్ రెడ్డికి రాబోవు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన జంగా కృష్ణమూర్తి, కొలుసు పార్థసారథి, బుర్రా మధుసూదన్‌లను వాడుకొని దెబ్బకొట్టాడని తెలిపారు. రానున్న రోజుల్లో బీసీ ఆత్మగౌరవంతో రామచంద్ర యాదవ్ స్థాపించిన బీసీవై పార్టీ తరుపున పోటీ చేసి సత్తా చాటాలని, వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క పైసా నిధులు కేటాయించకుండా మోసగించిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు బీసీలు కంకణం కట్టుకోవాలని పేర్కొన్నారు.

నెల్లూరుకు తరలిన రజక యువకులు

లింగసముద్రం, జనవరి 21 : నెల్లూరులో ఆదివారం జరిగిన రజకుల చైతన్య సభకు లింగసముద్రం నుంచి పలువురు రజక యువకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి మధుసూదనరావు, కామేపల్లి మాలకొండయ్య, కామేపల్లి శ్రీనివాసులు, కొల్వపల్లి శ్రీనివాసులు, అరవింద్, సతీష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లకు ఆదర్శం డాక్టర్ రామ్



డాక్టర్ రామ్‌కు నివాళులర్పిస్తున్న బాధ్యులు

కావలి, జనవరి 21: వైద్య రంగంలో విశేష సేవలు అందించిన నెల్లూరు ప్రజావైద్యశాల వ్యవస్థాపకుడు పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి(డాక్టర్ రామ్) డాక్టర్లకే ఆదర్శప్రాయుడిగా నిలిచారని రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డిలు తెలిపారు. డాక్టర్ రామ్ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ముసునూరు గిరిజన కాలనీలో వేడుకలు నిర్వహించారు. అనంతరం గిరిజనులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలిగా ఉదయలక్ష్మి



కావలిటౌన్, జనవరి 21: బీజేపీ మహిళామోర్చా పట్టణ అధ్యక్షురాలిగా కామినేని ఉదయ లక్ష్మి రెండవసారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పార్టీ రెండవ సారి అవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉందని, అందుకు సహకరించిన మోర్చా జిల్లా అధ్యక్షురాలు కరణం సుభాషిణి, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్, రాష్ట్ర నాయకులు కందుకూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందంకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు మినరల్ వాటర్

దగదర్తి(బిట్రగుంట), జనవరి 21: దగదర్తి మండలం ఎలుపోడు పంచాయతీలో ఎంపీపీ తాళ్ళూరి వెంకట కృష్ణ ప్రసాద్ నాయుడు తల్లి సుజాతమ్మ జ్ఞాపకార్థం మినిరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. పేదప్రజలకు తాగు నీరు అందించాలన్న లక్ష్యంతో నిర్మించిన ఈ ప్లాంటును ఆయన కుమార్తెలు తాళ్ళూరి లక్ష్మీశివాణి, అస్మిత చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. స్వచ్ఛమైన తాగునీరు అందచేసినందుకు స్థానిక మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. తాళ్ళూరి రమణయ్య నాయుడు, సర్పంచు ఒట్టికాళ్ల రవి, మాజీ ఎంపీటీసీ ఇష్టంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మినిరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంపీపీ

కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు



కందుకూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న రామభక్తులు


కందుకూరు, జనవరి 21: అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరగనున్న సందర్భంగా పట్టణంలోని పామూరురోడ్డులో ఉన్న కోదండరామాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులచే తయారు చేయించిన వెండి మకరతోరణాన్ని సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండరామునికి అలంకరించి అభిషేకం, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించగా మహిళలు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు స్వచ్ఛందంగా షాపుల మూసివేత

అయోధ్యలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా వీక్షించడం కోసం స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలని కోరుతూ రామభక్తులు ఆదివారం సాయంత్రం కందుకూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని పెద్దబజారు నుంచి ప్రధాన వీధులలో ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డాక్టరు తన్నీరు మల్లికార్జున తదితరులు మాట్లాడుతూ మధ్యాహ్నం వరకు ప్రతి ఒక్కరూ దుకాణాలు మూసివేసి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలని, దగ్గరలోని రామాలయానికి వెళ్లి శ్రీరాముని అనుగ్రహాన్ని పొందాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని అంకమ్మ దేవాలయంలో ప్రత్యేక ప్రసారం ఏర్పాటు చేశామని అక్కడికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని, పెద్దబజారులోని కోదండరామాలయంలో పుష్పయాగం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా పట్టణంలోని జనార్ధనస్వామి ఆలయంలో ఆదివారం ఆలయశుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో కోటిహనుమాన్ చాలీషా పారాయణయజ్ఞంలో భాగంగా ఏకాదశ హనుమాన్‌చాలీషా పారాయణం కార్యక్రమాలు నిర్వహించగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, ధనలక్ష్మి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: వెండి మకరతోరణం ధరించిన స్వామి



బిట్రగుంట : విద్యుత్ అలంకరణలో రామాలయం

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శన

కావలిటౌన్ : అయోధ్య రామాలయంలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో ట్రంకురోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. ఐదులాంతర్ల సెంటర్ వద్ద నుంచి ప్రారంభమైన ప్రదర్శనలో భక్తులు కషాయ జెండాలు చేతపట్టి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. పుల్లారెడ్డి నగర్ వద్దనున్న సత్యనారాయణ స్వామి ఆలయం వరకు ప్రదర్శన నిర్వహించి అక్కడ వక్తలు ఉపన్యాసాలు ఇచ్చారు. ఉదయం బీజేపీ నేతలు పట్టణ పరిధిలోని పలు ఆలయాలు శుద్ధి చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నేతలు గునుపూడి సుబ్బరాయుడు, సురేంద్రరెడ్డి, వేదగిరి సూర్యనారాయణాచార్యులు, బీజేపీ నేతలు భరత్‌కుమార్, కందుకూరి సత్యనారాయణ, బ్రహ్మానందం, వీపీ రంగారెడ్డి, సీపీసీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆలయం ముస్తాబు

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో వెలసి ఉన్న కోదండరామాలయంలో సీతారామలక్ష్మణాంజనేయ స్వాములకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలో ముస్తాబు చేశారు. ఆలయంలో రెండు రోజుల పాటు పూజాకార్యక్రమాలు ఉంటాయని అర్చకులు నరేష్ ఆచార్యులు తెలిపారు. కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో శ్రీరామనామ సంకీర్తన, పూజలు జరిగాయి.